www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 18-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 243 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 10.06 తదుపరి చవితి; నక్షత్రం: పుష్యమి రా. 12.58 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ. 8.48-10.25; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.33; అమృతఘడియలు: రా. 6.30-8.07; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 5.40 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలంగాణలో ఎంబీబీఎస్ చేసినవాళ్లు లోకలే

పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు వాళ్లు అర్హులే: టీ-హైకోర్టు



ఈ కోవలో ఏపీ, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల విద్యార్థులు

వారు స్థానికులు కాదన్న ప్రభుత్వ ఉత్తర్వులు కొట్టివేత

ఈ తీర్పు ప్రస్తుత విద్యా సంవత్సరానికే: ధర్మాసనం

12

జేపీసీకి జమిలి బిల్లులు

లోక్‌సభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు.. ఓటింగ్‌కు పట్టు

అనుకూలంగా 269 ఓట్లు.. వ్యతిరేకంగా 198 ఓట్లు

మొదటి అడుగులోనే లభించని 2/3 ఆధిక్యం!

టీడీపీ, శివసేన శిందే వర్గం సంపూర్ణ మద్దతు

రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం: విపక్షాలు

దేశ హితం కోసమే జమిలి: అర్జున్‌రామ్ మేఘ్వాల్

గైర్హాజరైన 20 మంది బీజేపీ ఎంపీలకు నోటీసులు

విస్తృత చర్చల నిమిత్తం జేపీసీ పరిశీలనకు బిల్లులు!



జమిలి ఎన్నికల బిల్లులను ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరుతూ లోక్‌సభలో జరిగిన ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులు

న్యూఢిల్లీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ఉద్దేశంతో మోదీ సర్కారు చేపట్టిన 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'కు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది! ఈ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాడీవేడి చర్చ, బిల్లులను ప్రవేశపెట్టే తీర్మానంపై ఓటింగ్ అనంతరం.. జమిలి ఎన్నికలకు సంబంధించి అత్యంత కీలకమైన రెండు బిల్లులను కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లుల్లో ఒకటి.. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024 కాగా, రెండోది కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు-2024. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను కొట్టిపారేసిన అర్జున్ రామ్ మేఘ్వాల్.. ఈ ఎన్నికలకు రాజకీయాలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఉభయ సభల ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు కేంద్ర జాబితాలోనే ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రాల అధికారాలను, రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని ఈ బిల్లులు దెబ్బతీయవని, దేశ హితం కోసమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు.. ఈ బిల్లులను విస్తృత చర్చల నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. జేపీసీలో దీనిపై

మిగతా 2వ పేజీలో...

90 రోజులు
31 మంది సభ్యులు..
జమిలి బిల్లులపై 48 గంటల్లో జేపీసీ

2029 నుంచే జమిలి ప్రక్రియ
లోక్‌సభ పదవీ కాలానికి అనుగుణంగానే అసెంబ్లీల పదవీకాలం
బిల్లులో పలు కీలక అంశాలు

జమిలి మనకు కొత్త కాదు
లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీకి 9సార్లు ఉమ్మడి ఎన్నికలు
పాతికేళ్ల నుంచి ఏకకాలంలో నిర్వహణ

కంప్యూటర్ ఆధారిత పరీక్ష కేంద్రాలు
ప్రభుత్వ సంస్థల్లోనే..

ఏడాదిలో ఎన్‌టీఏ ఆ దిశగా చర్యలు తీసుకోవాలి

నవోదయ, కేవీలను సీబీటీ కేంద్రాలుగా చేయాలి

50 మంది పరీక్షలు రాసేలా గ్రామాల్లో కేంద్రాలు

దేశవ్యాప్తంగా ఏకకాలంలో 2-2.5 లక్షల మంది సీబీటీ పరీక్షలు రాయగలిగే వనరులుండాలి

ఆర్.రాధాకృష్ణన్ కమిటీ నివేదికలో వెల్లడి

వచ్చే ఏడాది ఎన్‌టీఏ ప్రక్షాళన: ధర్మేంద్ర ప్రధాన్

2



మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు

రోగుల చెంతకే వైద్య సేవలు!

టెక్నాలజీతో వైద్య రంగంలో అద్భుతాలు: సీఎం

మెడికల్ సైన్స్.. ఇప్పుడు మెడ్‌టెక్ సైన్స్

డీప్‌టెక్‌పై విద్యార్థులు పట్టు సాధించాలి

ఎయిమ్స్ అభివృద్ధికి మరింత సహకరిస్తాం

మరో 10 ఎకరాలు కేటాయించేందుకు సిద్ధం

రాష్ట్రపతి ముర్ము జీవితం స్ఫూర్తిదాయకం

మారుమూల గ్రామం నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగారు.. చంద్రబాబు ప్రశంసలు

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సైన్స్‌లో టెక్నాలజీ వినియోగంతో వైద్య రంగంలో అద్భుతాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సాంకేతికతతో రోగుల చెంతకే వైద్య సేవలు తీసుకెళ్లవచ్చని తెలిపారు. మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవంలో ఆయన

మిగతా 14వ పేజీలో...

వైద్య వృత్తి మానవ సేవకు గొప్ప మార్గం

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి బ్యాచ్‌తోనే గుర్తింపు: రాష్ట్రపతి

వారే ఆ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్లు.. సేవ, అభ్యాసం, పరిశోధనపై దృష్టి పెట్టాలి

దేశంలో మెడికల్ టూరిజం అభివృద్ధి చెందుతోంది.. ఇందులో వైద్యులదే ప్రధాన పాత్ర

కొత్త సవాళ్లకు పరిష్కారంలో భాగంగా ఎయిమ్స్‌లో సైటోజెనిటిక్స్ లేబొరేటరీ: ముర్ము



ప్రసాదరెడ్డి ఇష్టారాజ్యం!

ఏయూలో అడ్డగోలు నియామకాలు

50 మందికిపైగా గెస్టు ప్రొఫెసర్లు

ఒక్కొక్కరికీ నెలకు రూ.80 వేల జీతం

అస్మదీయులకు పీహెచ్‌డీ ప్రవేశాలు

ఇంటర్ సర్టిఫికెట్లు సైతం జారీ

మాజీ వీసీ దారుణాలు ఎన్నెన్నో

ఉన్నత విద్యాసంస్థ పరువు తీసిన వైసీపీ బంటు

విచారణకు విద్యావంతుల డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని (ఏయూ) గాడిలో పెడుతున్నానని అనేకసార్లు ప్రకటించుకున్న మాజీ వైస్ చాన్సలర్(వీసీ) ప్రసాదరెడ్డి సరిదిద్దుకోలేని తప్పులు చేసి యూనివర్సిటీ ప్రతిష్ఠను మసకబార్చారని మేధావులు, విద్యావంతులు విమర్శలు గుప్పిస్తున్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీకి అప్రకటిత నేతగా వ్యవహరించి, ప్రభుత్వ పెద్దల ఆశీస్సుల కోసం, వీసీగా అదే కుర్చీలో కొనసాగడానికి వర్సిటీని

మిగతా 12వ పేజీలో...

'విన్నపాల'పై విన్యాసాలు!

గత వైసీపీ ప్రభుత్వ బాధితులు, రైతులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజల నుంచి వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఎంతో ఆశతో మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిస్తోంది. అయితే అధికార యంత్రాంగం ఆ దిశగా పనిచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఫిర్యాదులను పరిష్కరించకున్నా బాధితులకు న్యాయం చేసినట్టు అధికారులు నివేదికలు పంపుతున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఒత్తిడి రాకుండా తప్పించుకునేందుకు వాటిని బుట్టదాఖలు చేస్తున్నారు. ప్రజా సమస్యలను తీర్చకపోగా, ప్రజల్లో సంతృప్త స్థాయి బాగుందంటూ మాయ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పరిష్కారంపై అధికారుల మాయ లెక్కలు

దరఖాస్తులు పరిష్కారమైనట్టుగా ఎంట్రీలు

పైస్థాయిలో ఒత్తిడి రాకుండా బుట్టదాఖలు

'పెండింగ్' కనిపించకుండా మేజిక్

సంతృప్త స్థాయి బాగుందంటూ నివేదికలు

కలెక్టర్ల సదస్సులో సీఎం ప్రశ్నల వర్షం

సరైన సమాధానాలు చెప్పని అధికారులు

ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవాలని నిపుణుల సూచన


సమస్యలకు శాశ్వత పరిష్కారం చూడండి

అధికారులను ఆదేశించిన మంత్రి లోకేశ్

13

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మీ రాష్ట్రంలో ప్రజాఫిర్యాదుల పరిష్కారం అప్ టూ మార్క్ (ఆశించిన స్థాయిలో) లేదంటూ ఢిల్లీలో ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ నాతో అన్నారు. నాకు ఆశ్చర్యం వేసింది. సీఎంకు వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్లు పరిష్కరించకపోతే ఎలా? వినతుల పరిష్కారం హేతుబద్ధంగా లేకపోతే ప్రజల్లో మాపై నమ్మకం సడలిపోదా'.. ఇటీవల కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తం చేసిన ఆందోళన ఇది. 2014-19 మధ్యకాలంలో ప్రజల వినతుల పరిష్కారం ఎలా చేశారో? ఇప్పుడూ అదేపంథా కొనసాగిస్తున్నారని ముఖ్యమంత్రి నిష్ఠూరమాడారు. దీన్నిబట్టి క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ప్రజాఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ ఓ మిథ్యగా సాగుతోందని ముఖ్యమంత్రి చెప్పకనే చెప్పినట్లు అయిందని నిపుణులు అంటున్నారు. కేవలం కాగితాల్లోనే



మిగతా 9వ పేజీలో...



పర్యాటక పాలసీతో
అద్భుతాలు

12

పెట్టుబడిదారులకు అండగా ఉంటాం

భయంలేకుండా ఏపీలో పెట్టుబడులు పెట్టండి

పర్యాటకానికీ పరిశ్రమల తరహా రాయితీలు

పర్యాటక పెట్టుబడిదారుల భేటీలో మంత్రి దుర్గేష్

ఏపీ పర్యాటక పాలసీ-2024 విడుదల

తొలి పైప్డ్ గ్యాస్ రాజధానిగా
అమరావతి

12

ఐవోసీ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత

కోస్తాకు వాన గండం

11

పెన్షన్ అనర్హులకు
నోటీసులు



వివరణ బాగుంటే కొనసాగింపు.. లేకపోతే భరోసా పింఛన్ల రద్దు

అధికారులకు సెర్ప్ సీఈవో ఆదేశాలు.. రాష్ట్ర వ్యాప్తంగా 3.5 లక్షల మంది అనర్హులు ఉన్నట్టు సర్కారు అంచనా

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హత లేని వారికి సామాజిక భద్రతా పింఛన్లను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే.. ఉన్నట్టుండి రద్దు చేయకుండా అనర్హులుగా గుర్తించిన వారికి తొలుత నోటీసులు ఇచ్చి, వారి నుంచి వివరణ తీసుకోనున్నారు. లబ్ధిదారులు ఇచ్చే వివరణ ఆమోదయోగ్యంగా ఉంటే వారికి పింఛన్‌ను కొనసాగిస్తారు. లేకపోతే రద్దు చేయనున్నారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో వీరపాండ్యన్

మిగతా 12వ పేజీలో...

చేనేత వస్త్రాల
ధరలు పెంపు

సంక్షేమ శాఖల కొనుగోళ్లకు వర్తింపు

ఏటా 10% పెంపునకు ప్రభుత్వం ఓకే

విద్యార్థి చొక్కాకు రూ.98.90.. ప్యాంట్‌కు రూ.175.40

11

2024-25 సంవత్సరానికి వర్తింపు

ఆర్టీసీ సిబ్బందికి
నైట్ అలవెన్సు

విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు

జీతంతో పాటు చెల్లించాలని ఆదేశం

రూ.300 నుంచి రూ.150కు

12

కోశారంటూ ఉద్యోగుల ఆవేదన





18 వేల మంది భారతీయులపై
బహిష్కరణ కత్తి!

అమెరికాలో అక్రమ వలసదారుల జాబితా సిద్ధం

ఇందులో ఏపీ వారు.. పంజాబీలు, గుజరాతీలు

తిప్పి పంపేందుకు నేషనల్‌గార్డ్స్‌ను వాడతా: ట్రంప్

ఇది తమ దేశంపై 'దురాక్రమణ' అని వ్యాఖ్య

2

భారత్ సహకరించడం లేదంటూ ఐసీఈ నిందలు

ఆ బియ్యం విలువ రూ.2.23 కోట్లు

పేర్ని నాని గోదాముల్లో మాయమైన బియ్యంపై మంత్రి స్పష్టత

రెండో గిడ్డంగిలో తనిఖీల తర్వాత విలువ పెరిగే అవకాశం

డీడీలు ఇస్తే సరిపోదు... క్రిమినల్ కేసులూ నమోదవుతాయి

ఇకపై బియ్యం స్మగ్లింగ్ చేస్తే పీడీ యాక్ట్: మంత్రి మనోహర్

బియ్యం రవాణాకు అనుమతులున్నాయా?

ఎగుమతిని అడ్డుకునేందుకు ప్రభుత్వానికి ఉన్న అధికారాలు ఏమిటి?

పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచండి.. హైకోర్టు ఆదేశం

13

'స్టెల్లా'లో 1,320 టన్నుల రేషన్ బియ్యం.. కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడి

మా వాటా తేల్చాకే

గోదావరి జలాల్లో ఛత్తీస్‌గఢ్ వాడుకోని 147 టీఎంసీలూ మాకే దక్కుతాయి

గోదావరి-కావేరి అనుసంధానంపై తేల్చిచెప్పనున్న ఆంధ్రప్రదేశ్

14

రేపు రాష్ట్రాలతో కేంద్రం సమావేశం

మద్దతు ధరలకు
చట్టబద్ధత!

వ్యవసాయ రుణాల మాఫీ

'పీఎం కిసాన్' 12 వేలకు పెంపు

సంచలన సిఫారసులు చేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం

2

ఆత్మహత్యల నివారణకు అవే బ్రహ్మాస్త్రాలని కమిటీ స్పష్టీకరణ

జేపీసీకి జమిలి బిల్లులు!





(మొదటి పేజీ తరువాయి)

విస్తృత చర్చలు జరుగుతాయని.. జేపీసీ నివేదికను క్యాబినెట్ ఆమోదిస్తుందని, అనంతరం ఈ బిల్లులపై సభలో మరోసారి చర్చ జరుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కాగా.. తొలుత ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో దీనిపై ఓటింగ్ జరిగింది. దాంట్లో అనుకూలంగా 269 మంది ఓటు వేయగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కాగా.. జమిలి ఎన్నికలకు పూర్తి మద్దతునిస్తున్నామని టీడీపీ నేత, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. తమ నేత చంద్రబాబు నాయుడు ఇలాంటి వినూత్న ఆలోచనల విషయంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. 2024లో ఎన్నికలకు రూ.10వేల కోట్లకు పైగా ఖర్చయిందని, ఒకేసారి ఎన్నికలు జరిగితే 40% ఖర్చు తగ్గిపోతుందని లా కమిషన్, నీతీ ఆయోగ్ నివేదికలు కూడా సమర్పించాయని గుర్తుచేశారు. లోక్‌సభలో నలుగురు సభ్యులను కలిగి ఉన్న వైసీపీ కూడా ఈ బిల్లుకు మద్దతు తెలిపింది. అలా తెలిపిన ఏకైన ఎన్డీయేతర పార్టీ వైసీపీనే కావడం గమనార్హం. లోక్‌సభలో సభ్యులే లేని బీజేడీ వైఖరి ఇంకా తెలియాల్సి ఉంది. ఆ పార్టీకి రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. ఇక.. విప్ జారీ చేసినప్పటికీ అనేక మంది బీజేపీ సభ్యులే మంగళవారం ఓటింగ్ సమయంలో సభకు గైర్హాజరు కావడం గమనార్హం. అలా సభకు రాని 20 మంది బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ నోటీసులు పంపింది. మంగళవారం సభలో 467 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో మూడింట రెండువంతుల మంది అంటే.. 311 మంది! కానీ అనుకూలంగా వచ్చిన ఓట్లు 269 మాత్రమే. సాధారణంగా రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి సభలో మూడింట రెండొంతుల మంది సభ్యుల ఆమోదం అవసరం. బిల్లులను ప్రవేశపెట్టడానికి 2/3 మెజారిటీ అవసరం లేదుగానీ.. ఆ మెజారిటీని అధికార పక్షం ఇప్పుడే సమకూర్చుకోలేకపోవడం ఈ బిల్లు భవిష్యత్తును సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

15 పార్టీలు వ్యతిరేకం..32 అనుకూలం

కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, శివసేన (యూబీటీ), టీఎంసీ, అకాలీదళ్, ఎంఐఎం, ఐయూఎంఎల్, ఆరెస్పీ సహా 15 పార్టీలు ఈ బిల్లులను వ్యతిరేకించగా.. బీజేపీ, తెలుగుదేశం పార్టీ, శివసేన (శిండే వర్గం) సహా 32 పార్టీలు సమర్థించాయి. రాజ్యాంగ మౌలిక స్వభావంపై ఈ బిల్లులు దాడి చేస్తున్నాయని, రాజ్యాంగంలోని కొన్ని అంశాలను పార్లమెంట్ కూడా మార్చలేదని కాంగ్రెస్ సభ్యులు మనీశ్ తివారీ, గౌరవ్ గొగోయ్ విమర్శించారు. రాష్ట్రాల ఎన్నికలను కూడా నిర్ణయించడం రాజ్యాంగానికి వ్యతిరేకమని మనీశ్ తివారీ మండిపడ్డారు. "ఇది రాజ్యాంగ వ్యతిరేక బిల్లు. దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. మేం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. "కేంద్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎందుకు పడిపోవాలి?" అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రశ్నించారు. వేరొకరి టైమ్‌టేబుల్ కోసం.. ప్రజా తీర్పు మేరకు పాలన సాగిస్తున్నవారి టైమ్‌టేబుల్ ఎందుకు కుదించుకుపోవాలి?" అని నిలదీశారు. ఒకవేళ ప్రస్తుత వ్యవస్థను జమిలి ఎన్నికలతో మార్చేసినా.. భవిష్యత్తులో కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రభుత్వం కూలిపోతే మళ్లీ ఇదే తరహా గందరగోళం ఏర్పడుతుందని థరూర్ అభిప్రాయపడ్డారు. కాబట్టి ఇప్పుడు జరుగుతున్న వ్యవహారమంతా నిరర్థకం, నిష్ఫలమని వ్యాఖ్యానించారు. ఇక.. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయని సమాజ్‌వాదీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ విమర్శించారు. దేశంలో భిన్నత్వాన్ని, సమాఖ్య స్ఫూర్తిని ఈ బిల్లు దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. లోక్‌సభ పదవీకాలానికి, శాసనసభ పదవీకాలానికి ఎలా ముడిపెడతారని తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. ఈ బిల్లులు రాష్ట్రాల శాసనసభలకు ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని హరిస్తాయని అన్నారు. జమిలి ఆచరణ సాధ్యం కాదని, అది దేశంలో నియంతృత్వపాలనకు దారితీస్తుందని.. ప్రజాస్వామ్యం, వైవిధ్యం దెబ్బతింటాయని డీఎంకే నేత టీఆర్ బాలు అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ఈ బిల్లులు వ్యతిరేకమని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఇక.. జమిలి ఎన్నికలకు తమ పార్టీ వ్యతిరేకమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని, నియంతృత్వానికి దారితీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజ్యాంగాన్ని సొంత ఆస్తిలా

భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ-గాంధీ కుటుంబం వ్యక్తిగత జాగీరుగా, సొంత ఆస్తిగా మార్చుకొందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. పార్లమెంటును మోసగించిందని ఆరోపించారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ ముగింపు సందర్భంగా ఆయన ప్రసంగించారు. భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడానికే నెహ్రూ ప్రథమ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారని తెలిపారు. రాజకీయ స్వార్థం కోసమే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని సవరించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లలో రాజ్యాంగాన్ని 77 సార్లు సవరించగా, తమ పార్టీ 16 ఏళ్లలో 22 సార్లు సవరించిందని తెలిపారు.

ఆర్థిక వ్యవస్థకు ఊపు

» ఎన్నికల ప్రక్రియకు జోష్: కోవింద్

న్యూఢిల్లీ, డిసెంబరు 17: జమిలి ఎన్నికలు జరపాలని సంకల్పించిన కేంద్రం నిర్ణయానికి మాజీ రాష్ట్రపతి కోవింద్ మద్దతు పలికారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ఎన్నికల ప్రక్రియలో జోష్ తెస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థకూ ఊపు తెస్తుందని పేర్కొన్నారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో కోవింద్ మాట్లాడారు. జమిలి ద్వారా జీడీపీ 1.5 పాయింట్ల మేర మెరుగుపడితే ఇప్పుడున్న జీడీపీకి మరో 10శాతం పెరిగి.. త్వరలోనే మనదేశం ప్రపంచంలోనే ఎకనామిక్ సూపర్ పవర్‌గా టాప్-4 జాబితాలోకి చేరుతుందని పేర్కొన్నారు. కాగా జమిలి కోసం కేంద్ర బీజేపీ సర్కారు నినాదం 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వెనుక 'వన్ నేషన్-నో ఎలెక్షన్' ఉద్దేశం ఉందని ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బెంగళూరులో విమర్శించారు.

31 మంది సభ్యులు.. 90 రోజులు

శుక్రవారంతో శీతాకాల సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో ఆలోగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లులపై జేపీసీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా చేయలేకపోతే ఈ బిల్లులు మురిగిపోతాయి. వచ్చే సమావేశాల్లో మళ్లీ వీటిని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కమిటీలో సభ్యుల కూర్పు.. సభలో ఆయా పార్టీలకు వచ్చిన సీట్లపై ఆధారపడి ఉంటుంది. సభలో అత్యధిక సీట్లున్న అతిపెద్ద పార్టీ బీజేపీ కాబట్టి జేపీసీలో ఆ పార్టీ సభ్యులు ఎక్కువ మంది ఉంటారు. కమిటీకి నాయకత్వం వహించే అవకాశం కూడా ఆ పార్టీకే దక్కుతుంది. జేపీసీలో గరిష్ఠంగా 31 మంది ఎంపీలు ఉంటారు. అందులో 21 మంది లోక్‌సభ నుంచి ఉంటారు. జేపీసీ 90 రోజుల్లోగా నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే ఆ గడువును పొడిగించవచ్చు.

జమిలి మనకు కొత్తకాదు!

» లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీకి 9 సార్లు ఉమ్మడి ఎన్నికలు

» పాతికేళ్ల నుంచి ఏకకాలంలో నిర్వహణ

లోక్‌సభ ఎన్నికలు	ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు
1952-1957	1955-57
1957-1962	1957-62
1962-1967	1962-67
1967-70	1967-72
1971-77	1972-78
1977-1980	1978-1983
1980-84	1983-85
1984-89	1985-1989
1989-91	1989-1994
1991-96	1994-1999
1996-1998	-
1998-1999	-
1999-2004	1999-2004
2004-2009	2004-2009
2009-2014	2009-2014
2014-19	2014-19
2019-24	2019-2024

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు ఏపీకి కొత్తకాదు. దేశంలో ఎన్నికల ప్రక్రియ మొదలైన 1952 నుంచి ఈ ఏడాది వరకు లోక్‌సభకు 17 సార్లు, ఏపీ అసెంబ్లీకి 15 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో 9 సార్లు లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీకి ఒకే సమయంలో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలో ఇందిరాగాంధీ మరణం, ఎమర్జెన్సీ, ఇతర కారణాల వల్ల ఐదేళ్ల కాలపరిమితి పూర్తవ్వకముందే కొన్నిసార్లు ఎన్నికలు జరిగాయి. ఏపీలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాజీనామాతో ఒకసారి ముందస్తుగా ఎన్నికలు వచ్చాయి. 1952 నుంచి 2024 వరకు దేశవ్యాప్తంగా లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు కలిసి 430 సార్లు ఎన్నికలు జరిగాయి. సగటున ఏడాదికి 6 లేదా ప్రతి 2 నెలలకు ఒకసారి చొప్పున ఎన్నికలు జరిగాయి. 1967లో అత్యధికంగా లోక్‌సభకు, ఇతర రాష్ట్రాలకు కలిపి 23సార్లు ఎన్నికలు జరిగాయి.

ఫార్ములా-ఈ కేసులో ఏ-1గా కేటీఆర్?

» కేటీఆర్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించనుంది. ఈ మేరకు ఏసీబీకి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అనుమతి ఇచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ హయాంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేసిన అర్వింద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ 1గా, అర్వింద్‌కుమార్‌ను ఏ2గా చేర్చనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. రూ.55 కోట్ల ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో విచారణకు తమ ముందు హాజరు కావాలంటూ ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపనుంది.

భార్గవ్‌రెడ్డి బెయిల్‌పై విచారణ 27కి వాయిదా

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టేలా వైసీపీ కార్యకర్తలను ప్రోత్సహించానన్న ఆరోపణలతో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ సజ్జల భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల గడువు ముగుస్తున్నందున వాటిని పొడిగించాలని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అభ్యర్థించారు. దీంతో రక్షణ ఉత్తర్వులను పొడిగిస్తూ.. విచారణను ఈనెల 27కి వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు.

మద్దతు ధరకు చట్టబద్ధత!

న్యూఢిల్లీ, డిసెంబరు 17: అన్నదాతకు భారీ ఊరట కల్పిస్తూ వ్యవసాయ, పశుసంవర్థక, ఆహార ప్రాసెసింగ్ రంగాలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సంచలన సిఫారసులు చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు(ఎంఎస్పీ) చట్టబద్ధత కల్పించడంతోపాటు సాగు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని తన నివేదికలో పేర్కొంది. కాగా, ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలన్న రైతన్నల దీర్ఘకాల డిమాండ్‌పై స్థాయీ సంఘం లోతైన అధ్యయనం చేసింది. ఈ మేరకు స్థాయీ సంఘం ఛైర్మన్, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ మంగళవారం లోక్‌సభకు తొలి నివేదికను సమర్పించారు. దీనికి సంబంధించి లోక్‌సభ సచివాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. దేశంలో వ్యవసాయ సంస్కరణల అమలు, రైతుల సంక్షేమానికి.. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించడమే సరైన మార్గమని స్థాయీ సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఆర్థిక స్థిరత్వం లేకపోవడమేనని గుర్తించింది. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పిస్తే ఆత్మహత్యలు నివారించడంతోపాటు ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందని కమిటీ భావించింది. అదేవిధంగా 'పీఎం కిసాన్' నిధులను రూ.6 వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని, వ్యవసాయ కార్మికుల కనీస వేతన నిర్ధారణకు జాతీయ కమిషన్‌ను నియమించాలని స్థాయీ సంఘం సిఫారసులు చేసింది.



20 నిమిషాలు నిల్చునే ఉండండి..

» పాఠశాలల్లో మాదిరిగా సిబ్బందికి సీఈఓ పనిష్మంట్

» పనిచేయకుండా వృద్ధుడిని నిలబెట్టినందుకు దండన

నోయిడా, డిసెంబరు 17: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఓ సీఈఓ వినూత్న రీతిలో దండించారు. పాఠశాలల్లో విద్యార్థులను నిల్చోబెట్టిన మాదిరి 20 నిమిషాల పాటు నిల్చొని పనిచేయాలని ఆదేశాలిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో న్యూ ఓక్లా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన కార్యాలయానికి సోమవారం పనిమీద ఒక వృద్ధుడు వచ్చారు. ఆయన కౌంటర్ వద్ద నిల్చొని ఉండడాన్ని కెమెరాలో చూసిన ఆ అథారిటీ సీఈఓ.. ఐఏఎస్ అధికారి డాక్టర్ లోకేశ్ ఆయన పనేంటో చూడాలని మహిళా ఉద్యోగికి సూచించారు. ఆ పని చేయడం వీలుకాకపోతే ఆ విషయాన్ని ఆ వ్యక్తికి చెప్పేయాలన్నారు. కానీ 20 నిమిషాల తర్వాత కూడా కౌంటర్ వద్ద వృద్ధుడు నిల్చొని ఉండటాన్ని గమనించిన సీఈఓ వెంటనే కార్యాలయం వద్దకు వచ్చి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అంతా 20 నిమిషాలపాటు నిల్చోవాలని ఆదేశించారు. ఆ తర్వాత వారు నిల్చొని పనిచేసిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. పలువురు నెటిజన్లు సీఈఓ చర్యను కొనియాడారు.

లోకం తీరు



జమిలి ప్రక్రియ 2029లోనే ప్రారంభం

లోక్‌సభకు అనుగుణంగానే అసెంబ్లీల పదవీకాలం..మధ్యలో రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు ఎలాంటి సవరణలూ లేకుండా ఆమోదం పొందితే.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంపై న్యాయనిపుణుల మధ్య చర్చ జరుగుతోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82కు చేర్చిన సవరణలో.. సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సిటింగ్ జరిగే రోజు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారని, ఆ నోటిఫికేషన్ తేదీని సభ నియామక తేదీగా నిర్ణయిస్తారని పేర్కొనడం గమనార్హం. దీంతో 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల తర్వాతే జమిలి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని న్యాయనిపుణులు భావిస్తున్నారు. నియామక తేదీ నుంచి ఐదు సంవత్సరాల పాటే లోక్‌సభ పదవీకాలం ఉంటుంది. నియామక తేదీ తర్వాత ఏర్పడే అసెంబ్లీల పదవీకాలం కూడా లోక్‌సభ పూర్తి పదవీకాలంతో పాటు ముగుస్తుందని తెలిపింది. అలాగే.. ఒక శాసనసభ పదవీకాలం రద్దయితే మిగిలిన కాలానికే ఎన్నికలు జరుగుతాయని బిల్లు స్పష్టం చేసింది. ఏ అసెంబ్లీకైనా ఎన్నికలు నిర్వహించలేకపోతే ఆ అసెంబ్లీ ఎన్నికలు తర్వాత జరిగినా దాని పదవీకాలం లోక్‌సభ పదవీకాలానికి అనుగుణంగానే ఉంటుందని బిల్లు పేర్కొంది. కాగా, ఎన్నికల నిర్వహణకు భారీగా ఖర్చు కావడం, అత్యధిక సమయం పట్టడం, దేశంలో అనేక ప్రాంతాలలో ప్రవర్తన నియమావళి అమలు వల్ల అభివృద్ధి దెబ్బతినడం, సాధారణ ప్రజాజీవనానికి విఘాతం కలగడం, ఉద్యోగులను సుదీర్ఘకాలంపాటు ఎన్నికల నిర్వహణకు నియమించాల్సి రావడం వంటి కారణాల వల్ల జమిలి ఎన్నికలు తప్పనిసరిగా భావించినట్లు బిల్లులో వివరించారు.

18 వేల మంది భారతీయుల మెడపై.. ట్రంప్ సర్కారు బహిష్కరణ కత్తి!

» జాబితాలో ఏపీ పౌరులతోపాటు పంజాబీలు, గుజరాత్ రాష్ట్రీయులు

» భారత్‌కు పంపేందుకు నేషనల్ గార్డ్స్‌ను వాడుతానన్న ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 17: అమెరికాలో వచ్చే నెలలో కొలువుదీరనున్న డొనాల్డ్ ట్రంప్ సర్కారు.. అక్రమ వలసదారులపై దృష్టి సారించింది. తప్పుడు పత్రాలతో అమెరికాకు వచ్చిన వారి చిట్టాను సిద్ధం చేసింది. ఈ కోవలో 14.45 లక్షల మంది ఉండగా.. వీరిలో భారతీయుల సంఖ్య 17,940. వీరందరినీ భారత్‌కు తిప్పి పంపే(బహిష్కరణ/డీపోర్టేషన్) ఏర్పాట్లు జరుగుతున్నట్లు అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) వెల్లడించింది. ట్రంప్ కూడా ఇటీవల టైమ్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మిలటరీ (నేషనల్ గార్డ్స్)ను సాధారణంగా ఇలాంటి పనులకు వినియోగించరు కదా? అని టైమ్ ప్రతినిధి ప్రశ్నించగా.. "అమెరికాలోకి అక్రమంగా చొరబాట్లు జరిగాయి. ఇది అమెరికాపై దురాక్రమణగా భావిస్తాం. పలు దేశాలు ఈ విషయంలో మాకు సహకరించడం లేదు. మేము గుర్తించిన వ్యక్తుల పౌరసత్వం వివరాలు అడిగాం. కానీ, స్పందన లేదు. అలాంటి 15 దేశాలను 'సహకరించడం లేదు' అనే జాబితాలో పెట్టాం. ఆ దేశాలు సహకరించకపోతే.. నేషనల్ గార్డ్స్ సాయంతో వారిని తిప్పి పంపుతాం" అని అన్నారు. కాగా.. భారత్ కూడా బహిష్కరణ కోసం 18 వేల మంది వివరాలు అడిగితే.. ఇవ్వడం లేదని ఐసీఈ పేర్కొంది. అమెరికాలో తప్పుడు పత్రాలతో నివసిస్తున్న భారతీయుల్లో ఎక్కువగా పంజాబ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారున్నట్లు వివరించింది. పాకిస్థాన్, చైనా, ఇరాన్, వెనెజువెల నుంచి సహకారం అందడం లేదని తెలిపింది. మరోవైపు, డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. క్రిమినల్ కేసులేవీ లేకుండా అధ్యక్ష పీఠంపై కూర్చోవాలనే ఆశకు కోర్టు నిర్ణయంతో బ్రేక్ పడింది. అధ్యక్షుడికి ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఉంటుందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా హష్ మనీ కేసులో తీర్పును కొట్టివేయాలని తాజాగా ట్రంప్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మన్‌హటన్ కోర్టు జడ్జి జస్టిస్ జువాన్ మెర్చన్ తిరస్కరించారు. న్యూయార్క్ స్టేట్ కేసును ముందస్తుగా మూసివేయడానికి నిరాకరించారు. ఆ కేసు ట్రంప్ వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించినది అని, అది ఆయన అధికార కార్యక్రమాలకు చెందినది కాదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించారు.

పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ సంస్థల్లోనే

కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు ఎన్‌టీఏ ఆ దిశలో చర్యలు తీసుకోవాలి

» నార్మలైజేషన్ పక్కాగా ఉండాలి

» రాధాకృష్ణన్ కమిటీ సిఫారసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: కంప్యూటర్ ఆధారిత పరీక్షల(సీబీటీ) విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇస్రో మాజీ చీఫ్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో నియమించిన కమిటీ కీలక సూచనలు చేసింది. ఈ కమిటీ నివేదిక మంగళవారం మీడియాకు విడుదలైంది. సీబీటీ పద్ధతిలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) ఇకపై పకడ్బందీగా వ్యవహరించాలని.. డిజీ-యాత్ర మాదిరిగా 'డిజీ-పరీక్షల వ్యవస్థ'ను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. ఇందుకోసం ఎన్‌టీఏలో డైరెక్టర్ల స్థాయిలో ప్రక్షాళన అవసరమని పేర్కొంది. సాంకేతికత, ఉద్పాదకత, ఆపరేషన్స్, సైబర్ భద్రత, నిఘా విభాగాలను ఏర్పాటు చేసి, ఎన్‌టీఏను బలోపేతం చేయాలని స్పష్టం చేసింది. ఇకపై.. సీబీటీలను ప్రైవేటు కేంద్రాల్లో కాకుండా.. ప్రభుత్వ సంస్థల్లోనే నిర్వహించాలని సూచించింది. "ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను వినియోగించుకోవాలి. అక్కడ సీబీటీకి సంబంధించిన వనరులను సమకూర్చాలి. కనీసం 400-500 కేంద్రాలను ప్రభుత్వ సంస్థల్లో ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ఏడాది సమయం తీసుకోవచ్చు. దశల వారీగా ఈ పనిని పూర్తిచేయాలి" అని రాధాకృష్ణన్ కమిటీ తన నివేదికలో సిఫారసు చేసింది. అంతేకాదు.. గ్రామీణ ప్రాంతాలకూ సీబీటీని విస్తరించాలని, ప్రవేశ పరీక్షల విషయంలో మారుమూల ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు దూరాభారాన్ని తగ్గించాలని పేర్కొంది. ఇందుకోసం మొబైల్ టెస్టింగ్ కేంద్రాలను(ఎంటీసీ) ఏర్పాటు చేయాలని.. వీటిల్లో 30-50 మంది విద్యార్థులు పరీక్షలు రాసే వనరులను సమకూర్చాలని తెలిపింది.



తగ్గనున్న పుస్తకాల ధరలు

వచ్చే ఏడాది నుంచి కొన్ని తరగతులకు సంబంధించిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల ధరలు తగ్గుతాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం వెల్లడించారు. ఏటా 5 కోట్ల పాఠ్య పుస్తకాలను ముద్రిస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ.. వచ్చే ఏడాది నుంచి ఆ సామర్థ్యాన్ని 15 కోట్లకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాఠ్య పుస్తకాల కొరత తీరుతుందన్నారు. నూతన విద్యా విధానాన్ని అనుసరించి 9-12 తరగతులకు రూపొందించిన పాఠ్య పుస్తకాలు 2026-27 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

వచ్చే ఏడాది ఎన్‌టీఏ ప్రక్షాళన

వచ్చే ఏడాది ఎన్‌టీఏను సమూలంగా ప్రక్షాళన చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం ప్రకటించారు. నీట్, యూజీసీ-నెట్‌లలో ప్రశ్నపత్రాల లీకేజీ అనుమానాలు వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ఇకపై పకడ్బందీగా పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. పేపర్-పెన్/ఓఎంఆర్ కాకుండా.. ప్రవేశ పరీక్షలన్నీ సీబీటీ విధానంలో జరుగుతాయన్నారు. నీట్ విషయంలో ఓఎంఆర్ విధానమా? సీబీటీనా? అనే అంశంపై కేంద్ర ఆరోగ్య శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఎన్‌టీఏ ఇకపై ఎలాంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నిర్వహించదని, కేవలం ప్రవేశ పరీక్షలకే పరిమితమవుతుందని స్పష్టం చేశారు. సీయూఈటీ-యూజీని ఏడాదికి ఒకసారే నిర్వహిస్తారని చెప్పారు. పలు సంస్థల(స్వయం పోర్టల్ వంటి కోర్సులు) కోసం ఎన్‌టీఏ పరీక్షలు నిర్వహించడం వల్ల ఆ సంస్థపై ఎక్కువ భారం పడుతోందన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలు అన్ని షెడ్యూల్డ్ భారతీయ భాషల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కాగా.. సీబీఎస్ఈకి అనుబంధంగా ఉండే పాఠశాలల సంఖ్య రెట్టింపు(2014లో 14,974 ఉండగా 2024కల్లా.. 30,415కు చేరుకున్నాయి) అయినట్లు ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు.

అక్రమ నిర్మాణాలపై ఉపేక్ష వద్దు

అవసరమైతే అలాంటి వాటిని కూల్చివేయండి

సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు



న్యూఢిల్లీ, డిసెంబరు 17: అక్రమ నిర్మాణాల విషయంలో శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. పరిపాలనపరమైన జాప్యం జరిగిందనో, పెట్టుబడులు పెట్టారనో కారణాలు చూపించి ఎట్టిపరిస్థితుల్లోనూ అక్రమ కట్టడాలను క్రమబద్ధం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ నిర్మాణాలకు బాధ్యులైన అధికారులపై జరిమానాలు విధించాలని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నివాస భవనాలను వాణిజ్య నిర్మాణాలుగా మార్చిడి చేసిన కేసుపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అక్రమ కట్టడాల నిరోధంపై వెలువరించిన 36 పేజీల తీర్పులో పలు ఆదేశాలు ఇచ్చింది. ఆ భవనాల కూల్చివేతను సమర్థించింది. భవన నిర్మాణం పూర్తయిన తరువాత కూడా అక్రమంగా పనులు చేపట్టినా సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని తెలిపింది. అక్రమంగా నిర్మించిన భాగాన్ని కూల్చివేయడం, తప్పు చేసిన అధికారులకు జరిమానా విధించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పట్టణ ప్రణాళిక చట్టాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, అధికారుల్లో జవాబుదారీతనం ఉండేలా చూడాల్సి ఉందని తెలిపింది.

- స్థానిక అధికారులు ఆమోదించిన బిల్డింగ్ ప్లాన్‌ను ఉల్లంఘించి పనులు చేపట్టడాన్ని అంగీకరించకూడదు. అసలు బిల్డింగ్ ప్లానే లేకుండా చేపట్టే నిర్మాణాలను ధైర్యంతో నిలిపివేయాలి.
- నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నట్టు కోర్టు దృష్టికి వస్తే వాటిని ఆపాలి. ఏ మాత్రం కనికరం చూపినా అది 'అనుచిత సానుభూతి' కిందకు వస్తుంది.
- క్రమబద్ధమైన అభివృద్ధి ఉండాలన్న ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందిస్తారు. వాటిని ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే విద్యుత్తు, భూగర్భ జలాలు, రోడ్ల పై ఒత్తిడి పెరిగి అసలు హక్కుదార్లకు ముప్పు ఏర్పడుతుంది. వారి జీవనానికి ప్రమాదకరంగా మారుతుంది.
- భవనం పనులు జరుగుతున్నంత కాలం నిర్మాణ స్థలంలో 'ఆమోదం పొందిన బిల్డింగ్ ప్లాన్'ను ప్రదర్శించాలి.
- అధికారులు కూడా నిర్ణీత వ్యవధిలో తనిఖీలు చేస్తూ వాటిని రికార్డుల్లో రాయాలి.
- నిబంధనలు పాటిస్తామంటూ బిల్డింగ్ ప్లాన్‌కు ఆమోదం తెలిపే సమయంలో బిల్డరు/దరఖాస్తుదారు నుంచి ఓ హామీ పత్రం తీసుకోవాలి. "సంబంధిత అధికారుల నుంచి కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ తీసుకున్న తరువాతే బిల్డింగ్‌ను యజమానులు/లబ్ధిదారులకు అప్పగిస్తాను" అంటూ ఆ హామీ పత్రంలో రాయాలి.
- అతిక్రమణలు జరిగినట్టు గుర్తిస్తే చట్టం ప్రకారం తీసుకోవాలి. కంప్లీషన్ సర్టిఫికెట్ జారీని వాయిదా వేయాలి. తగిన మార్పులు, చేర్పులు చేసిన తరువాత మాత్రమే ఆ సర్టిఫికెట్ ఇవ్వాలి.
- కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ పొందిన తరువాత మాత్రమే విద్యుత్తు, మంచినీరు, మురుగునీటి కనెక్షన్ల సౌకర్యాలను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంటుంది.
- కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదనో, అక్రమ నిర్మాణాన్ని క్రమద్ధం చేయలేదనో, అతిక్రమణలను రాటిఫై చేయలేదనో బిల్డర్/యజమాని చేసిన ఫిర్యాదులు, పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, రివిజన్లపై చట్టంలో పేర్కొన్న విధంగా 90 రోజుల్లోగా అధికారులు నిర్ణయం తీసుకోవాలి.
- వీటిలో ఏ ఒక్క ఆదేశాన్ని ఉల్లంఘించినా అది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుంది.

ఈ ఆదేశాలను అన్ని హైకోర్టులు అమలు చేసేలా తీర్పు కాపీలను వాటికి పంపాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌ను ధర్మాసనం సూచించింది.

ముమ్మరంగా రోడ్ల మరమ్మతులు

సంక్రాంతిలోగా లక్ష్యం పూర్తి చేయాలి

ఆర్అండ్‌బీ అధికారులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దిశానిర్దేశం

అమరావతి, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సంక్రాంతి నాటికి రహదారుల మరమ్మతులన్నీ పూర్తిచేయాలని అధికారులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. గుంతల రహిత రహదారుల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గడువు సమయం దగ్గరపడుతున్నందున మరమ్మతుల పనులను మరింత ముమ్మరం చేయాలని మంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలన్నారు. అదే సమయంలో రోడ్ల నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎంత మాత్రం రాజీపడొద్దన్నారు. పనులపై క్షేత్ర స్థాయి నుంచి అందుతున్న రోజువారీ ప్రగతిని ఆయా డివిజన్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కొత్త ఏడాదిలో ప్రజలకు మంచి రోడ్లు అందించేందుకు జనవరి తొలివారం నాటికే పనులు పూర్తి చేయాలన్నారు. వెనకబడ్డ డివిజన్ల అధికారులతో ఉన్నతాధికారులు వ్యక్తిగతంగా మాట్లాడి, లక్ష్యాన్ని నిర్దేశించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 45,378 కి.మీ మేర రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లు ఉండగా, అందులో 22,299 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. మొత్తంగా రూ.861 కోట్లతో చేపట్టిన రోడ్ల మరమ్మతులకు సంబంధించి ఇప్పటి వరకు 4,157 కి.మీ మేర రోడ్లను గుంతల రహిత రహదారులుగా తీర్చిదిద్దామని తెలిపారు. రోజువారీ పనుల ప్రగతిపై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ.. లోపాలుంటే వారి దృష్టికి తీసుకొచ్చి సమన్వయం చేసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులకు మంత్రి సూచించారు.


మీ సత్యా 42వ షోరూమ్ ఇప్పుడు
పోరంకి లో
(యూనియన్ బ్యాంక్ ప్రక్కన, టి.వీ.ఆర్ కాలనీ)
సత్యా
అంటే సంతోషం
డిసెంబర్ 18 నుంచి!
On Every Purchase, Get Assured Gifts
upto ₹26,000 Cash Back
Credit / Debit Card EMI (Min. ₹20,000)
upto ₹10,000 Cash Back
Credit / Debit Card EMI (Min. ₹15,000)
Paper Finance
*Selected Leading Banks only
When you buy Smartphone
upto ₹6000 Cash Back
Neck band FREE
Pay Just ₹1999 & Get 2 Calling Smartwatches
Authorised Reseller
Just pay ₹999
and get iPhone
Pay Just ₹999 Monthly & Get LED TV
upto ₹26000 Brand Cash Back
Fixed EMI ₹1999
0 Down Payment
32" ₹7999* onwards
43" ₹18999* onwards
55" ₹34650* onwards
65" ₹51990* onwards
75" ₹99990* onwards
55" OLED TV ₹94990* onwards
Buy 55" OLED TV (139 cm)
Sound Bar
Get ₹15,000 Worth FREE
SONY SAMSUNG LG Panasonic Haier LLOYD TCL BPL
Air Conditioner
EMI ₹1888 onwards
₹63* Per Day
0 Down Payment
Stabilizer 20% OFF
₹4,000 Brand Cash Back
Buy Double Door Frost Free Refrigerator & Get 5 Liters Pressure Pooker FREE
Buy Single Door Direct Cool Refrigerator & Get (3 Pcs) Container Set FREE
Buy Side by Side Dios Refrigerator Air Fryer FREE
Buy Top Load Washing Machine & Get Iron Box FREE
Buy Front Load Washing Machine & Get Home Care Kit FREE
Buy Dishwasher & Get Bath Set FREE
Combo 40% OFF
Combo Price ₹82,099 ₹1,36,837
Fans Starting at ₹1,999*
& Get 5% Additional Discount
Buy Water Purifier & Get Thumbler FREE
Buy Microwave Oven & Get Borosil Oven Kit FREE
Chimney
2B Gas Stove
MacBook Air M1
EMI ₹3038 ₹5000
SATHYA
SPREADING HAPPINESS
Scan to find our Showroom Locations
Scan to know Prices, Offer details & to Shop Online www.sathya.store
Whatsapp: 99166 98985 or Call: 88805 98985
For corporate bookings or bulk orders mail us: corporatesales@sathya.email
డోర్ నెం: 431/3, 431/3B, మనీష్ హైట్స్, NH 65, యూనియన్ బ్యాంక్ ప్రక్కన, టి.వీ.ఆర్ కాలనీ, పోరంకి, Ph: 91214 24671
Naidupeta 8754469985 | Sulurpeta 91501 75985 | Chittoor 9003179985 | Tirupathi 7845229985 | 78453 63985 | Venkatagiri 7338740985 | Pileru 78453 45985 | Tadipatri 95001 21985 | Chilkulurpeta 73583 80985 | Palamnar 73387 96985 | Bapatla 9043916985 | Koduru 9789778985 | Tenali 9866865813 | Nellore 9043976985 | Rajampeta 98402 66985 | Vijayawada 73860 34465 | 81060 84659 | Guntur 9092038985 | 92878 79985 | Ongole 97439 00659 | Nandyala 98408 57985 | Kurnool 99403 54985 | 9092608985 | Machilipatnam 90259 15985 | Badvel 9087774985 | Narasaraopet 90879 65985 | Srikalahasti 9952352985 | Ananthapur 9789959985 | Puttur 89255 93985 | Punganur 98403 78985 | Kadapa 97897 78985 | Rayachoti 9092444985 | Tadepalli 90921 44985 | Kakkinada 78455 93985 | Adoni 63038 15540 | Eluru 89255 70985 | Bhimavaram 78455 71985 | Madanapalle 78455 59985 | Tadepalligudem 78454 49985 | Vuyyur 72008 14985 | Dhone 86887 07953 | Poranki 91214 24671
Now 42 Showrooms

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జమిలి దిశగా...!

నిన్నటిదా, మొన్నటిదా...దశాబ్దం నాటి కల, ఇప్పుడు నిజం చేసుకొనే ప్రయత్నంలో తొలి అడుగుపడింది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన జమిలి బిల్లు పార్లమెంటులో ప్రవేశించింది. బిల్లు సభముందుకు రాగానే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ ఇత్యాది విపక్షాలు తాడెత్తున లేవడం, అరుపులూ కేకలతో నిరసనలు తెలియచేయడం అనూహ్యమైనవేమీ కావు. ఎంతోకాలంగా తమను వెంట తరుముతున్న ఈ ఒకేదేశం–ఒకే ఎన్నిక బిల్లు ఏదో ఒకరోజు కచ్చితంగా తమముందుకు రావడం ఖాయమని వారికీ తెలుసు. జమిలి బిల్లుల ప్రవేశాన్ని అనుమతిస్తూ 269మందే ఓటుచేయడం విపక్షానికి ఎందుకో అధికారపక్షం బలహీనతగా కనిపిస్తున్నది. బీజేపీ బలం, బలగం లెక్కలు అటుంచితే, బిల్లు ప్రవేశం దశలో మూడింట రెండువంతుల బలం అక్కరలేదన్న విషయం తెలియనిదేమీ కాదు.


అధికారంలో ఎవరున్నా తాము చెబుతున్నదీ చేస్తున్నదీ ప్రజాప్రయోజనార్థమేనని అంటారు. తయారవుతున్న చట్టాలు దేశ సంక్షేమం కోసమే తప్ప తమ స్వార్థరాజకీయం కాదంటాయి. ఒకేదేశం–ఒకే ఎన్నిక ఆలోచనలో విపక్షాలకు ఒక బలమైన రాజకీయ కుట్ర కనిపిస్తోంది. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధమనీ, నియంతృత్వానికి దారితీస్తుందని, రాష్ట్రాల హక్కులు దెబ్బతింటాయనీ, ప్రాంతీయపార్టీలు ఉనికికోల్పోతాయనీ విపక్షాలు అంటున్నాయి. విపక్షాలు ప్రతీదానినీ రాజకీయకోణంలోనే చూస్తాయనీ, మోదీ భయం వాటిని కుదిపేస్తున్నదని అధికారపక్షం అంటోంది. రెండు బిల్లులనూ అడ్డుకోవడానికి ఆఖరుక్షణం వరకూ విపక్షాలు ప్రయత్నిస్తాయనీ, జేపీసీకి పంపాలని ఎలాగూ డిమాండ్ చేస్తాయనీ తెలుసు కనుక, మంత్రివర్గ సమావేశంలోనే మోదీ జేపీసీ సూచన చేశారని అమిత్ షా ముందే తేల్చేశారు. సదరు కమిటీలో బీజేపీ సంఖ్యాబలం సహజంగానే ఎక్కువ ఉంటుంది కనుక, మిగతాదశలూ కష్టనష్టాలమాట అటుంచితే, ఈ దశ దాటడం ఖాయం. జమిలిని మ్యానిఫెస్టోలో పెట్టడం నుంచి, ఎర్రకోట ప్రసంగాలు, రాష్ట్రపతుల హితవులు, పార్టీపెద్దల అసందర్భోచిత ప్రస్తావనలు చాలా చూశాం. జమిలికి వకాల్తాపుచ్చుకున్న మాజీ రాష్ట్రపతి తన నివేదికలో దానిని ఓ చారిత్రాత్మక పరిణామంగా ముందుకు తోయడంలో ఆశ్చర్యమేమీ లేదు. జమిలికిపోతే జీడీపీ ఒకటిన్నరశాతం పెరుగుతుందన్న లెక్క ఆర్థికవేత్తలకు ఇంకా అర్థంకావాల్సి ఉంది. ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, సునాయాస పాలనకు వీలుకలుగుతుందనీ పాలకపక్షం నేతల మాదిరిగానే ఈ కమిటీ కూడా చాలా చెప్పింది. ప్రతీ చిన్న ఎన్నికనూ ఓ యుద్ధంలాగా చేయడం బీజేపీ వచ్చిన తరువాతే పెరిగింది కానీ, అంతకుముందు ఎక్కడో ఎన్నికలు జరుగుతూంటే ఢిల్లీ ఏలికలు పెద్దగా ఆయాసపడిందేమీ లేదు. మంచిచెడులతో నిమిత్తం లేకుండా విపక్షాలన్నీ జమిలిని వ్యతిరేకించడానికి అసలు కారణం ప్రాంతీయ ప్రాధాన్యతలు వెనక్కుపోయి, జాతీయాంశాలు ముందుకు వస్తాయని, కేంద్రం బలపడుతుందని. ఎన్నికలవేళ మతాన్ని రగిలించి, దేశభక్తిని రంగరించి, సర్జికల్ దాడులతో మోదీ ఓట్లు ఎగరేసుకుపోతారని.

రాజ్యాంగ సవరణ బిల్లు అయినప్పటికీ కూడా సభాప్రవేశం దశలో మూడింట రెండువంతుల మెజారిటీ అవసరం లేదని విపక్షాలకు తెలియదనుకోలేం. ఈ దశలోనే అధికారపక్ష కూటమి బలం తుస్సుమని తేలిపోయిందనీ, రేపు కచ్చితంగా జమిలి ఓడిపోతుందని నిజంగానే అవి నమ్ముతున్నపక్షంలో ఇప్పుడే అంత ఆవేశపడనక్కరలేదు. ఏ దశలో ఏ అడుగువేయాలో, ఎవరిని మోహరించి గట్టెక్కాలో అధికారపక్షానికి తెలిసిన విద్య కనుక తిమ్మినిబమ్మిని చేయగలదన్న భయం విపక్షాలకు లోలోన ఉన్నదేమో. బిల్లు నెగ్గదు అని విపక్షాలు అనడం, నెగ్గించి తీరుతామని అధికారపక్షం వాదించడం వాటి స్థానాల రీత్యా సహజం. గత రెండుపర్యాయాలు సొంతబలంతో అధికారంలో ఉన్న బీజేపీ, ఇప్పుడు మిత్రపక్షాల చేయూతలేనిదే అడుగువేయలేని దశలో రాజ్యాంగసవరణలకు అవసరమైనంత సంఖ్యాబలాన్ని కూడగట్టగలనన్న నమ్మకంతోనే ఈ సాహసానికి పూనుకుందా? అన్నది ప్రశ్న. పదేళ్ళపాటు అవధులు దాటిన ఆత్మవిశ్వాసంతో వ్యవహరించిన ఒక పార్టీకి, మూడోవిడతలో మరొకరి ఊనికతో నడవాల్సిరావడం భరించలేని విషయం. ఉన్న ఆ కాస్త హవా ఇంకొంత హరించుకుపోక ముందే, జమిలితో దేశాన్నంతా చాపచుట్టేయాలని ఆశించడంలో తప్పేమీ లేదు. బలం లేనంతమాత్రాన సంకల్పం సన్నగిల్లలేదనీ, ఆత్మవిశ్వాసం చెదరలేదనీ, వెనక్కుతగ్గేదే లేదని దూకుడు చూపడం రాజకీయాల్లో అత్యంత ముఖ్యం.

ఉడకని బియ్యం!

అత్యంత బహిరంగంగా, దారుణంగా దుర్వినియోగమయ్యే ప్రభుత్వ పథకం ఏది? ఈ ప్రశ్నకు తడుముకోకుండా సమాధానం చెప్పేయవచ్చు. అది.. ఉచిత రేషన్ బియ్యం పథకం! అర్హులు, అవసరమైన పేదల సంగతి పక్కన పెడితే... నిమిషాల్లో లక్ష రూపాయలు సర్దేయగల పెద్దోళ్లూ రేషన్ కార్డుల్లో పేద ముఖాలుగా కనిపిస్తారు. అధికారిక లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 1.68కోట్ల కుటుంబాలు ఉంటే.. అందులో 1.48 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులున్నాయి. అంటే 22 లక్షల మందికి మాత్రమే కార్డులు లేవు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు, ఇతరులు అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాష్ట్రంలో 4.2 శాతం మంది మాత్రమే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ఇటీవల కలెక్టర్ల సదస్సులో అధికారులు గొప్పగా చెప్పారు. అదే నిజమైతే రాష్ట్రంలోని 87శాతం కుటుంబాలకు తెల్లకార్డులు ఎందుకు ఉన్నట్లు? 1.48 లక్షల కుటుంబాలకు చెందిన 4.32కోట్ల మందికి నెలనెలా తలా 5 కిలోల బియ్యం ఎందుకు ఇస్తున్నట్లు? వీరిలో ఎందరు నిజమైన అర్హులు? ఈ ప్రశ్నలకు సమాధానం అధికార పక్షానికి తెలుసు, ప్రతిపక్షానికీ తెలుసు, ప్రజలకూ తెలుసు. అయినా సరే ఎవ్వరూ దీని గురించి మాట్లాడరు. 'అనర్హులకు రేషన్ కార్డులు రద్దు చేయండి' అని ప్రతిపక్షం డిమాండ్ చేయదు. ప్రభుత్వమూ ఆ 'దుస్సాహసం' చేయదు. ఇదంతా ఓటు రాజకీయం!

అప్పుడెప్పుడో ఎన్టీఆర్ కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రకటించారు. అప్పట్లో అదో సంచలనం. మార్కెట్‌లో మంచి నాణ్యమైన, సన్న బియ్యం ధర కిలో పది రూపాయల కంటే తక్కువ ఉన్న రోజులవి. చౌక ధరల దుకాణాల్లో ఇచ్చే 'ఫెయిర్ యావరేజీ క్వాలిటీ' బియ్యం ధర అప్పట్లో కిలో మూడు రూపాయలకు లోపే. అంటే ప్రభుత్వం భరించిన సబ్సిడీ కిలోకు ఒక్క రూపాయి. ఆ తర్వాత బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతూ వచ్చినా... రేషన్ బియ్యం ధర మాత్రం కిలో రూ.2 దగ్గరే ఆగిపోయింది. 'పేదలు' అది కూడా భరించలేని స్థితిలో ఉన్నారని భావించిన ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి దీనిని రూపాయికి తగ్గించారు. కొవిడ్ కాలంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఆహార ధాన్యాలు ఇస్తామని ప్రకటిస్తూ... అంత్యోదయ కార్డుదారులకు బియ్యం 'ఫ్రీ'గా ఇవ్వడం మొదలుపెట్టి, ఇప్పటికీ కొనసాగిస్తోంది. కేంద్రం ఉచితం అన్నాక, రాష్ట్రం డబ్బులు తీసుకుంటే బాగోదు కాబట్టి... ఇక్కడా ఫ్రీయే! వెరసి... సేకరణ నుంచి పంపిణీ దాకా కిలోకు సుమారు రూ.43 చొప్పున ఖర్చు చేస్తున్న బియ్యాన్ని రాష్ట్రం 'పేదల'కు ఉచితంగా అందిస్తోంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ప్రతినెలా పెడుతున్న ఖర్చు రూ.950కోట్లు! హమ్మో... అనిపిస్తోంది కదూ! నిజంగా పేదల కడుపు నింపేందుకు ఎన్ని వందల కోట్లయినా ఖర్చు పెట్టొచ్చు. కానీ రేషన్ బియ్యం కథే వేరు!



రాష్ట్రంలో 4.2 శాతం మంది మాత్రమే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ఇటీవల కలెక్టర్ల సదస్సులో అధికారులు గొప్పగా చెప్పారు. అదే నిజమైతే రాష్ట్రంలోని 87శాతం కుటుంబాలకు తెల్లకార్డులు ఎందుకు ఉన్నట్లు? 1.48లక్షల కుటుంబాలకు చెందిన 4.32కోట్ల మందికి నెలనెలా తలా 5 కిలోల బియ్యం ఎందుకు ఇస్తున్నట్లు?

ఒక అంచనా ప్రకారం ప్రతినెలా రేషన్ బియ్యం తీసుకుంటున్న వారిలో అటూ ఇటూగా 20శాతం మంది మాత్రమే వాటిని వండుకుని అన్నం తింటున్నారు. మిగిలిన వాళ్లంతా ఏం చేస్తున్నారంటే– కొందరు మినపప్పుతో కలిపి రుబ్బి దోసెలు పోసుకుంటారు. ఇంకొందరు పిండి పట్టించుకుంటారు. అత్యధికులు... ఫ్రీగా వచ్చే బియ్యాన్ని కిలో రూ.10 చొప్పున అక్కడికక్కడే అమ్ముకుంటారు. ఏదైతేనేం, రూపం ఏదైతేనేం రేషన్ బియ్యం రాష్ట్రంలోనే ఖర్చవుతున్నాయి కదా అనుకుంటే పొరపాటే! కేవలం 20 శాతం మంది వండుకుని తింటూ ఉండగా, మరో 15 నుంచి 20 శాతం బియ్యం మాత్రమే స్థానికంగా వినియోగమవుతున్నాయి. మిగిలిన బియ్యం ఏమవుతున్నాయంటే... సంచులు మారి, షిప్పుల్లోకి ఎక్కి వివిధ దేశాలకు తరలి పోతున్నాయి. ఇలా చేతులు మారుతూ వెళ్లిన ఉచిత బియ్యం ధర ఆఫ్రికాలో కిలో రూ.150 వరకు పలుకుతుందట! ఇప్పుడు చెప్పండి... ఇంతకంటే దారుణంగా దుర్వినియోగమయ్యే పథకం ఇంకేదైనా ఉందా?

రేషన్ బియ్యం తినని వాళ్లకు బియ్యం కార్డులు ఎందుకు? ఇది కూడా బహిరంగ రహస్యమే! అన్ని సంక్షేమ పథకాలకు బియ్యం కార్డే 'గేట్ వే'. అది ఉంటేనే 'పేదల కింద లెక్క! అది ఉంటేనే ఇతర పథకాలూ వర్తిస్తాయి. సామాజిక పెన్షన్ నుంచి పక్కా ఇంటి దాకా. ఇతర సంక్షేమ పథకాలు అవసరం కాబట్టి... అవసరం లేకున్నా రేషన్ కార్డు తీసుకుంటారు. ఆ బియ్యం తినరు కాబట్టి... బయట అమ్ముకుంటారు. ఇదీ అసలు సంగతి. సమస్యకు మూలం ఇక్కడే ఉంది. దీంతో సంక్షేమ పథకాలకూ, కార్డుకూ మధ్య లంకె తీసేయాలని ఒక దశలో ప్రతిపాదనలు వచ్చాయి. కానీ ఎందుకో అది అమలు కాలేదు. అనర్హులకు చెందిన కార్డులను ప్రభుత్వం ఏరివేయదు. 'మేం అనర్హులం' అని స్వచ్ఛందంగా అంగీకరించి కార్డులు వదిలేసుకునే మహానుభావులు మన రాష్ట్రంలో, దేశంలో బహు స్వల్పం! కేంద్ర ప్రభుత్వం ఎంతోకొంత నిక్కచ్చి ప్రమాణాలు పాటిస్తూ రాష్ట్రంలో 90వేల అంత్యోదయ కార్డులు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మరింత 'ఉదారత'తో తన వంతుగా ఇంకో 58వేల కార్డులు ఇచ్చేసింది. ఈ కార్డుల భారాన్ని కూడా కేంద్రమే భరించాలని రాష్ట్రం ఎప్పటి నుంచో కోరుతోంది. మీరు అడ్డగోలుగా జారీ చేసిన కార్డుల భారాన్ని మేమెందుకు మోస్తామని కేంద్రం ప్రశ్నిస్తోంది. ఇదో ఎడతెగని వివాదం. వెరసి... బియ్యం లెక్కలు ఇలా కొనసాగాల్సిందేనేమో! ఎలాగూ బయట కిలో పదికో, ఇరవైకో అమ్ముకునే బియ్యమే కదా! ప్రభుత్వమే బియ్యం బదులు ఒక్కో లబ్ధిదారుడికి ప్రతినెలా యాభయ్యో, వందో ఇస్తే సరిపోతుంది కదా! అని ప్రతిపాదించిన వారూ ఉన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై సగం భారం తగ్గుతుంది. అయితే... ఇక్కడ ధాన్యం రైతుల కోణం కూడా ఉంది! రాయలసీమతోపాటు కొన్ని జిల్లాల్లో మాత్రమే సన్న బియ్యం పండుతాయి. వాటికి డిమాండ్ ఎక్కువ. మిగిలిన అన్ని చోట్లా పండేది దొడ్డు బియ్యమే! వాటికి బయటి మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉండదు. ఆ బియ్యాన్నే ప్రభుత్వం సేకరించి, మిల్లుల్లో ఆడించి కార్డులకు సరఫరా చేస్తుంది. ప్రభుత్వం సమీకరించకుంటే... రైతులు మిల్లర్ల దయాదాక్షిణ్యాలపైన ఆధార పడాల్సిందే. మంచి ధర కోసం రైతుల నెలల కొద్దీ వేచి ఉండలేరు. అందుకే రైతు క్షేమం కోసమైనా బియ్యం సేకరించాల్సిందే! మరోవైపు పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యం ఉంటేనే బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు నియంత్రణలో ఉంటాయి. లేదంటే వాటికీ రెక్కలు వస్తాయి. వెరసి ఇదో 'రైస్' సర్కిల్! దీనిని అడ్డుకోవడం ప్రభుత్వాల చేతిలోనే ఉంది! సాహసించి అనర్హుల కార్డులు తొలగించడం ఇందులో కీలకం. లేదా సంక్షేమ పథకాలకూ, రేషన్ కార్డుకూ మధ్య లంకె తెంచేయాలి. దొడ్డు బియ్యం అవసరమైన రాష్ట్రాలు, దేశాలూ చాలానే ఉన్నాయి. రైతుల నుంచి సేకరించిన బియ్యాన్ని ప్రభుత్వమే ఎగుమతి చేసే విధానాన్ని అమలు చేయవచ్చు. ఈ అంశంపై సామాజిక విశ్లేషకులు, రైతు సంఘాలు, సంబంధిత పక్షాల అభిప్రాయాలూ సేకరించాలి. లేదంటే... 'ఉడకని బియ్యం' కోసం ప్రతి నెలా వందల కోట్లు ఖర్చవుతూనే ఉంటాయి. ఇంత ఖరీదైన పథకాన్ని పద్ధతిగా నడపాలి కదా! దుర్వినియోగాన్ని ఆపాలి కదా! ప్రభుత్వం ఆలోచించాలి!

• తొమ్మండ్రు సురేష్ కుమార్ (సీనియర్ జర్నలిస్ట్)

మళ్లీ విద్వేషాలు విజృంభిస్తున్న వేళ..





■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కొందరి పేర్లు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. ఎంత కాలం గడిచిపోయినా చరిత్రలో వారి పేర్లను, వారు చేసిన పనులను చెరిపివేయడం అంత సులభం కాదు. పాములపర్తి వెంకట నరసింహారావు ఇదే డిసెంబర్ మాసంలో దివంగతులై రెండు దశాబ్దాలు గడచిపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన పేరు స్మరించుకునే అవసరం నేటి రాజకీయ నాయకులకు కలిగింది. సుప్రీంకోర్టుకు, జాతీయ సమగ్రతా మండలికి బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను కూడా విస్మరించి, ఆ పార్టీ అగ్రనేతల సమక్షంలో బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేత జరిగింది. ఈ ఘటనకు పీవీనే చాలా మంది తప్పుపట్టారు. అయితే అంతకు సరిగ్గా ఏడాది ముందే 1991లో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మతపరమైన భావోద్వేగాలు తలెత్తకుండా చూసింది కూడా పీవీయే అన్న విషయం చాలా మంది మరిచిపోయారు! సంభల్‌లో మతపరమైన హింసాకాండ, మధురలో వివాదం నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కూడా ఆ చట్టం గుర్తుకువచ్చింది. ఇదే ఏడాది ప్రథమంలో పీవీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఈ చట్టాన్ని రద్దు చేయాలని తమ పార్టీ నేతలే అంటుంటే వారించలేకపోతోంది. నరసింహారావును అనేక సార్లు అగౌరవపరిచిన కాంగ్రెస్ నేతలకు కూడా ఇప్పుడు పీవీ ప్రభుత్వమే ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఆమోదింపచేసిన విషయం గుర్తుకు వచ్చింది.

నిజానికి ఈ చట్టంపై మళ్లీ చర్చ రేపి తీగ లాగింది కొద్ది రోజుల క్రితం పదవీవిరమణ చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్. ఒక మత ప్రదేశపు స్వభావాన్ని మార్చడం 1991 చట్టం క్రింద నిషేధించినప్పటికీ, ఆ ప్రదేశపు మత స్వభావాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడాన్ని ఆ చట్టం అడ్డుకోలేదని చంద్రచూడ్ వ్యాఖ్యానించి ప్రస్తుత వివాదాలన్నిటికీ తెర లేపారు. దేశంలో అనేక ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాలలో సర్వేల కోసం పిటిషన్లు దాఖలయ్యాయి. వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ సర్వేకు ఆదేశించిన స్థానిక కోర్టు ఈ చట్టం ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత 1991 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా యూపీలోని సంభల్ మసీదులో అలాంటి సర్వేను జిల్లా కోర్టు అనుమతించినందుకే గత నెలలో మతపరమైన హింసాకాండ జరిగింది.

ఈ నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ప్రార్థనా మందిరాల విషయంలో దేశంలో అన్ని కోర్టులు యథాతథ స్థితి నెలకొనేలా చూడాలని గత వారం ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1991 చట్టం చెల్లుతుందా లేదా అన్న విషయం తాము తేల్చేంతవరకూ ప్రార్థనా స్థలాల్లో సర్వేలు జరిపించాలని దాఖలైన పిటిషన్లను ఏ కోర్టూ నమోదు చేసుకోవద్దని, ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అసలు ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై కేంద్ర ప్రభుత్వం నాలుగు వారాల్లో తన అభిప్రాయం ఏమిటో చెప్పాలని స్పష్టంగా నిర్దేశిస్తూ 2025 ఫిబ్రవరి 17 వరకు తదుపరి విచారణను వాయిదా వేసింది. దీనితో కనీసం మూడు నెలల వరకైనా ప్రార్థనా స్థలాల విషయంలో మత పరమైన భావోద్వేగాలకు అడ్డుకట్ట వేసినట్లైంది.

అయోధ్యలో రామజన్మభూమిపై బీజేపీ నిర్వహిస్తున్న ఉద్యమం తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన పీవీ నరసింహారావు, వచ్చీ రాగానే దేశవ్యాప్తంగా ఇతర ప్రార్థనాస్థలాల్లో ఇలాంటి భావోద్వేగాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రార్థనాస్థలాల్లో యథాతథ పరిస్థితిని పరిరక్షించేందుకు చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు 1991 జూలైలో రాష్ట్రపతి వెంకట్రామన్ పార్లమెంటు ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలోనే స్పష్టం చేశారు. ఆ తరువాత సెప్టెంబర్‌లో రెండు రోజుల పాటు లోక్‌సభలో అద్భుతమైన చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు దేశంలో అసహనం వ్యాప్తి చేయాలని చూస్తున్నాయని, ప్రజలు ఏనాడో మరిచిపోయిన వివాదాలను తిరగదోడి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, అలాంటి కొత్త వివాదాలు రేకెత్తకుండా ఉండేందుకే ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) బిల్లును ప్రవేశ పెడుతున్నామని హోంమంత్రి ఎస్.బి. చవాన్ స్పష్టం చేశారు. ప్రేమ, శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పర్చడమే ఈ బిల్లు లక్ష్యమని అన్నారు. బీజేపీ నుంచి అద్వాణీ, జస్వంత్ సింగ్, ఉమాభారతి, రాంనాయక్ తదితరులు; కాంగ్రెస్ నుంచి దిగ్విజయ్ సింగ్, పిఎం సయీద్, మణిశంకర్ అయ్యర్; సీపీఐ(ఎం) నుంచి సోమనాథ ఛటర్జీ; సీపీఐ నుంచి ఇంద్రజిత్ గుప్తా, గీతా ముఖర్జీ అత్యంత ప్రతిభావంతంగా చర్చలో పాల్గొన్నారు. ఆ చర్చల ప్రామాణికతతో పోలిస్తే ఇవాళ్టి చర్చలు పేలవంగా కనిపిస్తాయి. ఈ బిల్లు వల్ల మనం సాధించేది ఏమీ లేదని, కొత్త వివాదాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అద్వాణీ అన్నారు. ప్రతి వివాదానికీ పరిష్కారం లభించాల్సిందేనని, అన్ని మత ప్రదేశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ఉమాభారతి స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో బీజేపీకి మిత్రుడుగా మారిన అప్పటి జనతాదళ్(యు)కు చెందిన దళిత నేత ఒకరు ఈ బిల్లును బలంగా సమర్థించారు. ఈ దేశంలో 33 కోట్ల మంది దేవుళ్లు ఉన్నప్పటికీ దేశంలోని 5,76,000 గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని గుర్తు చేశారు. లక్షలాది ప్రజలు ఆకలితో, వైద్య చికిత్సలు లేకుండా, ఉపాధి లభించకుండా మరణిస్తున్నారని, ఇలాంటి తీవ్రమైన అంశాలను పరిష్కరించకుండా మతపరమైన ఘర్షణల్లో కూరుకుపోవడం శోచనీయమని, ఎక్కడ మసీదు ఉందో, ఎక్కడ ఆలయం ఉందో తేల్చడం ప్రధానం కాదని సీపీఐ(ఎం) నేత సోమనాథ ఛటర్జీ అన్నారు. అదే సమయంలో అయోధ్య వివాదాన్ని చర్చల ద్వారా లేదా న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

ప్రార్థనాస్థలాల బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఒక్క అయోధ్యలో మినహా దేశంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎక్కడా ప్రార్థనాస్థలాల విషయంలో వివాదాలు రేగలేదు. ఒక్క అయోధ్య అంశం వల్లనే బీజేపీ క్రమక్రమంగా ఎన్నికల రాజకీయాల్లో పుంజుకొన్నది కనుక ఇతర అంశాలను పక్కన పెట్టింది. అయోధ్యతో బస్ ఝూంకీ హై, కాశీ మధురా బాకీ హై అని ఒకప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేసేవారు. కాని మేనిఫెస్టోలో మాత్రం ఇతర ప్రార్థనా స్థలాల గురించి ప్రస్తావించకుండా సంయమనం పాటించారు. కాశీ, మధుర మాటేమిటి? అని 2022 లో బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాను ప్రశ్నించినప్పుడు ఏ వివాదమైనా కోర్టులు, రాజ్యాంగం ద్వారా పరిష్కరించుకోవాల్సిందేనని చెప్పారు. అయోధ్య ఉద్యమం ఒక మినహాయింపు మాత్రమేనని, ప్రతి మసీదు లోనూ శివలింగం గురించి వెతకడం సరైంది కాదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ఆసేతు హిమాచలాన్ని సమైక్య పరిచే శ్రీరాముడు వివాదాల్ని సృష్టించడని, ఆయన పరిష్కారాలు సూచిస్తారని రామమందిర ప్రారంభం తర్వాత ప్రధాని నరేంద్రమోదీ కూడా అన్నారు. చారిత్రక తప్పిదాలను సవరించడం కన్నా శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించడంపై దృష్టి కేంద్రీకరించాలని ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వంటి బీజేపీ నేతలు కూడా అన్నారు. అయోధ్య తీర్పు సమయంలో కూడా ప్రార్థనా స్థలాల చట్టం ప్రాధాన్యాన్ని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. దేశ రాజకీయ వ్యవస్థలో అత్యంత కీలకమైన లౌకికవాద లక్షణాలను ఈ చట్టం కాపాడుతుందని ఒకప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఒక తీర్పులో స్పష్టం చేశారు. కనుక మళ్లీ ఈ రకమైన వివాదాలు రేకెత్తడం, సుప్రీంకోర్టు కూడా కలుగచేసుకోవాల్సి రావడానికి కారణమేమిటి? పైకి ఎన్ని చెప్పినప్పటికీ దేశమంతటా మతపరమైన భావోద్వేగాలు రేకెత్తించి ప్రయోజనం పొందడానికి బీజేపీ ప్రయత్నిస్తుందా? జమిలి ఎన్నికలకూ, ప్రస్తుత పరిణామాలకూ ఏమైనా సంబంధం ఉన్నదా? పీవీ హయాంలో ఆమోదించిన ప్రార్థనా స్థలాల చట్టంపై తన అభిప్రాయం ఏమిటో మోదీ ప్రభుత్వం స్పష్టంగా చెప్పిన తర్వాతే ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

ఇంతకీ ఈ మతపరమైన భావోద్వేగాలపై పీవీ అభిప్రాయం ఏమిటి? 'దేశంలో రక్తపాతాన్ని నివారించలేకపోతే చరిత్ర మనల్ని క్షమించదు' అని ఆయన 1992 జూలై 24న జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో అన్నారు. మతతత్వవాదం వల్ల ఎన్నో దేశాలు నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నాయని ఆయన తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి జవాబు చెబుతూ అన్నారు. దేశ పాలన రాజ్యాంగం ప్రకారం సాగాల్సిందేనని, మూక మనస్తత్వం ఉన్నవారికి లొంగితే రాజ్యాంగానికి తిలోదకాలివ్వాల్సిందేనని పీవీ అన్నారు. మతం, రాజ్యం రెండూ వేరువేరేనా? 'ఒక ముస్లిం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుస్సహమైన అహంకారంతో నోరుపారేసుకుంటూంటే ఓ హిందూ పటేల్ అతణ్ణి హృదయపూర్వకంగా సమర్థిస్తాడు. ఓ హిందూ మేనేజర్ హిందూ మహిళలను అవమానిస్తూ ఒక ముస్లిం జాగీర్దార్‌కు విధేయుడుగా ఉంటాడు. ప్రజల్ని అష్టకష్టాలు పెడుతున్న ముస్లిం ప్రభువుల దుష్టపాలనకు లొంగి ఉండాలని ఒక హిందువు తన కుమారుడికి ఉద్బోధిస్తాడు' అని నిజాం కాలంలో పరిస్థితుల గురించి తన 'లోపలి మనిషి' నవలలో పీవీ రాశారు. మూడు దశాబ్దాలు గోల్కొండను ఏలిన ఇబ్రాహీం కులీ కుతుబ్ షాను 'మల్కిభరామా!' అని కందుకూరి రుద్రకవి కీర్తించాడు. చరిత్రను శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలి. అలా కాకుండా విద్వేష వైఖరిని అవలంబిస్తే అశాంతిని ఆహ్వానించడమే అవుతుంది.

'ఒక ముస్లిం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అహంకారంతో నోరుపారేసుకుంటూంటే ఓ హిందూ పటేల్ అతణ్ణి హృదయపూర్వకంగా సమర్థిస్తాడు. ఓ హిందూ మేనేజర్ హిందూ మహిళలను అవమానిస్తూ ఒక ముస్లిం జాగీర్దార్‌కు విధేయుడుగా ఉంటాడు. ప్రజల్ని అష్టకష్టాలు పెడుతున్న ముస్లిం ప్రభువుల దుష్టపాలనకు లొంగి ఉండాలని ఒక హిందువు తన కుమారుడికి ఉద్బోధిస్తాడు' అని నిజాం కాలంలో పరిస్థితుల గురించి తన 'లోపలి మనిషి' నవలలో పీవీ రాశారు. చరిత్ర పట్ల విద్వేష వైఖరి అవలంబిస్తే అశాంతిని ఆహ్వానించడమే అవుతుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఈ కూలి రేట్లతో ఎలా బతికేది?

జీవన స్థితిగతుల్లో మార్పు లేక కూలీలు బతుకుబండి అతికష్టం మీద లాగుతున్నారు. కూలీ రేట్లు పెరగడం లేదు. కాని ప్రజా ప్రతినిధుల వేతనాలు మాత్రం పెచ్చుమీరి పెరుగుతున్నాయి. చెమట చుక్కల్ని నమ్ముకొన్న కూలీలకు రోజుకు రూ.300 నుంచి 400 వరకు గిట్టుబాటు అవుతున్నది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా కూలీ రేట్లు ఇస్తున్నారు. కనీస రోజుకూలీ కేరళ రాష్ట్రంలో అధికంగా రూ.670 ఉన్నది. కాగా మహారాష్ట్రలో అతి తక్కువగా రూ.240 ఉన్నది. ప్రజాప్రతినిధులు అత్యధికంగా వేతనాలు పొందుతున్న రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం. ఇక్కడ ప్రజాప్రతినిధులు నెలవారీగా రూ.2.50 లక్షల దాకా వేతనం పొందుతున్నారు. ప్రజాప్రతినిధుల వేతనాలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. కాని కూలీ రేట్లు పెరగక కూలీలు శ్రమ దోపిడికి గురవుతున్నారు. కూలీలు మధ్యప్రదేశ్‌లో రూ.290, మహారాష్ట్రలో రూ.240, జమ్మూ కశ్మీర్‌లో రూ.453, బిహార్‌లో రూ.267, హిమాచల్ ప్రదేశ్‌లో రూ.343, ఉత్తర ప్రదేశ్‌లో రూ.271, కర్ణాటకలో రూ.264, తెలంగాణలో రూ.415 కూలిగా పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.300 నుంచి రూ.400 వరకు కూలీ రేట్లు ఉన్నాయి. ఆయా రాష్ట్రాలతో పాటు తెలంగాణ లోనూ ఆంధ్రప్రదేశ్ లోనూ సగటు కూలీ రేట్లలో తగ్గుదల ఉంటున్నది. దిన కూలీలు, అడ్డా కూలీలు, వ్యవసాయ కూలీలు ఇలా అసంఘటిత రంగంలో పనిచేసే కూలీలకు దిన కూలీ గిట్టుబాటు కాక ఆర్థికంగా చితికి పోతున్నారు. తమకు రోజువారీ కూలి చట్టబద్ధంగా అందేలా పాలకులు చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. రోజువారీ కూలీ సక్రమంగా గిట్టుబాటు అయ్యేలా సమగ్ర కూలీ చట్టం తీసుకువచ్చి కూలీల జీవితంలో పాలకులు వెలుగు నింపాలి.

– గుర్రం రాంమోహన్ రెడ్డి



వాహ్! ఉస్తాద్..!!

రెండు తబలాలపై
వినసొంపుగా
నాట్యమాడే ఆ వేళ్ల నెమళ్లు

ఎగిసెగిసి పడే హోరుగా
కంటికింపుగా
కదిలే జులపాల కెరటాలు

స్వరస్వర్గాలను
మనముందరే దించిన
జంత్రమాంత్రికుని
మూడు గుండెలు
మూగవోయినా
సుస్వరయాత్ర
సాగుతూనే ఉంది.

కవీ! ఎందుకా వ్యర్థప్రయత్నం
ఆ శబ్ద ఝరీగమనంలో
నీ మాటల ముఖాలు
చూసుకోవాలని

అజరామరమైన
ఆ నెమళ్లింకా
తబలాలపై
కనులముందు
ఆడుతూనే ఉన్నాయి



అశ్రువులు
వాహ్ ఉస్తాద్.. అల్విదా
అని చెబుతున్నా
చెవులింకా...
అబద్ధమనే అంటున్నాయి.

– మడిపల్లి రాజ్‌కుమార్

మీ కోసం ఆదివాసీలు నిర్వాసితులు కావాలా?

భారతసైన్యాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లా, మాడ్ (ప్రభుత్వం, మీడియా 'అబూజ్ మాడ్' అనడం పట్ల మాకు అంగీకారం లేదు) ప్రాంతాన్ని తమ బలగాల సైనిక శిక్షణ కోసం కైవసం చేసుకోవడానికి ఎడతెరిపి లేకుండా ప్రయత్నిస్తున్నాయి. భారత సైన్యాలు కోరుతున్న ప్రాంతం దాదాపు 55 వేల హెక్టార్ల అటవీ, జనావాస, పంట భూముల ప్రాంతం (1,34,778 ఎకరాలు). ఇది మాడ్ నడిగడ్డన సోన్‌పూర్ నుంచి గార్ప మధ్య గల ప్రాంతం. వారు నిర్దిష్టంగా కోరుతున్న ప్రాంతం అదే అయినప్పటికీ దానికి అనేక రెట్లకు పైగా గ్రామ పంచాయతీల పరిధిలోని భూభాగాన్ని ఖాళీ చేయించడానికి ఆగమేఘాల మీద సర్వే పనులు జరుగుతున్నాయి. 72 గ్రామాలు ఖాళీ చేయాలనే తాఖీదులు చేరుతున్నాయి. ఈ ప్రాంతంలోని ప్రజలకు దూరంగా ఎక్కడో పునరావాసం కల్పిస్తామని అంటున్నారు. కానీ, మాడ్ కొండలలోని బాధిత ప్రజలు మాత్రం తమ అడవులను, భూములను వదలడానికి సిద్ధంగా లేరు. వారు ఇప్పటికే సంబంధిత అధికారులకు విన్నపాలను వినిపించుకుంటున్నారు. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు ఎంతమాత్రం సిద్ధంగా లేవని వాటి వైఖరి తెలుపుతోంది.

2024 జనవరి నుంచి మొదలై మాడ్‌తో సహా యావత్ దండకారణ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనిక దాడులతో రక్తసిక్తమవుతున్న అడవుల నుంచి ప్రజలను ఖాళీ చేయించే చర్యలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాయపూర్‌లో జరిపిన ఏడు మావోయిస్టు ఉద్యమ రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దేశంలో మావోయిస్టులను, మావోయిజాన్ని 2026 మార్చ్ నాటికి అంతమొందిస్తామని ఆ సమావేశం ప్రకటించింది. అందుకోసం ప్రస్తుత కగార్ దాడులను రెట్టింపు వేగంతో, తీవ్రతతో కొనసాగించాలనీ నిర్ణయించింది. ఈ దాడులను 'మాడ్ బచావో' కేంపెయిన్ పేరుతో కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. వారి లక్ష్యాన్ని చేరడానికి మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, మాడ్ ప్రాంతం నుంచి ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించే చర్యలను చేపడుతున్నారు. తిరిగి మూడేళ్లకు మీ ప్రాంతాలకు మీరు చేరుకుంటారనీ ప్రజలను మభ్య పెడుతున్నారు. భారత సైన్యాలు మావోయిస్టు ఆపరేషన్‌లలో పాల్గొనవని కేంద్ర హోంమంత్రి బుకాయిస్తున్నారు కానీ, ఇప్పటికే అనేక సంవత్సరాలుగా వేరు వేరు రూపాలలో భారత సైన్యాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లలో పాల్గొంటున్న విషయం బహిరంగ రహస్యమే.

కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వివిధ ప్రాజెక్టుల పేరుతో దేశంలో నిర్వాసితులైన వారిలో ఆదివాసీలే అధిక సంఖ్యలో ఉన్నారు. దండకారణ్యంలో 1970లలో చేపట్టిన కిరండాల్ తవ్వకాలతో పెద్ద ఎత్తున ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. ఇంచుమించు అదే సమయంలో మార్జూంలో అత్యంత రహస్యంగా భారత రక్షణరంగ యూనిట్‌ను నిర్మించినపుడు ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. 1980ల నాటికి మాడ్ కొండలపై నుండి ఆదివాసీలను మైదాన ప్రాంతాలకు తరమడానికి అన్ని సన్నాహాలు జరిగాయి. అడవుల నుంచి మనుషులను తరిమివేసి పులులను పెంచి పోషించే ప్రభుత్వ విధానాలతో 1980లలోనే వర్తమాన బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ఏరియా నుంచి పదుల గ్రామాలను ఖాళీ చేయించ పూనుకున్న పరిస్థితులలో ఆదివాసీలు సంఘటితంగా దానిని ఎదుర్కొన్నారు. తిరిగి ఇపుడు వారికి తమ గ్రామాలను ఖాళీ చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి.



పాలక వర్గాలు ఒకవైపు దేశంలోని విశాలమైన అడవులలోని విలువైన సంపదను తరలించుకుపోవడానికి పూనుకుంటూనే, అందుకు వ్యతిరేకంగా ప్రబలుతున్న ప్రజా నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి వీలుగా ముందునుంచే భారతసైన్యాలకు గెరిల్లా యుద్ధతంత్రంలో శిక్షణను అందిస్తున్నాయి.

గత నాలుగేళ్ల నుంచి అనేక కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వేగంగా కొనసాగిస్తున్న గనుల తవ్వకాలతో బృహత్ బస్తర్‌లో, గడ్చిరోలీలో కాలుష్యం ప్రబలుతూ ప్రజల పంట భూములు వల్లకాడై పోతున్నాయి. జనావాసాలు నివాసయోగ్యం కాకుండా పోతున్నాయి. పచ్చని అడవులు నాశనమవుతున్నాయి. 2030 నాటికి గడ్చిరోలీ జిల్లాను పారిశ్రామిక జిల్లాగా మారుస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ప్రకటించాడు. ఈ పరిణామాలతో ఈ ప్రాంతాలలోని ఆదివాసీలు ఏ పట్టణాలకో, ఏ నగరాలకో, ఏ మురికివాడల జీవితాలకో బలి కానున్నారు.

చాలా బాధాకరమైన విషయం ఏమంటే, ఈ ప్రాంతాలలోని ఆదివాసీ తెగలు భారత రాజ్యాంగం ప్రకారం అంతరించిపోతున్న తెగల జాబితా లోకి వస్తారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఆదివాసీల జీవితాన్ని పణంగా పెడుతూ వారి అస్తిత్వాన్నే ధ్వంసం చేస్తున్నారు.

గతంలో ఫాసిస్ట్ సల్వాజుడుం సమయంలో సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల్లోని వేలాదిమంది ప్రజలను తమ అడవుల నుంచి, గ్రామాల నుంచి తరిమి 'సహాయశిబిరాల' పేరుతో రోడ్డుపక్కన నిర్మించిన 'షెల్టర్'లలోకి తరలించారు. ఆ షెల్టర్లన్నీ నరక కూపాలే. వాస్తవంగా అవన్నీ కాన్‌సెంట్రేషన్ క్యాంపులే. అక్కడ ప్రజలకు ఎలాంటి అవకాశాలు ఉండవు. మహిళల జీవితాలలో కనీస భద్రత కరువైంది. అడవులలో స్వేచ్ఛగా తిరుగుతూ తమ దైనందిన అవసరాలను తీర్చుకునే ఆదివాసీలకు 'సహాయ శిబిరాల' జీవితాలు మృత్యు కుహరాల్లాంటివే. బలవంతంగా ఆ శిబిరాలకు తరలించబడిన ప్రజలు అక్కడ ఉండలేక వివిధ రూపాలలో తిరిగి తమ అడవులకు, గ్రామాలకు చేరుకున్నారు. వారికి విప్లవోద్యమంతో సహా అనేకమంది ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు సహకరించారు.

"1950లో భారతదేశ ప్రజాస్వామ్యానికి నైతిక పునాది అయిన భారత రాజ్యాంగాన్ని పార్లమెంటు ఆమోదించిన రోజు నిజానికి ఆదివాసులకు దురదృష్టకరమైన రోజు. రాజ్యాంగం వలస విధానాన్నే స్థిరీకరిస్తూ ఆదివాసుల నివాస ప్రాంతాలకు రాజ్యం సంరక్షకురాలిగా ఉంటుందని తేల్చింది. ఉన్నట్టుండి మొత్తం ఆదివాసీ సమూహాలన్నింటినీ వాళ్ల సొంత నేల మీదే పరాయివాళ్లను చేసింది. అటవీ ఉత్పత్తుల మీద వారి సంప్రదాయ హక్కును నిరాకరించి వారి జీవన విధానాన్నే నేరమయం చేసింది. ఓటుహక్కుకు బదులుగా, వాళ్ల జీవించే హక్కును, ఆత్మగౌరవాన్ని లాగేసుకుంది" – అని అరుంధతీరాయ్ 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' పుస్తకంలో సరిగ్గా వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం మాడ్ కొండలలోని ప్రజలు కోరుతున్నదేమిటి? వారు తమ 'కొండలను ఖాళీ చేయం' అంటున్నారు. వారు తమ భూములను వదలం అంటున్నారు. తమ అడవులను కాపాడుకోవాలంటున్నారు. ప్రకృతి వనరులను దేశం కోసం, ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసం నిలుపుకోవాలంటున్నారు. మాడ్ కొండలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అన్ని చర్యలను తక్షణం నిలిపివేయాలని కోరుతున్నారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లలో భారత సైన్యాలు పాల్గొంటాయా, లేదా అనేది వేరే విషయం. దానితో, ఈ అంశాన్ని ముడిపెట్టడం ప్రభుత్వాల మోసకారి విధానమే అవుతుంది.

మధ్య భారత అడవులలో భారత సైన్యాల శిక్షణా శిబిరం ఏర్పాటును ఒక దీర్ఘదృష్టితో వ్యూహాత్మక పథకంతో రూపొందిస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాలకవర్గాలు దానినుంచి బయటపడడానికి ఒకవైపు దేశంలోని విశాలమైన అడవులలోని విలువైన సంపదలను తరలించుకుపోవడానికి పూనుకుంటూనే, అందుకు వ్యతిరేకంగా ప్రబలుతున్న ప్రజా నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో భాగంగా ముందునుంచే భారత సైన్యాలకు గెరిల్లా యుద్ధ తంత్రంలో శిక్షణను అందిస్తున్నారు. అనేక దేశాలలో ప్రజలు సంక్షోభాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్నారు. వర్తమాన పరిస్థితులలో అలాంటి వెల్లువ భారతదేశంలో కూడా సంభవించడానికి పూర్తి అవకాశాలున్నాయని గ్రహించే ఇలాంటి ముందస్తు చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో, దేశంలోని సమస్త ప్రగతిశీల శక్తులు, విద్యార్థి, మేధావి, కార్మిక, కర్షక శక్తులు, రచయితలు, కళాకారులు మాడ్ ప్రజల న్యాయమైన అస్తిత్వ సమస్యను సమర్థిస్తూ వారికి అండగా నిలువాలనీ, మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని రద్దు చేయడానికి ఉద్యమించాలనీ మా విన్నపం.

■ కురుసం శంకర్
ఆదివాసీ రచయితల, కళాకారుల ఐక్య వేదిక
(బస్తర్–గడ్చిరోలీ)



- ఎయిమ్స్‌లో విద్యార్థులకు పట్టాలు అందజేసిన రాష్ట్రపతి ముర్ము
- మహిళా వైద్యుల శాతంపై హర్షం
- వైద్యులు చిత్తశుద్ధితో సేవకు ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్రపతి
- కేంద్ర సహాయమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో వేడుక
- ఇకపై మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వం: చంద్రబాబు



ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జాదవ్ మంత్రులు లోకేష్, సత్యకుమార్

స్నాతకోత్సాహం

మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. వారి కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల ఆనందోత్సాహాలు.. అతిరథులకు స్వాగత సత్కారాల మధ్య మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాధారణంగా స్నాతకోత్సవాలకు గవర్నర్ చాన్సలర్ హోదాలో పాల్గొంటారు. అయితే ఏకంగా రాష్ట్రపతి హాజరుకావడంతో ఈ వేడుకకు విశేషమైన ప్రాధాన్యం ఏర్పడింది. ఎయిమ్స్ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి జేపీ నడ్డా హాజరుకావాల్సి ఉండగా ఆ స్థానంలో ఆ బాధ్యతలను కేంద్ర ఆయుష్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావుజాదవ్ నిర్వర్తించారు. జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి నలుగురు విద్యార్థులు బంగారు పతకాలను అందజేశారు. ఓవరాల్ అకడమిక్ టాపర్‌గా కేరళకు చెందిన లియా అజీ, బెస్ట్ మేల్ టాపర్‌గా ఏపీకి చెందిన దాసరి దివ్యాంశ్, బెస్ట్ ఫిమేల్ టాపర్‌గా పంజాబ్‌కు చెందిన సుప్రభసింహ్, బెస్ట్ ఇంటర్న్‌షిప్‌గా కేరళకు చెందిన వీకే అథీరా ప్రభృతులు బంగారు పతకాలను అందుకున్నారు. 47 మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, మరో నలుగురు పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు కేంద్రమంత్రి జాదవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌తో కలిసి డిగ్రీలను ప్రదానం చేశారు. ఎయిమ్స్ మంగళగిరి సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ బ్రోచర్‌ను కేంద్ర సహాయమంత్రి ఆవిష్కరించారు.

47 మందిలో 17 మంది మహిళలే

ఎయిమ్స్‌లో డిగ్రీలు తీసుకున్న 47 మందిలో 17 మంది మహిళలే. దీనిపై రాష్ట్రపతి ముర్ము హర్షం వ్యక్తం చేశారు.

భవిష్యత్ నగరంగా అమరావతి : చంద్రబాబు

దేశ భవిష్యత్ నగరాల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రముఖంగా నిలువబోతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తెలిపారు. దేశంలోనే మంగళగిరి ఎయిమ్స్ నెంబర్‌వన్‌గా నిలుస్తుందని, ఇక మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వనన్నారు. ముర్ము సామాన్య ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి దేశ అత్యున్నత పదవిని సాధించడం చాలా గొప్ప విషయమన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును శాలువతో సన్మానించి తిరుమల శ్రీవారి మెమెంటోను అందజేశారు. రాష్ట్రపతికి మంగళగిరి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి నారా లోకేశ్ మంగళగిరి చేనేత చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ మదబానందకర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో
7 బార్లకు నోటిఫికేషన్

విజయవాడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో కేటాయించని, వ్యాపారులు మధ్యలో వదిలేసిన ఏడు బార్‌లకు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మచిలీపట్నంలో రెండు, పెడనలో ఒకటి, తాడిగడపలో రెండు, విజయవాడలో ఒకటి, తిరువూరు నగర పంచాయతీలో ఒక బార్‌కు దరఖాస్తులను ఆహ్వానించారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవడానికి ఈ నెల 23 ఆఖరు తేదీగా నిర్ణయించారు. దరఖాస్తు రుసుం రూ.10లక్షలుగా ఉంది. లైసెన్స్ ఫీజు రూ.6.05 లక్షలుగా నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో 24వ తేదీన ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహిస్తారు. హెచ్చుపాటదారుడికి బార్‌ను కేటాయిస్తారు. అయితే కొన్ని బార్‌లకు వైసీపీ ప్రభుత్వం పాట నిర్వహించింది. ఈ బార్‌లకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు గడువు ఉంది. కొంతమంది వ్యాపారులు బార్‌లను నడపలేక మధ్యలో వదిలేశారు. వాటితో పాటు కేటాయించకుండా ఉన్న బార్‌లకు అధికారులు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు.



ర్యాలీలో గౌతు శిరీష, జోగి రమేశ్ మధ్యలో ఉన్న బెజవాడ హర్ష

లచ్చన్న విగ్రహావిష్కరణలో...
అంతా వారే!

- జనసేన జెండాపై మూత్రం పోసిన బెజవాడ హర్ష
- టీడీపీ వారిని కేసులతో వేధించిన ఆరేపల్లి రాంబాబు
- గన్నవరం టీడీపీ కార్యాలయాన్ని దహనం చేసిన అనగాని రవి
- చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేశ్
- కార్యక్రమానికి ముందు నూజివీడు వైసీపీ నేత ఇంట్లో భేటీ
- జోగి రమేశ్‌తో కొనకళ్ల బ్రదర్స్ సమాలోచనలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

నూజివీడులో జరిగిన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం టీడీపీలో పెనుతుపాను రేపుతోంది. వైసీపీ హయాంలో టీడీపీ నాయకులను బూతులు తిట్టి.. కేసులతో వేధించి.. టీడీపీ కార్యాలయాలపై దాడులు చేసిన వైసీపీ నేతలకు ఈ కార్యక్రమంలో పెద్ద పీట వేయడమే కాకుండా వారితో కలిసి వేదిక పంచుకోవడం తమ్ముళ్ల ఆగ్రహావేశాలకు కారణమైంది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంపై మరిన్ని విషయాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ కార్యక్రమం మొత్తం జోగి రమేశ్‌ను టీడీపీలోకి తీసుకొచ్చే ప్రయత్నంగానే ఉందంటూ పలువురు టీడీపీ మద్దతుదారులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో అధిక శాతం వైసీపీ నాయకులు కావడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన జోగి రమేశ్‌తోపాటు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసి దహనం చేసిన ఘటనలో కీలక సూత్రధారి వైసీపీ నేత వల్లభనేని వంశీ ముఖ్య అనుచరుడు అనగాని రవి, ఎన్నికలకు ముందు జనసేన జెండాపై మూత్రం పోసి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై బూతులతో విరుచుకుపడిన ఆగిరిపల్లి మండల వైసీపీ నాయకుడు బెజవాడ హర్ష, నూజివీడు మండలంలో టీడీపీని నామరూపాలు లేకుండా చేస్తానంటూ ప్రగల్భాలు పలికి టీడీపీ నాయకులను దొంగ కేసులతో వేధించిన నూజివీడు వైసీపీ నేత ఆరేపల్లి రాంబాబు ఇలా వేదికపై ఉన్నవారంతా కరుడుగట్టిన వైసీపీ నాయకులే కాకుండా ఏదో ఒక సమయంలో టీడీపీపై పరిధిదాటి ప్రవర్తించడం గమనార్హం. పైగా వేదికపై నుంచి జోగి రమేశ్ ప్రసంగిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తడం టీడీపీ నాయకులను తీవ్ర అసహనానికి గురి చేసింది.

- జనసేన జెండాపై మూత్రం పోసి పవన్ కల్యాణ్‌ను దూషించిన ఘటనలో బెజవాడ హర్షపై ఆగిరిపల్లి పోలీసుస్టేషన్‌లో అప్పట్లో జనసేన కార్యకర్తలు కేసు కూడా నమోదు చేశారు.

మిగతా 6లో..

రూ.1.70 కోట్లు ఎక్కడివి?



పేర్నినాని గోడౌన్ వద్ద సంచుల్లోకి బియ్యం ఎత్తేపనిలో హమాలీలు

తెరపైకి బందరు బంధాలు..!

- పేర్ని నానికి కూటమి నేతల అండ..!
- 3,708 బస్తాల బియ్యానికి లెక్కలు లేవని అంగీకరించినా నోరు మెదపని కూటమి నేతలు

8లో

డబ్బులు సమకూర్చింది ఫణి

- పేర్ని నానితో ఇతనికి వ్యాపార లావాదేవీలు
- టీడీపీ మాజీ ఎంపీకీ ఫణి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు
- పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చినవి రెండు గోదాములు
- ఒక గోదాము అత్త పేరుతో.. మరో గోదాము భార్య పేరుతో
- సత్య వేర్ హౌసింగ్‌లోనూ భారీగా గోల్‌మాల్
- నెల రోజుల ముందే గోదాము నుంచి బియ్యం తరలింపు
- బియ్యం తగ్గినా గుట్టుచప్పుడు కాకుండా సరిపెట్టేసిన అధికారులు
- అద్దెకు ఇచ్చిన నాటి నుంచి లెక్కలు తేలిస్తేనే గుట్టు వీడేది

(విజయవాడ/మచిలీపట్నం - ఆంధ్రజ్యోతి)

మాజీ మంత్రి, కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు పేర్ని నాని గోదాముల నుంచి పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిన కేసులో జరిమానాగా చెల్లించిన మొత్తం ఎక్కడి నుంచి సమకూర్చారన్న దానిపై అధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జరిమానా రూపంలో చెల్లించిన సుమారు రూ.1.70 కోట్లలో కోటి రూపాయల వరకు మచిలీపట్నంకు చెందిన 'ఫణి' అనే వ్యక్తి సమకూర్చినట్లు సమాచారం. సుమారు రూ.1.70 కోట్లు వైట్‌లో చూపడం అంటే అంత తేలికైన విషయం కాదు. ఫణికి ఆయన తండ్రికి పేర్ని నాని కుటుంబంతో వ్యాపారలావాదేవీలు ఉన్నాయని చెబుతారు. ఈ కారణంగానే అంత పెద్ద మొత్తాన్ని ఆయన సమకూర్చినట్లు చెబుతున్నారు. ఈ ఫణి కుటుంబానికి టీడీపీ మాజీ ఎంపీ కుటుంబంతోనూ సన్నిహిత సంబంధాలు ఉండటం గమనార్హం. ఈ బంధాల కారణంగానే భారీ ఎత్తున పీడీఎస్ బియ్యాన్ని స్వాహా చేసినా పేర్ని నాని కుటుంబంపై ఈగ కూడా వాలకుండా చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ టీడీపీ నాయకుల ఆదేశాలతోనే పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్నినాని కేసు విషయంలో దూకుడుగా వ్యవహరించలేకపోతున్నారన్నది స్పష్టం.

మరో గోదాములోనూ బియ్యం గల్లంతు?

పేర్ని నాని కుటుంబం రెండు గోదాములను పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చింది. వాటిలో ఒకటి పేర్ని అత్త పట్టపు సత్యనారాయణమ్మ పేరుతో ఉండగా మరో గోదాము ఆయన సతీమణి పేర్ని జయసుధ పేరుతో ఉంది. ప్రస్తుతం బియ్యం పక్కదారి పట్టింది పేర్ని జయసుధ పేరుతో ఉన్న జేఎస్ గోడౌన్స్ నుంచి. ఇక్కడే సుమారు 243 టన్నుల బియ్యం మాయమైనట్లు అధికారులు చెబుతున్నారు. పేర్ని అత్త పేరుతో ఉన్న సత్య వేర్ హౌసింగ్ నుంచి నవంబరు మొదటి వారంలోనే బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు తరలించారు. ఆ సమయంలోనూ సుమారు 100 టన్నుల వరకు బియ్యం తగ్గినట్టు తేలినా అధికారులు దాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఉంచేసినట్లు తెలుస్తోంది. గోదాము నుంచి బియ్యాన్ని తరలించే సమయంలో బయట నుంచి బియ్యాన్ని తీసుకొచ్చి లెక్క సరిచేసినట్టు చెబుతున్నారు. ఈ రెండు గోదాముల్లో కచ్చితంగా ఎంత బియ్యం తగ్గిందనే విషయం తేలాలంటే వీటిని పౌరసఫరాల శాఖకు అద్దెకు ఇచ్చిన నాటి నుంచి వేబ్రిడ్జి రికార్డులను గోదాములకు వచ్చి వెళ్లిన లారీలు నమోదైన రికార్డులను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. రికార్డులను కూడా ట్యాంపర్ చేసినట్లు పేర్కొన్నారు. ఇదే జరిగితే బియ్యం కుంభకోణం ఏ స్థాయిదనేది నిర్ణయించడం కష్టంగా మారుతుంది. క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ జరిపితేనే బియ్యం ఎంత మేర పక్కదారి పట్టిందనే విషయం వెలుగు చూస్తుంది. క్షేత్రస్థాయిలో సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసిన తర్వాత ఈ గోదాములకు తీసుకురాకుండానే నేరుగా కాకినాడ పోర్టుకు తరలించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. జరుగుతున్న పరిణామాలను బట్టి వైసీపీ హయాంలో రేషన్ మాఫియాలో పేర్ని నాని కూడా భాగస్వామేనని స్పష్టమవుతోంది.

ఆయనో మోనార్క్!

ఆయనో మోనార్క్.. తన నియోజకవర్గాన్ని ఓ ప్రత్యేక సామ్రాజ్యంగా భావిస్తారు. అక్కడ తాను చెప్పిందే వేదం..చేసిందే శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తారు. అధికారులు చేయాల్సిన పనులనూ తానే చేసేస్తారు. తనకు ఎదురు చెబితే సొంత పార్టీ ప్రజాప్రతినిధి అయినా.. మీడియా ప్రతినిధులైనా సామాజిక మాధ్యమాలే వేదికగా విరుచుకుపడతారు. ఆయనే తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.

తిరువూరు ఎమ్మెల్యే తీరుపై విమర్శల వెల్లువ

- అక్రమ నిర్మాణాలు తొలగించాలంటూ నిరసన చేస్తారు
- బెల్టుషాపుల పేరుతో మద్యం షాపులను మూసివేస్తారు
- సొంత పార్టీ నాయకుడని చూడకుండా దుయ్యబడతారు
- టీడీపీపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలు



(విజయవాడ/తిరువూరు-ఆంధ్రజ్యోతి)

కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి తన వివాదాస్పద వ్యవహార శైలితో టీడీపీకి ఇబ్బందులు తీసుకొస్తూనే ఉన్నారు. ఈ ఏడాది జూలైలో ఎ.కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ నాయకుడు పంచాయతీ స్థలం ఆక్రమించి, భవనం నిర్మిస్తున్నాడంటూ ఆ భవనం వద్దకు వెళ్లి దాన్ని పడగొట్టాల్సిందేనంటూ ఆందోళనకు దిగారు. ఉన్నపళంగా భవనాన్ని పడగొట్టలేమని, ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినా ఆయన ససేమిరా అంటూ అక్కడే భైఠాయించారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కావడంతో టీడీపీ అధినేత చంద్రబాబు శ్రీనివాస్‌ను పిలిపించుకుని మందలించారు. ఆ తర్వాత కూడా ఆయన తీరు మారలేదు. పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారంటూ సొంత పార్టీ ప్రజాప్రతినిధిని అందరి ముందు దూషించడమే కాకుండా 'గుడ్డలూడదీసి తంతా' అని బెదిరించడంతో ఆ ప్రజాప్రతినిధి సతీమణి మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ వివాదం కూడా రాష్ట్ర స్థాయిలో సంచలనం రేకెత్తించింది. తిరువూరు నియోజకవర్గంలో కొందరు తెలంగాణ ప్రాంత వ్యక్తులు అక్రమంగా మట్టి తరలిస్తుండటంపై పత్రికల్లో కథనాలు రావడంతో మీడియా ప్రతినిధులపైనా సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే తీరుతో విసిగిపోయిన నియోజకవర్గ టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆయనపై ఫిర్యాదు చేశారు. దీంతో పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అప్పటి నుంచి సంయమనంతో ఉన్న ఎమ్మెల్యే మంగళవారం ఒక్కసారిగా తన ప్రతాపాన్ని మళ్లీ ప్రదర్శించారు.

దగ్గరుండి షాపులకు తాళాలు

మంగళవారం ఉదయం మద్యం షాపుల వద్దకు వెళ్లి బెల్టు షాపులు నిర్వహిస్తున్నారంటూ దగ్గరుండి షాపు నిర్వాహకులతోనే ఆయా షాపులకు తాళాలు వేయించారు. ఎవరైన షాపు తీస్తే ఊరుకునే ప్రశ్నే లేదని హుకుం జారీ చేశారు. పట్టణంలో ఉన్న షాపుల్ని పట్టణ శివారులో ఏర్పాటు చేసుకోవాలని, బెల్టుషాపులు 24 గంటల్లో తొలగించాలని, లేదంటే తానే ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతాననడం షాపు వాళ్లను బెదిరించి దారిలోకి తెచ్చుకునేందుకే అని టీడీపీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

నిర్వహణే కష్టంగా ఉంటే..

నియోజకవర్గం పరిధిలో మొత్తం 16 మద్యం షాపులకుగాను తిరువూరు పట్టణంలో 4, రూరల్‌లో 2, గంపలగూడెంలో 4, ఎ.కొండూరులో 2, విస్సన్నపేటలో 4 బ్రాంది షాపులు ఉన్నాయి. ప్రస్తుతం షాపుల నిర్వహణనే కష్టసాధ్యంగా మారిందని, పెద్దగా గిట్టుబాటు కావడం లేదని మద్యం షాపుల యజమానులు గగ్గోలు పెడుతుంటే వారిని వేధించడం ఎంత వరకు సబబని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మద్యం షాపులు నిర్వహించే వారిలో ఎక్కువ శాతం కూటమి నాయకులే ఉన్నారని, అలాంటిది వారిపై వేధింపులకు దిగడం ఏవిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం షాపుల నిర్వహణలో లోపాలు ఉంటే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించాల్సిన ఎమ్మెల్యేనే ఇలా షాపులు మూయిస్తూ దాదాగిరి చేయడం ఏమిటనే చర్చ నడుస్తోంది. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ప్రభుత్వం నుంచి షాపులు పాడుకుని అప్పులు చేసి చాలా మంది ఈ వ్యాపారంలోకి దిగామని, తమను ఎమ్మెల్యే స్వప్రయోజనాల కోసం ఇలా వేధించడం సరికాదని ఓ మద్యం దుకాణం యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌తో
రివిజనెట్టా!?

కొత్త సంవత్సరం నుంచి భూముల మార్కెట్ ధర పెరగనుంది. దీనికి సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుధవారం నుంచి రివిజన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎంత శాతం మేర పెంపుదల చేయాలన్న దానిపై స్పష్టత లేకపోవడం సబ్ రిజిస్ట్రార్లను గందరగోళానికి గురి చేస్తోంది.

- జనవరి నుంచి కొత్త మార్కెట్ విలువలు
- నేటి నుంచి మార్కెట్ విలువల రివిజన్ వర్క్
- ఎంత శాతం పెంచాలో స్పష్టత లేకపోవటంతో సబ్ రిజిస్ట్రార్లలో గందరగోళం
- వైసీపీ ప్రభుత్వంలో గ్రేటర్ విజయవాడ విలీన గ్రామాల్లో 30 శాతం పెంపు
- మళ్లీ ఇప్పుడు పెంచితే ప్రజాగ్రహం తప్పదు!

(ఆంధ్రజ్యోతి-విజయవాడ):



భూముల విలువ పెంపునకు సంబంధించి ప్రధాన సమస్యగా ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) నంబర్లు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో తలపెట్టిన రీ సర్వేలో భాగంగా భూ యజమానులకు సర్వే నంబర్ల స్థానంలో ఒకే ఎల్‌పీఎం నంబర్ ఇచ్చారు. వెంకటేశ్వరరావు అనే రైతుకు ఒక గ్రామంలో మూడు చోట్ల పది ఎకరాల భూమి ఉందనుకుంటే.. ఆ భూములన్నీ ఒకే ఎల్‌పీఎం పరిధిలోకి వస్తాయి. రీ సర్వే అనేది ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఓ 25 శాతం మేర మాత్రమే జరిగింది. మిగిలిన చోట్ల రీ సర్వే జరగకపోవటం వల్ల సర్వే నంబర్ల ప్రాతిపదికన తీసుకోవటం వల్ల ఎలాంటి వివాదానికి తావులేవు. రీ సర్వే జరిగిన ప్రాంతాలలో ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదిక రివిజన్ చేస్తే వేర్వేరు చోట్ల ఉన్న భూములన్నింటికీ ఒకే ధర వర్తిస్తుంది. ఇది గందరగోళాన్ని సృష్టిస్తోంది. వెంకటేశ్వరరావుకు విజయవాడ బైపాస్ వెంబడి ఐదు ఎకరాలు, దీనికి దూరంగా మరో మూడు ఎకరాలు, ఇంకో చోట రెండు ఎకరాలు ఉంటే .. అన్నింటికీ ఒకే మార్కెట్ విలువ నిర్ణయమవుతుంది. విజయవాడ బైపాస్ పక్కన ఉన్న భూమికి లోపల ఎక్కడో ఉన్న భూములకు కూడా అదే ధర అంటే.. వివాదంగా మారుతుంది. రీ సర్వేలో భాగంగా ఎల్‌పీఎం నంబర్ల కారణంగా రైతులు భూములు అమ్ముకోలేకపోతున్నారు. వెంకటేశ్వరావు తన 10 ఎకరాల భూమిలో ఐదు ఎకరాలను అమ్మదలిస్తే దానికి సంబంధించి రెవెన్యూలో సబ్ డివిజన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అప్పుడు కానీ అమ్ముకోవటానికి కుదరటం లేదు. ఈ సమస్య కారణంగా 2022 నుంచి ఇప్పటి వరకు భారీ స్థాయిలో ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఆదాయం కూడా గణనీయంగా పడిపోయింది. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదికన మార్కెట్ రేట్లను సవరించడం అంటే సబ్ రిజిస్ట్రార్లకు తలనొప్పిగా మారింది. ప్రజల్లో కూడా గందరగోళానికి తావిచ్చే అవకాశం ఉంది.

గ్రేటర్ విజయవాడ విలీన ప్రాంతాల్లో ఏ విధంగా పెంచాలి ?

వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ గ్రేటర్ విలీన గ్రామాల పరిధిలో అడ్డగోలుగా 30 శాతం వరకు భూముల మార్కెట్ విలువలను పెంచారు. గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లో విజయవాడ వెస్ట్ బైపాస్, విజయవాడ ఎయిర్‌పోర్టు, విజయవాడ తూర్పు బైపాస్‌ల పేర్లు చెప్పి అసాధారణంగా 30 శాతం మేర భూముల ధరలను పెంచారు. ఈ కారణంగా అనూహ్యంగా ధరలు పెరిగాయి. మళ్లీ అదే ప్రాంతాల్లో ధరలను పెంచటం ఏ పరిస్థితికి దారి తీస్తుందన్నది వేచి చూడాలి.

రివిజన్ ప్రక్రియ షెడ్యూల్ ఇలా..

మార్కెట్ ధరల సవరింపునకు సంబంధించి బుధవారమే చివరి రోజుగా నిర్దేశించటం జరిగింది. ఉమ్మడి జిల్లాలో సబ్ రిజిస్ట్రార్లందరూ మార్కెట్ వ్యాల్యూ రివిజన్‌ను బుధవారం పూర్తి చేయాలి. గురువారం మార్కెట్ విలువల మిగతా 6లో



కేంద్రమంత్రి జాదవ్ ప్రతాప్‌రావు గణపత్‌రావుకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి

వన్‌టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మను కేంద్ర ఆయుష్ (ఆరోగ్య)శాఖ సహాయ మంత్రి జాదవ్ ప్రతాప్‌రావు గణపత్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలు కల్పించి సాదర స్వాగతం పలికారు. దుర్గమ్మ దర్శనానంతరం ఈవో కేఎస్ రామారావు, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల నైట్ అలవెన్స్‌ల పునరుద్ధరణపై హర్షాతిరేకాలు

బస్‌స్టేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం జారీచేసిన జీవో 114 కారణంగా నిలిచిపోయిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల నైట్‌అలవెన్స్ చెల్లింపులను తిరిగి పునరుద్ధరించటంతో కార్మికపరిషత్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ అస్పష్టంగా ఉన్న 114 జీవోను అమలు చేయవద్దని డ్రైవర్లు, కండక్టర్లకు నైటవుట్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి డ్రైవర్లు, కండక్టర్లు ఆర్థికంగా నష్టపోతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేసిన ప్రయత్నంలో నైట్ అవుట్ అలవెన్సులను పునరుద్ధరణకు ఆదేశాలు రావటం ముదావహమన్నారు. 33 వేలమంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం కలిగించేలా ఆదేశాలు జారీ చేసినందుకు ప్రభుత్వానికి కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

● నైట్ అలవెన్స్ రూ.150లు ఇచ్చేందుకు జీవో 381ను విడుదల చేసినందుకు ప్రజా రవాణాసంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

● నైట్ అలవెన్స్‌ల అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలపటం హర్షణీయమని ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు తెలిపారు. ముఖ్యమంత్రికి, రవాణా మంత్రికి, ఆర్థిక శాఖ అధికారులకు, ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

సీపీఎం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

» జిల్లా కార్యదర్శిగా వై.నరసింహారావు

చల్లపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో జరుగుతున్న సీపీఎం కృష్ణాజిల్లా 25వ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో జరిగిన మహాసభల్లో 21మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా నరసింహారావు, సభ్యులుగా కళ్లం వెంకటేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, వి.జ్యోతి, కె.శివనాగేంద్రం, టీవీ లక్ష్మణస్వామి, పంచకర్ల రంగారావు, పి.పవన్‌కుమార్, బి.సుబ్రహ్మణ్యం, యద్దనపూడి మధు, శీలం నారాయణరావు, ఆర్విరెడ్డి, బేతా శ్రీనివాసరెడ్డి, మల్లంపల్లి ఆంజనేయులు, మాజేటి శ్రీనివాసరావు, చీకటి రాజేష్, యు.త్రిమూర్తులు, టి.నరేష్, పి.ధనశ్రీ, షేక్ ఖాసిం, అజ్మీర వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నేతలు వి.ఉమామహేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకూ నీరిచ్చేందుకు కృషి

» డీసీ అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఆయకట్టు చివరి భూములకూ సాగునీరందేలా కృషి చేస్తానని డీసీ(డిస్ట్రిబ్యూటరీ కమిటీ) చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం సర్పంచ్ కసుకుర్తి రంగామణి, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, బాపులపాడు డీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న రైతులకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాలువ చివరి భూములకు సాగునీరు సకాలంలో అందించేలా కృషి చేస్తానని ఆళ్ల తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, తెలుగురైతు రాష్ట్ర నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్, మండల కార్యదర్శి పుట్టా సురేష్, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా వేణుగోపాల్, మండాది రవీంద్ర, గోపి, తుమ్మల ధశరధరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించాలి

» వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపు

ధర్నాచౌక్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంగా తీసుకువచ్చిన నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ చట్టం ప్రతులను దగ్ధం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 23న నిరసనలు తెలపాలన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఢిల్లీ సరిహద్దులో రైతు నాయకులపై కేంద్ర ప్రభుత్వం పాశవికంగా దాడి చేసిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా ఉద్యమ నేత జగజ్జీత్ సింగ్ దల్లేవాల్‌కు ఏదైనా హాని జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఎస్‌కేయం నేతలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని హితవుపలికారు. అరెస్టు చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రైతు సంఘాల నేతలు వై.కేశవరావు, కేవీవీ.ప్రసాద్, కొల్లా రాజమోహన్, ఎం.కృష్ణయ్య, డి.హరినాథ్, మరీదు ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

నగరంలో రెండు మద్యం ప్రీమియర్ షాపులు

నోటిఫికేషన్ విడుదల చేసిన ఎక్సైజ్ శాఖ

దరఖాస్తుకు తుది గడువు ఈ నెల 31

విజయవాడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరంలో రెండు ప్రీమియర్ మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఈ ప్రీమియర్ షాపులను వాక్ ఇన్ స్టోర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో 12 ప్రీమియర్ షాపులను ఏర్పాటు చేయాలని భావించింది. ఇందులో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడకు రెండు షాపులను కేటాయించింది. ఈ షాపులకు దరఖాస్తులు చేయడానికి ఈ నెల 31 ఆఖరు తేదీ అని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తు రుసును రూ.15లక్షలుగా ప్రకటించారు. ఇది నాన్ రిఫండబుల్. షాపునకు లైసెన్స్ ఫీజును రూ.కోటిగా నిర్ణయించారు. ప్రీమియర్ షాపును ఏర్పాటు చేసుకునే వ్యాపారులు 4,500 చదరపు అడుగుల స్థలాన్ని చూపించాలి. ఈ షాపుల కేటాయింపునకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. వ్యాపారులు జిల్లాలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి. షాపు ఏర్పాటు చేయబోయే స్థలాన్ని, దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. దీని ఆధారంగా షాపు కేటాయింపు జరుగుతుంది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘనస్వాగతం

» విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు



విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పూలబొకే ఇస్తూ స్వాగతం పలుకుతున్న గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) తొలి స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం ఉదయం 11.14 గంటలకు ఆమె విమానాశ్రయానికి వచ్చారు. రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, కమాండింగ్ ఆఫీసర్ 22 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు పూలబొకేలు ఇచ్చి రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం 11.30 గంటలకు రోడ్డు మార్గాన మంగళగిరి వెళ్లారు.

రాష్ట్రపతికి వీడ్కోలు..

మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్లిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యాహ్నం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి



నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు బయలుదేరి వెళ్లారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారక తిరుమలరావు, కమాండింగ్ ఆఫీసర్ 22 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు వీడ్కోలు పలకగా రాష్ట్రపతి అందరికి అభివాదం చేశారు.

భారీ బందోబస్తు ఏర్పాటు..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం చుట్టు పక్కల పోలీసు పహారాతో తనిఖీలు నిర్వహించారు. 539 మంది బందోబస్తులో పాల్గొన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రాష్ట్రపతి మంగళగిరి వెళ్లి వచ్చే సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించటంతో ప్రయాణికులు కొంత ఇబ్బంది పడ్డారు.



మావోయిస్టు నేత మోహనరావుకు నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

ఐదుగుళ్లపల్లిలో మోహనరావు అంత్యక్రియలు పూర్తి

గూడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు నేత కార్తీక్‌దాదా అలియాస్ పృధ్విమోహనరావు అంత్యక్రియలు మంగళవారం కృష్ణా జిల్లా గూడూరు మండలం ఐదుగుళ్లపల్లిలో జరిగాయి. ఈనెల 11న ఒడిసా ఎన్‌కౌంటర్‌లో మరణించిన పృధ్విమోహనరావు మృతదేహాన్ని స్వగ్రామం ఐదుగుళ్లపల్లి తీసుకువచ్చారు. 40 సంవత్సరాల క్రితం గ్రామం నుంచి వెళ్లిపోయిన మోహనరావు నిర్జీవంగా రావడంతో గ్రామస్థులు, బంధుమిత్రులు వందలాదిగా తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొమ్మిడి అంజమ్మ, విప్లవ రచయితల సంఘం కార్యదర్శి అరసవిల్లి కృష్ణ, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు చిలక చంద్రశేఖర్, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 65 సంవత్సరాల వృద్ధాప్యంలో చిత్రహింసలు పెట్టి బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి బాధ్యులపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.పుష్పలత జ్యోతి, పాణి (విరసం), రవిచంద్ర (ప్రజాసంఘం) క్రాంతి కుమార్ (పిడిఎం) తదితరులు నివాళులర్పించారు. పోలీసులు తమ తండ్రి ఆచూకీ తెలపాలని వేధించేవారని, వృద్ధాప్యంలో బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని కుమార్తె జ్యోతి భారతి అన్నారు. మృతదేహాన్ని అప్పగించడంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని బావమరిది బాలశేఖర్ ఆరోపించారు.

సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టండి

» విస్తృత ప్రయోజనాలతో ముడిపడిన పనులు సత్వరం పూర్తిచేయాలి

» అభివృద్ధిలో జిల్లాను నెం.1గా నిలపాలి

» డీఆర్సీ సమీక్షా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జిమంత్రి మార్గనిర్దేశం, ప్రజాప్రతినిధుల సహకారంతో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎన్టీఆర్ జిల్లాను నెం.1గా నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశంలో చర్చకు వచ్చిన, నిర్ణయం తీసుకొన్న వివిధ అంశాల కార్యాచరణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నవంబరు 30న విజయవాడలోని ఇరిగేషన్ కాంపౌండ్‌లోని రైతు శిక్షణ కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో 34 శాఖల పరిధిలోని అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై సమీక్షించారు. సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు వివిధ అంశాలను లేవనెత్తారు. వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖలతో పాటు మార్కెటింగ్, పర్యాటకం, ఏపీసీపీడీసీఎల్, గృహ నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు తదితర శాఖల వారీగా చర్చించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయంలో 20 శాతం మొత్తంతో లింకు రోడ్ల అభివృద్ధి, రైతుల నుంచి సేకరించిన పత్తిని జిన్నింగ్ మిల్లులకు తరలింపు ఏర్పాట్లు, రైతు బజార్ల ప్రక్షాళన, పంట నష్టాలకు సంబంధించి కౌలు రైతులకు పరిహారం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)పై రైతులకు అవగాహన, తుమ్మలపాలెం, ఎత్తిపోతలకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా, పోలంపల్లి ప్రాజెక్టు మరమ్మతు పనులు, అమృత్ పథకం, జల్ జీవన్ మిషన్ పనుల సమగ్ర ప్రాజెక్ట్ నివేదికల రూపకల్పన, చిన్న నీటి వనరుల అభివృద్ధి, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. డీఆర్‌సీలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించనున్నట్టు తెలిపారు. విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు కృషి చేయాలని, అవసరమైన వాటికి ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా జిల్లా..

ట్యాక్సీ యజమానులకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీ : కలెక్టర్

కృష్ణలంక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటునట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ట్యాక్సీ యజమానులు, డ్రైవర్లకు ఉపాధి కల్పించేలా ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని అమలు చేసేలా ఆలోచన చేస్తున్నామని త్వరలో హోటల్, వాహన యజమానులు, దేవదాయ, రవాణాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ప్యాకేజీని అమలులోకి తీసుకువచ్చేలా కృషిచేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పర్యాటకులను ఆకర్షించి పర్యాటక కేంద్రాలను సందర్శించేలా ప్యాకేజీని అమలు చేసేందుకు మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ, కలెక్టరేట్‌లో ట్యాక్సీ యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గాంధీ హిల్, ఇంద్రకీలాద్రి, భవానీ ద్వీపం, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లా, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం, వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, ముక్త్యాల ముక్తేశ్వరస్వామి ఆలయం పురాతన కోట, కోటి లింగాల క్షేత్రం, తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి ఆలయం వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పాటు సమీపంలోని అమరావతి ఆలయం బౌద్ధ స్తూపం, రాష్ట్ర సచివాలయం, ఉండవల్లి గుహలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టూరిజానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.

ట్యాక్సీ యజమానులు, డ్రైవర్లకు ప్రత్యేక ప్యాకేజీ నగరానికి చెందిన ట్యాక్సీ యజమానులు డ్రైవర్లకు ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు పర్యాటకుల సౌలభ్యం కోసం టూరిజం ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని ఆలోచన చేస్తున్నామన్నారు. ఇందుకోసం త్వరలో హోటల్ యజమానులు, ట్యాక్సీ యజమానులు డ్రైవర్లు, రవాణా, దేవదాయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. టూరిజం ప్యాకేజీ ద్వారా పర్యాటకులను తీసుకువెళ్లేందుకు ముందుకు వచ్చే ట్యాక్సీ యజమానుల అంగీకారంతో వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఒకటి, రెండు, మూడు రోజుల పర్యటన కింద పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసి ధర నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. పర్యాటక కేంద్రాల వద్ద గైడ్‌లను నియమించి వాటి విశిష్టతను పర్యాటకులకు వివరించేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. టూరిజం ప్యాకేజీల వలన ట్యాక్సీ డ్రైవర్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని పర్యాటక కేంద్రాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. టూరిజం ప్యాకేజీలో పాల్గొనే ట్రాక్సీడ్రైవర్లకు ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను నిర్ధరిస్తామన్నారు. ట్యాక్సీ యజమానులు టూరిజం ప్యాకేజీలో పాల్గొనాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సమావేశంలో రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అలీ, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, వివిధ ప్రాంతాలకు చెందిన ట్యాక్సీ యజమానులు కె.శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ సుధాకర్, ఎం.సుబ్రమణ్యం, బి.బాబురావు, ఎల్.రాంబాబు, ఎస్‌కే బాషా, కె.రమణకుమార్, సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల్లో సాగునీటి కలకలం!

» సాగునీటి సంఘాల డీసీల ఎంపికపై పలువురి అసంతృప్తి

» రెండ్రోజులుగా వాడి వేడిగా చర్చలు

» తగిన గుర్తింపు దక్కకపోవడంతో కినుక



శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ భానుప్రకాష్‌ను అభినందిస్తున్న నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి

అవనిగడ్డ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు కూటమి పార్టీల నడుమ రాజకీయ కలకలం రేకెత్తించాయి. నియోజకవర్గంలో మొత్తం నాలుగు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా, రెండు డీసీలను టీడీపీ, రెండు డీసీలను జనసేన పార్టీ తీసుకోవాలని ఇరుపార్టీల నేతలు అంగీకారానికి రాగా, శ్రీకాకుళం, చల్లపల్లి డీసీల ఎన్నిక, ఉపాధ్యక్షుడి ఎన్నిక సజావుగా సాగినప్పటికీ నాగాయలంక, కోడూరు మండలాలకు సంబంధించిన ఎన్నిక సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలు ఇరుపార్టీల్లోనూ తీవ్ర అసంతృప్తి రేపాయి. నాగాయలంక, కోడూరు డీసీ అధ్యక్ష పదవి జనసేన పార్టీకి కేటాయించగా, కోడూరు మండలం నుంచి టీడీపీకి చెందిన వ్యక్తిని జనసేనలోకి చేర్చుకుని డీసీ చైర్మన్‌గా ఎన్నిక చేయటం పట్ల ఆ పార్టీ నేతలు బాహటంగా విమర్శిస్తున్నారు. నాగాయలంక డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్ష ఎన్నిక విషయంలో టీడీపీ, జనసేన నియోజకవర్గ అగ్రనాయకత్వాల నడుమ వివాదాన్ని రేకెత్తించింది. ఉపాధ్యక్ష పదవిని అవనిగడ్డ మండలానికి కేటాయించాలని తెలుగుదేశం పార్టీ కోరగా, తెలుగుదేశం, జనసేన పార్టీల నేతల నడుమ సోమవారం వాడివేడిగా చర్చలు నడిచాయి. నాగాయలంక మండలం నుంచి మత్స్యకార సామాజిక వర్గానికి ఇవ్వాలని ఇరుపార్టీలు నిర్ణయం తీసుకోవటంతో ఎన్నిక సజావుగా సాగింది. కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు సమీప బంధువుకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్ష పదవి ఇవ్వాలని అక్కడి నేతలు కోరగా, ఆ నిర్ణయాన్ని నియోజకవర్గ కూటమి నేతలు ఆమోదించకపోవటంతో అవనిగడ్డ మండలానికి చెందిన బచ్చు రఘునాథ్‌కు అప్పగించారు.

టీడీపీ నేతలకు జనసేన కండువాలు

కప్పటంపై అభ్యంతరం

సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నేతలను జనసేన పార్టీలో చేర్చుకుని సాగునీటి సంఘాలకు నియమించటం పట్ల తెలుగుదేశం పార్టీ నాయకత్వం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాల నుంచి పలువురు టీడీపీ నేతలను సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జనసేన పార్టీలోకి చేర్చుకోవటం పట్ల టీడీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేసి ఈ విషయమై రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

అందరికీ అవకాశాలు వస్తాయి : కనపర్తి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో అవకాశంరాని వారికి త్వరలో మంచి అవకాశాలు లభిస్తాయని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో జరిగిన అన్ని నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. టీడీపీ తరపున ఎన్నికైన డీసీ ఎన్నికల ముందురోజు జనసేన పార్టీలో చేరిన విషయమై ఆయన స్పందిస్తూ ఎన్నికలకు ముందు వారు పార్టీ మారి ఉంటే బాగుండేదని, పొత్తు ధర్మం ప్రకారం తెలుగుదేశం నుంచి జనసేనకు, జనసేన నుంచి తెలుగుదేశం పార్టీలోకి మార కూడదని, దానికి బాధ్యత గల వ్యక్తులు ప్రోత్సహించరాదని, ఇరుపార్టీలు నిర్ణయించుకున్నాయని కనపర్తి తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ మార్పుల పట్ల నేతలు బాహటంగా అసంతృప్తిని తెలియపర్చలేకపోయినప్పటికీ ఆగ్రహంగా ఉన్న మాట వాస్తవమని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని కనపర్తి తెలిపారు.

రేషన్ డీలర్ల ఎంపిక పరీక్ష వాయిదా

మొగల్రాజపురం : విజయవాడ డివిజన్ పరిధిలో పాత, కొత్త రేషన్ డిపోలకు డీలర్ల నియామక పరీక్షను వాయిదా వేస్తున్నట్టు విజయవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని, అర్హత సాధించిన వారికి నిబంధనల మేరకు ఈనెల 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి కృష్ణా ఫెన్సింగ్ క్రీడాకారులు హాజరుకండి

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులు ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ కోసం గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న శ్రీనివాస గ్రావిటీ జూనియర్ కళాశాల వద్ద 19న సాయంత్రం 3 గంటలకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపుకార్డుతో రావాలని జిల్లా కార్యదర్శి నాగం సతీష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ చాంప్‌కు పంపుతామన్నారు. ఇతర వివరాలకు 9553528888 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎల్‌పీఎంతో రివిజనెట్లా!?

(5వ పేజీ తరువాయి)

నిర్ణయ కమిటీల నుంచి అనుమతులు తీసుకోవాలి. 20వ తేదీన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్కెట్ విలువ రివిజన్స్‌ను అందుబాటులో ఉంచాలి. అభ్యంతరాలు స్వీకరించాలి. 22వ తేదీన డేటా ఎంట్రీ పూర్తి చేయటంతో పాటు, ఫామ్-1 నుంచి 4 వరకు చెక్‌లిస్టను పరిశీలించాల్సి ఉంటుంది. 24వ తేదీన అభ్యంతరాలు, సూచలను సమర్పించాల్సి ఉంటుంది. 26వ తేదీన అభ్యంతరాల పరిష్కారం చేపట్టాల్సి ఉంది. 27వ తేదీన మార్కెట్ వ్యాల్యూ రివిజన్ కమిటీ నుంచి తుది అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. జనవరి 1 నుంచి కొత్త మార్కెట్ విలువలు అమల్లోకి వస్తాయి.

లచ్చన్న విగ్రహావిష్కరణలో.. అంతా వారే!

(5వ పేజీ తరువాయి)

● గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలో కొద్ది రోజుల క్రితం గన్నవరం ఎంపీపీ, వైసీపీ నేత అనగాని రవిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆ తర్వాత ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. వైసీపీ హయాంలో వంశీ అండ చూసుకుని టీడీపీ నాయకులను బెదిరించడం దాడులు చేయడం ఈయనకు నిత్యకృత్యాలుగా ఉండేవి.

● జోగి రమేశ్ మంత్రి పదవి కోసం ఏకంగా చంద్రబాబు ఇంటిపైనే దాడికి యత్నించారు. చంద్రబాబును లోకేశ్‌ను బూతులు తిట్టని రోజు ఉండేది కాదు.

● ఆరేపల్లి రాంబాబు నూజివీడులో టీడీపీని భూస్థాపితం చేస్తానని పంతం పట్టారు. టీడీపీ నాయకులను కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారు.

ఇలాంటి వైసీపీ నాయకులతో కలిసి టీడీపీ మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ల నారాయణ వేదిక పంచుకోవడం టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలకు కారణమవుతోంది.

కార్యక్రమానికి ముందు వైసీపీ నేత ఇంట్లోనే భేటీ

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముందు నూజివీడు వైసీపీ నేత మారగాని నారాయణ ఇంట్లో గౌతు శిరీషతోపాటు కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య జోగి రమేశ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ తనయుడిపై ఉన్న అగ్రి గోల్డ్ కేసు చర్చకు వచ్చినట్టు సమాచారం. కేసుల రగడ నుంచి తనను బయటవేయాలని ఆయన టీడీపీ నేతలను కోరినట్టు సమాచారం. ఆదివారం మధ్యాహ్నం బెజవాడ హర్ష ఇంట్లో నాయకులందరూ భోజనాలు చేశారు. ఆ సందర్భంలో అనగాని రవి తనపై కేసులు పెట్టి జైలుకు పంపారని, ఏదో విధంగా తనను బయటపడేయాలని నాయకులను కోరగా, జోగి రమేశ్ జోక్యం చేసుకుని జైలుకు వెళితే నీవు కూడా గౌతు లచ్చన్న అంత గొప్ప నాయకుడివి అవుతావంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై అక్కడున్న నాయకులే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 108,116, 127
చికెన్ విత్ స్కిన్ 202
చికెన్ స్కిన్‌లెస్ 212
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 610



విజయ్ మర్చంట్ క్రికెట్‌లో కర్నాటక భారీ స్కోర్

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మూలపాడు వేదికగా జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో కర్ణాటక బ్యాటర్స్ చెలరేగి ఆడటంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్ 348/9 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. జమ్మూ కాశ్మీర్‌తో అండర్-16 క్రికెట్ టోర్నీలో ఆ జట్టు మంగళవారం బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటర్స్ అనిరుద్ 201 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో 146 పరుగులు, అదర్వ్ అర్ధసెంచరీ(54)తో సత్తా చాటారు. జమ్మూకాశ్మీర్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 10 పరుగులు చేసింది. ఉత్తరాఖండ్- జార్ఖండ్‌ల మధ్య రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాట్‌పట్టిన ఉత్తరాఖండ్ 274/2 పరుగులతో పటిష్టంగా ఉంది. కొరంగ 127 పరుగుల, మయాంక్ ముదిల 112తో కదం తొక్కారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఆగంతకులు

ఆటోనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వృద్ధురాలి మెడలోంచి ఎనిమిది కాసుల బంగారం గొలుసు లాక్కెళ్లిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..ఎస్. నాగరత్న కుమారి ఎన్టీఆర్ సర్కిల్ సమీపం విజయ డైరీ సందులో కుటుంబంతో కలిసి ఉంటుంది. ఉదయం పటమట రైతుబజార్‌లో కూరగాయాలు తీసుకురావడానికి బయలుదేరింది. ఆర్ఆర్ దర్బార్ సమీపంలో గుర్తు తెలియని ఇద్దరు ఎదురుగా ద్విచక్ర వాహనం మీద వచ్చారు. బండిని యూటర్న్ తీసుకుని ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. దీంతో ఒక్కసారిగా కిందపడిన ఆమెను కొంత దూరం లాక్కెళ్లినట్లు తెలిపారు. స్థానికులు వెంబడించగా దుండగులు దొరకలేదని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి. పవన్ కిషోర్ తెలిపారు.

టీడీపీ కార్యకర్తలను ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు

- బెజవాడ నజీర్

పటమట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి జోగి రమేష్ లాంటి మానసిక రోగులను ఎంత మందిని పావుగా ఉపయోగించినా టీడీపీ కార్యకర్తలను విచ్ఛిన్నం చేయలేరని టీడీపీ నాయకుడు బెజవాడ నజీర్ తెలిపారు. దేశంలోని ఏ రాజకీయ పార్టీలకి లేనటువంటి నిబద్ధత, ఆదరణ, అంకితభావం,క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు టీడీపీకి మాత్రమే ఉన్నారని అందరికీ తెలుసన్నారు. టీడీపీని ఢీకొట్టాలంటే ముందుగా పార్టీకి రక్షణ కవచంలా ఉన్న కార్యకర్తలను నిర్వీర్యం చేస్తేనే అది సాధ్యపడుతుందని వైసీపీ తమ కోవర్టులను టీడీపీలోకి పంపి తద్వారా ప్రజల్లో ఆ పార్టీపై, కార్యకర్తల్లో విషాన్ని నింపడానికి పెద్ద ఎత్తున కుట్ర పన్నిందన్నారు. నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జరిగిన ఘటనే ఇందుకు సాక్ష్యమని బెజవాడ నజీర్ పేర్కొన్నారు.

యూత్ హాస్టల్ పరిశీలన

భారతీనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న యూత్ హాస్టల్ ను మంగళవారం అసిస్టెంట్ సీటీ ప్లానర్ మోహన్ బాబు, ఈఈ సామ్రాజ్యం, స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావుతో కలిసి పరిశీలించారు. ఈ యూత్ హాస్టల్ శిథిలావస్థలో చేరిందని, దీనిని కొందరు ఆకతాయిలు ఆసరాగా తీసుకొని అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాలనీ పెద్దలు వివరించారు. ఇది కాలనీ స్థలమని, నిరుపయోగంగా వదిలేయకుండా తిరిగి కాలనీకి చెందేలా చేయాలని మోహన్‌బాబుని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యను తర్వగా పరిష్కరిస్తామని, కాలనీ వాసులకు ఉపయోగపడేలా చేస్తామని తెలిపారు.

పీబీ సిద్ధార్థలో ఇంధన పరిరక్షణ దినోత్సవం

మొగల్రాజపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను ఇంధనంగా మార్చుకునే విధంగా పునరుత్పాదక శక్తి వనరులను పెంపొందించుకోవాలని ఇంధన పరిరక్షణ మిషన్ డీఈఈ వల్లూరి పద్మజ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేయడం కోసం నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తాడికొండ శ్రీనివాసకృష్ణ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోటీల కన్వీనర్ జె. పాండురంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అమరావతి నగరాన్ని హైదారాబాద్‌కు దీటుగా తయారుచేస్తామన్నారు. మంగళవారం తూర్పు పరిధిలోని నాల్గవ డివిజన్‌లోని అంబేద్కర్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, భారతీనగర్ లలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుమలరావు రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసుగస్తీ ఏర్పాటు చేయడం, డ్రెయినేజీ సమస్య పరిష్కరించడం, రహదారులపై వీధిలైట్లు ఏర్పాటు, కొత్తగా పింఛన్లను మంజూరు తదితర సమస్యలపై సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు, అమరావతి నగరాలను కలిపి మహానగరంగా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ డివిజన్లో సిమెంట్‌రోడ్లు, మొక్కలు పెంపకంతోపాటు సుందరంగా తయారుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, రేమల్ల వినోద్, రాజమణి, హిమబిందు, ఉయ్యూరు రామారావు, బెజవాడ నజీర్, నర్రా రాజేంద్రప్రసాద్, హరి, కొర్రపాటి సురేంద్ర, గద్దె రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కాలనీ వాసులు

డ్రగ్స్ వినియోగంతో కుటుంబాలు నిర్వీర్యం

పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు

భారతీనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య వినియోగం వ్యక్తులను మాత్రమే కాదు కుటుంబాలను, సమాజాన్ని నిర్వీర్యం చేస్తుందని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. తరుణీ తరంగాల వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ విద్యాఖన్నా ఆధ్వర్యంలో ఆంధ్రా లయోలా కళాశాలలో ఎడ్స్ డ్రగ్స్ అండ్ వయెలెన్స్ (వాయిస్ ఫర్ చేంజ్- నో టు డ్రగ్స్.ఎస్ టు లైఫ్)అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 11 మిలియన్లకు పైగా యువత మాదక ద్రవ్యాల బారిన పడడం అత్యంత ఆందోళనకరమైన అంశం అన్నారు. కేవలం చట్టం అమలుతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. సమాజంలో అందరూ కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్య రహిత జీవనాన్ని అలవరచుకోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిశోర్, పిటి పార్కర్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, తబితా, మహిళా సెల్ కో- ఆర్డినేటర్ మోసెస్ వందన్, డాక్టర్ శామ్యూల్, కోఆర్డినేటర్ దయాకర్ పాల్గొన్నారు.



సీపీ రాజశేఖరబాబును సన్మానిస్తున్న లయోలా ప్రిన్సిపాల్ ఫాదర్ కిశోర్, తదితరులు

వైసీపీ నాయకుల అండతో అక్రమ కట్టడాలు

● అధికారులు తొలగించినా మళ్లీ అక్రమ నిర్మాణాలు ● ఇదేమి చోద్యం అంటున్న స్థానికులు

కృష్ణలంక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకుల అండతో అక్రమ కట్టడాలు వెలిసిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారధి కింద మెట్ల పక్కనే రోడ్డును ఆక్రమించి వైసీపీ నాయకుడు ఒకరు నిర్మించిన టిఫిన్ హోటల్‌ను కార్పొరేషన్ అధికారులు గతంలో పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. అయినప్పటికీ కొద్దిరోజుల అనంతరం అతడు అధికార పార్టీకి చెందిన తిరుపతి శ్రీనివాసుడిని ప్రసన్నం చేసుకొని అక్రమ కట్టడాన్ని తిరిగి కట్టేటట్లు చేశారనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు తొలగించిన హోటల్‌ను తిరిగి నిర్మించేందుకు స్థానిక నాయకులకు పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీలు ఏమైనా 'మనం మనం బరంపురం' అన్న చందాన టీడీపీకి చెందిన వారిని వలలో వేసుకొని (ఒకే కులం వారు కావడంతో) వైసీపీ వారు అక్రమ కట్టడాలకు తెరలేపుతుంటే ఆ చెడ్డపేరు అధికార పార్టీ మోసుకోవాల్సి వస్తోందని పలువురు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు తొలగించిన అక్రమ కట్టడాన్ని తిరిగి నిర్మించిన వారిపై చర్యలు తీసుకొని దానిని తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు.



హోటల్‌ను తొలగిస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)



అక్రమ కట్టడాన్ని పునర్నిర్మించిన వైసీపీ నాయకుడు

బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడికి పదేళ్ల జైలు

విజయవాడలీగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికను మాయమాటలతో లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొత్తపేట వాగుసెంటర్‌లో తల్లితో జీవిస్తున్న బాధితురాలు ఓ ఫ్యాన్సీ షాపులో పనిచేస్తోంది. 2016 నవంబరు 8న బాలిక షాపుకెళ్లి ఇంటికి రాలేదు. బాలిక తల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. బాలికకు నాలుగేళ్ల క్రితం చిట్టినగర్‌కు చెందిన పిల్లా మోహన్ అనే వ్యక్తి పరిచయం అయినట్లు, అతడు బాలికను ప్రేమిస్తున్నానని చెప్పి ఖమ్మం జిల్లాలోని మధిర తీసుకెళ్లి అక్కడ ఓ ఇంట్లో పెట్టి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ క్రమంలో బాలికకు అనారోగ్యంగా వుండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా గర్భవతి అని తెలియడంతో వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసును పోక్సో యాక్ట్‌గా మార్చు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున 15 మంది సాక్షులను విచారించగా నిందితుడిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ అందులో రూ.10 వేలతో పాటు రూ.4 లక్షలను నష్టపరిహారంగా బాలికకు వచ్చే విధంగా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీ వారికి ఆదేశిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆర్‌జీవీపై పీడీ యాక్టు అమలు చేయాలి



పటమట సీఐ పవన్ కిషోర్‌కు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర కాపునాడు ప్రతినిధులు

ఆటోనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చేష్టలు రోజు రోజుకు శృతిమించిపోతున్నాయని, అతనిపై పీడీ యాక్టును అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర కాపునాడు సభ్యులు మంగళవారం పటమట సీఐకి ఫిర్యాదు చేశారు. ప్రాంతీయ, మత వివాదాలకు ఆర్‌జీవీ ఆజ్యం పోస్తున్నాడని, కుటుంబ వివాహ బంధాలు అపవిత్రం చేసే విధంగా అతని చర్యలున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రోద్బలంతో మరో ప్రాంతీయ ఉన్మాద చర్యల కలిగించేలా ఆర్‌జీవీ వ్యవహరిస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీనియర్ కమర్షియల్ మేనేజర్ రాంబాబుకు విశిష్ట రైల్ సేవా పురస్కారం

రైల్వేస్టేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబుకు 2024 విశిష్ట రైల్ సేవా పురస్కారం లభించింది. అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తారు. రైల్వేవీక్ 69వ రైల్వేవీక్ అవార్డుల గ్రహీతల జాబితాలో ఆయన పేరును ప్రకటించారు. ఈనెల 21న న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించే ఒక కార్యక్రమంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ద్వారా ఈ అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ మాట్లాడుతూ రాంబాబు డివిజన్ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు కృషి చేశారని, అతని రచనలు ఎంతో దోహదపడ్డాయని చెప్పారు. అతనికి అభినందనలు అందచేశారు. ఐఆర్‌టీఎస్ అధికారిగా రాంబాబు 12 ఏళ్ల నుంచి అసాధారణమైన నాయకత్వ పటిమతో నైపుణ్యాన్ని మేళవిస్తూ నిబద్ధతకు మారుపేరుగా ఉద్యోగ నిర్వహణ చేశారు.

2023-2024 ఆర్థిక సంవత్సరంలో నిర్ణీత లక్ష్యంకన్నా 50 శాతం పెరుగుదల నమోదు చేయటం, నాన్‌షేర్ రెవెన్యూలో డివిజన్‌కు గణనీయమైన ఆదాయం వచ్చింది. ఆయన పర్యవేక్షణలో ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా టిక్కెట్ చెక్కింగ్ ద్వారా రూ.7.96 కోట్లు సమకూరింది.



ఆకట్టుకున్న భరతనాట్యం



విజయవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదిక పై మంగళవారం తిరుపతి జిల్లా గూడూరు మార్కెట్‌కు సెంటర్‌కు చెందిన శివలలిత భరతనాట్య కళాక్షేత్రం గురువు పిండి మల్లిక ఆధ్వర్యంలో కళాకారుల బృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది. వివిధ అంశాలలో చక్కని అభినయం ప్రదర్శించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. ఈవో రామారావు కళాకారుల బృందానికి ప్రశంసా పత్రం ఇచ్చి, అమ్మవారి ప్రసాదం అందజేశారు. పురాణ పండిట్ సి.హెచ్.వి.వై.వెంకటేశ్వర శర్మ దుర్గగుడి కళావేదికపై మంగళవారం పురాణ ప్రవచనం చేశారు.

కృష్ణావర్సిటీ వాలీబాల్ చాంపియన్ సిద్ధార్థ మహిళా జట్టు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళల వాలీబాల్ టోర్నీలో దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల చాంపియన్‌షిప్ సాధించింది. మంగళవారం జరిగిన టోర్నీలో ఏజేఅండ్ ఎస్‌జే సిద్ధార్థ కాలేజీ(ఉయ్యూరు) ద్వితీయ, పీబీ సిద్ధార్థ కళాశాల మూడో స్థానంలో, మారిస్ స్టెల్లా నాల్గో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎస్‌డీఎంఎస్ఎం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పన, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ హేమ, సెలక్షన్ కమిటీ సభ్యులు ట్రోఫీలు అందజేశారు.



సిద్ధార్థ మహిళా కళాశాల జట్టుతో ప్రిన్సిపాల్ తదితరులు

ఎన్ఎస్ఎం పూర్వ విద్యార్థుల క్రికెట్ విజేత బెస్ట్‌బుల్స్



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎం స్కూల్స్ పూర్వవిద్యార్థుల క్రికెట్ మ్యాచ్‌లో బెస్ట్‌బుల్స్ జట్టు విజేతగా అవతరించింది. నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల, మంగళగిరిలోని డాక్టర్స్ స్పోర్ట్సు అకాడమీ స్టేడియాల్లో ఇటీవల జరిగిన క్రికెట్ మ్యాచ్‌ల్లో బెస్ట్‌బుల్స్ జట్టు ఫైనల్స్‌లోనూ సత్తా చాటింది. ఐ కంట్రోల్ కాంక్యూ రోర్స్ జట్టుపై విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. బెస్ట్‌బుల్ జట్టు విజయాల్లో కెప్టెన్ కొండవీటి సంతోష్ కీలకంగా వ్యవహరించాడు. జట్టును జనసేన పార్టీ విజయవాడ నాయకురాలు బొలిశెట్టి అన్నపూర్ణ అభినందించారు.

'డబ్బు అమ్మబడును' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేంపల్లి షరీఫ్, రచయిత శ్రీనాథ్ రెడ్డి తదితరులు


మొగల్రాజపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేను చదువుకున్న పీబీ సిద్ధార్థ కళాశాలలో రచయిత హోదాలో వేదిక మీద మాట్లాడటం గర్వంగా ఉందని యువ రచయిత ఏరువ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఏరువ శ్రీనాథ్ రెడ్డి రచించిన తొలి రచన కథా సంపుటి డబ్బు అమ్మబడును అనే పుస్తకాన్ని కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితంలో డబ్బు ఆడే మైండ్ గేమ్‌ను అక్షర రూపం ఇచ్చినట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్ చదువుకున్న పూర్వ విద్యార్థి, రచయిత శ్రీనాథ్ రెడ్డి ప్రయాణం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వేంపల్లి షరీఫ్ మాట్లాడుతూ ఒక కవిత, కథ ఎలా రాయాలి, దానికి కావాల్సిన వనరులు ఎలా సమకూర్చుకోవాలో వివరించారు. శిఖర పాఠశాల అధినేత బండ్లమాధవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక అంశంపై ఇష్టాన్ని పెంచుకుని దానిని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఎంఏ ఇంగ్లీషు హెడ్ డాక్టర్ శ్రీలత, డాక్టర్ కె. శాంతకుమారి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ రాజేష్ జంపాల, ఉపాధి విభాగాధిపతి కావూరి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు రామకృష్ణ, కాంచన్

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో జనవరి 19న జరిగే జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఏసీహెచ్ రామకృష్ణ, ఎ. కాంచన్ ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి జీహెచ్ఎంసీ హాల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల సీనియర్, జూనియర్,సబ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంప్‌లో వీరు స్వర్ణాలతో సత్తా చాటి జాతీయ టోర్నీకి ఎంపికయ్యారు. వి.తేజ షణ్ముక్ కుమార్ రజతం, సీఎస్ గురుబ్రహ్మ రజతం, సీఎఎస్ సుభాకర్ స్వర్ణం సాధించారు. కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, సెక్రటరీ పి.లక్ష్మణరావు, కన్వీనర్ సీఎస్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి విజేతలను అభినందించారు.



పవర్‌లిఫ్టర్లతో సిద్ధార్థ కళాశాల యాజమాన్యం


పీజీ విద్యార్థుల హాస్టల్ భవనం ముందు పెరిగిన చెట్లు

బిల్డింగ్‌ను కమ్మేసిన పిచ్చి చెట్లు

జనరల్ యానిమల్ హౌస్‌ను కమ్మేసిన చెట్లు




క్రికెట్ కోర్టువద్ద పిచ్చిమొక్కలు



జనరేటర్ వద్దకు వెళ్లే దారి లేకుండా కమ్మేసిన పిచ్చి మొక్కలు

వైద్య కళాశాలలో పిచ్చిమొక్కల సాగు!

● సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఎటుచూసినా అవే
● విషసర్పాలకు ఆవాసమైన వైనం ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి: సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణం పిచ్చిమొక్కలకు నిలయంగా మారిపోయింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో అవి దట్టంగా పెరిగి వ్యాప్తి చెందుతున్నాయి. విష సర్పాలు సంచరిస్తున్నాయని వసతి గృహం నుంచి క్లాసులకు వెళ్లే విద్యార్థులు వాపోతున్నారు. మరోవైపు పారిశుధ్య లోపంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతున్నా వాటిని ఖర్చుచేసి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాల్సిన కళాశాల యాజమాన్యం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. బాలుర వసతి గృహం పక్కనే చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా పోసి ఉంచారు. మరోపక్క నర్సింగ్ స్కూల్ సమీపంలో ఎప్పుడో నరికిన ఎండిన చెట్లను తొలగించలేదు. దీంతో ఆ ప్రాంతంలోనూ పాములు సంచరిస్తున్నట్టు విద్యార్థులు వాపోతున్నారు. అధ్వాన పారిశుధ్యంతో ఎప్పుడు ఏ వ్యాధులు సోకుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

తెరపైకి బందరు బంధాలు..!

పేర్ని నానికి కూటమి నేతల అండ! రగులుతున్న కార్యకర్తలు



● 3,708 బస్తాల బియ్యానికి లెక్కలు లేవని అంగీకరించినా నోరు మెదపని కూటమి నేతలు
● తెరవెనుక చక్రం తిప్పుతోంది ఎవరు?
● నూజివీడు లచ్చన్న విగ్రహావిష్కరణ వ్యవహారం ఇక్కడా కొనసాగుతోందా?

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే నానుడి. ప్రస్తుతం బందరు రాజకీయాలకు దాన్ని అన్వయించే పరిస్థితి ఏర్పడింది. అధికారం ఉన్నా, లేకున్నా, రాజకీయ నేతలు కుంభకోణాలు, వివిధ అవినీతి ఆరోపణల్లో చిక్కుకుంటే ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నం తెరవెనుక జరుగుతున్నాయా? విభిన్నమైన రాజకీయ పరిస్థితులు బందరులో వేళ్లానుకున్నాయా? అనే ప్రశ్నలు వారం రోజులుగా ఉదయిస్తున్నాయి. తాజాగా నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రి కొలుసు పార్థసారథి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతోపాటు గతంలో చంద్రబాబు నివాసంపైకి వెళ్లిన జోగి రమేశ్ ర్యాలీ, సభావేదికపై పాలు పంచుకోవడం టీడీపీ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. వారంరోజులుగా బందరుకు చెందిన మాజీ మంత్రి పేర్ని నానికి చెందిన గోడౌన్ల నుంచి 3,708 బస్తాల బియ్యం మాయమైన ఘటన వెలుగులోకి వచ్చినా అధికార పార్టీ నేతలు పెదవి విప్పకపోవడంపై టీడీపీ కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశం మినహా, మరే నేత కనీసం మాట్లాడకపోవడంతో కార్యకర్తలు రగిలిపోతున్నారు.

నాటి బంధం బందీ చేస్తోందా..?

బందరు నియోజకవర్గంలో రాజకీయ నేతలెవరైనా, ఏ పార్టీలో ఉన్నా వారి మధ్య అలవిమాలిన స్నేహంతోపాటు, తెరవెనుక వ్యాపార సంబంధాలుంటాయి. పార్టీల పరంగా పగలు విమర్శించుకున్నా రాత్రికి అందరూ ఒకరి భుజంపై ఒకరు చేతులు వేసుకుని సరదాగా మాట్లాడుకునే సంస్కృతి నేటికీ గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతూనే ఉంది. అందుకే ఎవరు అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నా స్పందించరు. తాజాగా పేర్ని నాని తన గోడౌన్‌లో 3,708 బస్తాల బియ్యం తరుగు ఉందని, ఎంత నగదు చెల్లించాలో చెబితే ప్రభుత్వానికి చెల్లిస్తానని స్వయంగా జేసీకి లేఖ రాశారు. దీంతో బియ్యం మాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజులుగా మీడియాలో కథనాలు వెలువడుతూనే ఉన్నాయి. అయినా అధికారపక్ష కీలక నేతలెవరూ సరిగా స్పందించలేదు. దీనివెనుక కూటమి నేతలకు, మాజీ మంత్రి పేర్ని నానికి మధ్య బలమైన సత్సంబంధాలే కారణమనే అంశంపై టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది.

అధికారులపై ఒత్తిడి తెచ్చేదెవరు?

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని తరచూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ఇతరత్రా అంశాలపై తనదైన శైలిలో మీడియా ముఖంగా విరుచుకుపడుతూ ఉంటారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసేందుకు వైసీపీ తరఫున పేర్ని నానినే మాజీ సీఎం సాధనంలా వాడుకుంటారు. కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు పీడీఎస్ బియ్యం ఎగుమతుల వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి పరిశీలించి వచ్చిన తరువాత పేర్ని నాని ఈ అంశంపై విలేకరుల సమావేశంలో సెటైర్లు వేశారు. ఆ కొద్దిరోజులకే ఆయన పీడీఎస్ బియ్యం మాయం కేసులో చిక్కుకున్నారు. ఇంతా జరిగినా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, టీడీపీ సీనియర్ నేతలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కూటమి నేతలెవ్వరూ పేర్ని నాని అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేయకపోవడం విశేషం. అంతేకాక పీడీఎస్ బియ్యం మాయం కేసులో అధికారులు త్వరగా పేర్నినానిపై చర్యలు తీసుకోకుండా తెరవెనుక అధికారపక్ష నేతలే ఒత్తిడి తెస్తున్నారని కూటమి కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ సుందర్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు, అర్చకులు, తదితరులు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈవో రామారావు, అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ మర్యాదల అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత ఈవో రామారావు, అర్చకులు వారికి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేయగా వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు.



వెంకటాద్రి రైస్ మిల్లులో పరిశీలిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజి

20న గంగూరులో సీఎం పర్యటన

గంగూరు (కంకిపాడు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న గంగూరులో నిర్వహించే పలు కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హెల షారూన్, పెనమలూరు, కంకిపాడు తహసీల్దార్ గోపాల కృష్ణ, భవన్నారాయణతో కలిసి పెనమలూరు కంకిపాడు మండలాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పెనమలూరు తహసీల్దార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20న గంగూరులో నిర్వహించే రెవెన్యూ సదస్సుతో పాటు రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు కాలేదన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

● తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దె

వన్‌టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దె వెంకటేశ్వర ప్రసాద్ (గద్దె ప్రసాద్) అన్నారు. మంగళవరం ఆటోనగర్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు పండించిన పంటను జిల్లాలో ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు కూటమి ప్రభుత్వం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వంలో రైతుల పంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందని, డబ్బులు కూడా సమయానికి వచ్చేవి కాదని, దీంతో రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకునేవారన్నారు. రైతుకు అండగా ఉంటున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి అచ్చెంనాయుడు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యవసాయ కూలీ మృతి

విద్యాధరపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అతి వేగంగా, అజాగ్రత్తగా ప్రయాణించిన టిప్పర్ ట్రాక్టర్‌ను ఢీకొనటంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లాకు చెందిన వ్యవసాయ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందినట్టు మంగళవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాపట్ల జిల్లా, నగరం మండలం, కూపనపూడి గ్రామానికి చెందిన కాగితాల దుర్గారావు (64), అతడి భార్య విక్టోరియా 8 ఏళ్లుగా గొల్లపూడిలో నివాసం ఉంటూ వ్యవసాయ రైతు వెలగపూడి రామకోటేశ్వరరావు పొలంలో పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం దుర్గారావు, మరికొందరు కూలీలు నారు కోసం ట్రాక్టర్‌లో రాయనపాడు వైపునకు బయలుదేరారు. పైపుల కంపెనీ వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి వచ్చిన టిప్పర్ దుర్గారావు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని దుర్గారావు పై నుంచి వెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

పెన్షనర్లు, ఉద్యోగులకు గత ప్రభుత్వంలో తీరని నష్టం



సీనియర్ సిటీజన్స్‌ను సత్కరిస్తున్న ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ వెంకటేశ్వర్లు

గన్నవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాసిందని, 2018 టీడీపీ ప్రభుత్వ హయాంలో అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తీసుకువస్తే దాన్ని వైసీపీ విస్మరించిందని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ దినోత్సవ వార్షిక సభ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బొబ్బరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంపై అడిషనల్ క్వాటమ్ పెన్షన్‌ను ఇచ్చి తీరాల్సిందేనని పోరాడామన్నారు. భార్య భర్తలిద్దరూ ఉద్యోగులైతే హెచ్‌ఆర్ఏ ఒక్కరికే ఇస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పిందన్నారు. చర్చల్లో కూర్చుని ఒప్పందం చేసుకున్నవి కూడా అమలు చేయకపోవటంతో చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు. దేశవ్యాప్తంగా స్పందన వచ్చిందన్నారు. ఏపీజేఏసీ అమరావతి 93 రోజుల పాటు ఉద్యమాలు చేసిందన్నారు. ముందు వరుసలో రిటైర్డ్ ఉద్యోగులున్నారన్నారు. రూ.6వేల కోట్ల జీపీఎఫ్‌ను దారి మళ్లించటంతో రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 17న జీతాలు, పెన్షన్‌లు పడేవన్నారు. పోరాటాల విచ్ఛిన్నానికి కుట్రపన్నిందన్నారు.అనంతరం సీనియర్ సిటీజన్స్‌ను సత్కరించారు. ఏపీ ఎస్‌జీఆర్ఈ అసోసియేసన్ కార్యదర్శులు లోవకుమార్, ఎస్.నారాయణ, ఎస్టీవో టి.నాగరాజు, గన్నే వెంకట్రావు, పి.లక్ష్మీ, మద్దుకూరి విజయకుమార్, పెద్దు వెంకటరత్నం, కనపర్తి సంగీత రావు ఎస్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలి

గవర్నర్‌పేట: ఉద్యోగ విరమణ చేసిన అందరి ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని వేళలా తమ సంఘం అండుబాటులో ఉంటుందని ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని వాకర్స్ అసోసియేషన్ హాలులో సీనియర్ రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బొప్పరాజు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించి లక్షలాది మంది పెన్షనర్లను ఆదుకోవాలని కోరారు.ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి పెనుమాక రాజు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు శాస్త్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ. లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సూర్యారావు, నేతలు పాండురంగారావు, నాగేశ్వరరావు, హనుమంతరావు, వీపీ శర్మ పాల్గొన్నారు. 75ఏళ్లు పైబడిన రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



మహిళా పశుపోషకులకు ఖనిజ లవణ మిశ్రమ ప్యాకెట్లను అందజేస్తున్న డాక్టర్ కె.శ్రీనివాసులు, టీడీపీ నేతలు

పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

● డాక్టర్ శ్రీనివాసులు

ఉంగుటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేపట్టే రైతులకు అదనపు ఆదాయం కల్పించేలా తగిన చేయూతనందించి, పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రత్యేక పథకాలు అమలుచేస్తోందని, పశుపోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధిశాఖ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పెద అవుటపల్లిలో మంగళవారం ఉచిత పశుగర్భకోశ వ్యాధుల చికిత్సాశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పశుపోషణ లాభసాటిగా ఉండాలంటే పశువులకు పచ్చిమేత, దాణా సమృద్ధిగా అందించడంతోపాటు ఆరోగ్యపరిరక్షణలో మేలైన సమగ్ర యాజమాన్య పద్ధతులు రైతులు పాటించాలన్నారు. పశుసంవర్ధకశాఖ అల్లాపురం ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ ఎం.వి.బాలకృష్ణారావు మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ సమస్యలను అశ్రద్ధచేయకుండా సరైన వైద్యచికిత్సలు అందించాలన్నారు. ఈ పశువైద్యశిబిరంలో 82 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఖనిజలవణ మిశ్రమం (మినరల్ మిక్చర్)ప్యాకెట్లను అందజేశారు. వెటర్నరీ డాక్టర్లు నాగార్జున, మల్లిబాబు, రెడ్డెమ్మ, స్థానిక టీడీపీ నేతలు ఆళ్ల హనోక్, మున్నా రామకృష్ణ, కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి ఏడుకొండలరావు, సూర్యనారాయణ, యార్లగడ్డ విజయ్‌బాబు, వెటర్నరీ సిబ్బంది వెంకట్రామయ్య, రఘు, శివ, ఆషా, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పెన్షన్ సంస్కరణలను వ్యతిరేకిస్తాం

● ఎల్ఐసీ పెన్షనర్స్

గవర్నర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పెన్షనర్ల ప్రయోజనాలు దెబ్బతీసే సంస్కరణలను వ్యతిరేకిస్తామని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎన్. పాత్రుడు అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో సభ జరిగింది. ఈ సందర్భంగా పాత్రుడు మాట్లాడుతూ పెన్షనర్లకు వేతన సవరణ జరిగిన జరిగినప్పుడు ఎల్ఐసీ పెన్షనర్లకు కూడా సవరణలు జరగాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలని కోరారు. కనీస పెన్షన్ కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. పెన్షనర్స్ డే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పెన్షనర్లు ఐక్యంగా తమ ప్రయోజనాల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పి.కృష్ణ మాట్లాడుతూ ఎల్ఐసీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కోట్లాది మంది బీమా వినియోగదారుల ప్రయోజనాలు పరిగణలోకి తీసుకుని ఎల్ఐసీలో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ చేయవద్దని కోరారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఐసీలో ఉద్యోగులకు వేతన సవరణ చేయాలన్నారు. అసోసియేషన్ నేతలు ఎస్ గోపాలకృష్ణ, పి. ధృవనారాయణ, కె. దుర్గాప్రసాద్, ఎంఎస్ఆర్ మూర్తి, ఉద్యోగ సంఘ నేతలు సీహెచ్ కళాధర్, ఎంవీ సుధాకర్, ఎన్ శ్రీనివాస్, టి. అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



బీసెంట్ రోడ్డు ఎల్ఐసీ కార్యాలయం వద్ద సభ నిర్వహిస్తున్న ఎల్ఐసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

విద్యుత్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలి

వన్‌టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలని ప్రజా రవాణ సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు షేక్ జిలానీ, అధ్యక్షుడు సి.హెచ్. సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 2029 నాటికి ఆర్టీసీలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ఈ బస్సులను ఆర్టీసీ తన ఉద్యోగులతోనే నడిపించాలని, ప్రయాణికులకు కూడా సంతోషాన్నిచ్చిందన్నారు. ఆర్టీసీ రూట్లలో నడిచే విద్యుత్ బస్సులన్నీ సంస్థ బస్సులే ఉండాలన్నారు. దశల వారీగా ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు చక్కని ప్రణాళికను రూపొందించాలన్నారు. కాలంచెల్లిన బస్సుల స్థానే కొత్త ప్రభుత్వం విద్యుత్ బస్సులను కొనుగోలు చేయాలన్నారు. విద్యుత్ బస్సులు తయారీదారులకు కేంద్రం ఇస్తున్న సబ్సిడీ ఆర్టీసీకే ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న అద్దె బస్సులను దశలవారీగా తగ్గించి విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలన్నారు. దీనిపై ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాలతో రవాణ శాఖ మంత్రి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లకు విద్యుత్ బస్సుల నిర్వహణపై శిక్షణ ఇవ్వటం లేదన్నారు. విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యలు ప్రభుత్వం తీసుకుంటే పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

రైతుబజార్ల ఈవోల బదిలీ

విజయవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లను బదిలీ చేస్తూ రైతుబజార్ల సీఈవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 11మంది ఈవోలు, సూపర్‌వైజర్లకు స్థానచలనం కలిగింది. రైతుబజార్ సీఈవో కార్యాలయంలోని ఎస్టేట్ ఆఫీసర్ ఎస్.కరుణాకర్‌ను కేదారేశ్వరపేటకు బదిలీ చేశారు. కేదారేశ్వరపేటలోని ఎం.రమేష్‌బాబును పటమటకు బదిలీ చేశారు. ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజార్‌కు ఇన్‌చార్జిని అప్పగించారు. జీఎస్ రాజు రోడ్డు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న పి.ఉదయ్‌కిరణ్ మూర్తిని పాయకాపురం బదిలీ చేశారు. జీఎస్ రాజు రోడ్డు రైతుబజార్‌కు ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగించారు. కంచికచర్లలోని ఆర్.అజయ్‌కుమార్‌ను ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జిగా బదిలీ చేశారు. పాయకాపురంలోని సూపర్‌వైజర్ ఆర్.అన్నామణి, కేదారేశ్వరపేటలోని కె.కృష్ణమోహన్‌ను పటమటకు మార్పు చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని బి.వెంకటేశ్వరరావును పాయకాపురానికి, పటమటలోని జి.వెంకటేశ్వరరావును అజిత్‌సింగ్‌నగర్‌కు, భవానీపురంలోని డీవీఎన్ భద్రరావును కేదారేశ్వరిపేటకు, పటమటలోని కె.సుధీర్‌కుమార్‌ను భవానీపురానికి, చల్లపల్లిలోని వి.లక్ష్మణ్‌గౌడ్‌ను కేదారేశ్వరిపేట రైతుబజార్‌కు బదిలీ చేశారు.

వైజాగ్‌లో వాతావరణం అనుకూలించక వెనక్కి వచ్చిన ఎయిర్ ఇండియా

గన్నవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రతిరోజు రాత్రి వైజాగ్ వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం అక్కడ వాతావరణం అనుకూలించక తిరిగి వెనక్కి వచ్చింది. మంగళవారం బెంగళూరు నుంచి 7.35 గంటలకు వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 42 మంది ప్రయాణికులతో 8 గంటలకు వైజాగ్ బయలుదేరి వెళ్లింది. వైజాగ్ విమానాశ్రయంలో విమానం ల్యాండింగ్ అయ్యేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో కొద్దిసేపు చక్కర్లు కొట్టి మళ్లీ గన్నవరం విమానాశ్రయానికి 9.50 గంటలకు చేరుకుంది. ఆ విమానంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌తో వ్యాపారుల ఇబ్బందులు

ధర్నాచౌక్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఎం.హరినారాయణన్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లైసెన్స్ ఫీజు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, ట్రేడ్ లైసెన్స్ చెల్లించని వారికి పెనాల్టీలు అధిక మొత్తంలో విధిస్తున్నారన్నారు. మున్సిపల్ పరిధిలో కమర్షియల్ కాంప్లెక్స్ లీజ్ పూర్తవగానే లీజ్‌ను పొడిగించాలన్నారు. కాంప్లెక్స్‌లో అద్దెలు ఎక్కువగా ఉంటున్నాయని వాటిని తగ్గించి చిన్న వ్యాపారులకు తోడ్పాటు అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారన్నారు.

ధర్నాకు అనుమతి నిరాకరణ తగదు

ధర్నాచౌక్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 19న స్థానిక ధర్నాచౌక్‌లో నిరసన తెలిపేందుకు అనుమతివ్వకపోవడం సరైంది కాదని దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.ఆంజనేయ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ వేశామని, రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తికరణ స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ధర్నాల అనుమతులకు కూడా న్యాయస్థానాలను ఆశ్రయించేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.



టెన్త్ టెస్ట్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్, ఎన్‌జీవో నేతలు

ఎస్ఎస్‌సీ-2025 టెస్ట్ పేపర్స్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ విద్యార్థులకు సైతం ఉపయోగపడేలా యూటీఎఫ్ 30ఏళ్లుగా పదో తరగతి టెస్ట్ పేపర్స్‌ను రూపొందిస్తూ విద్యార్థులకు లబ్ధి చేకూర్చడం అభినందనీయమని ఏపీఎన్‌జీవోస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ అన్నారు. యూటీఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సీ-2025 టెస్ట్ పేపర్స్ ఆవిష్కరణ మంగళవారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత రూపొందించబడిన టెస్ట్ పేపర్స్‌ను సద్వినియోగం చేసుకుని టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరావు మాట్లాడుతూ టెస్ట్ పేపర్స్ కావాల్సిన వారు యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ టెస్ట్ పేపర్స్ రూపకల్పనకు యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ ఎంతో శ్రమకోర్చి పేపర్స్‌ను 4 నెలల ముందే విద్యార్థులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎం. లింగారెడ్డి, నేతలు ఏ గోపాలకృష్ణ, సైదా సాహెబ్, పూర్ణచంద్రరావు, ఎన్‌జీవో నేతలు డి. సత్యనారాయణ, పి. రమేష్, బి. సతీష్‌కుమార్, బి. వెంకటరమణ పాల్గొన్నారు.

సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడిగా రాజయ్య



పెనమలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షునిగా మలినేని రాజయ్య ఎంపికయ్యారు. తాజ్ వివంతా చైర్మన్‌తోపా టు 18 సంస్థలను నిర్వహిస్తున్న రాజయ్య అకాడ మీ అధ్యక్షునిగా ఎంపికవడం శుభపరిణామమని సిద్ధార్థ మేనేజ్‌మెంట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గత అధ్యక్షులు చదలవాడ నాగేశ్వరరావు స్థానంలో రాజయ్య అధ్యక్షులుగా నియమితులయ్యారు. అధ్యక్షుని మార్పుతో సంబంధం లేకుండా కమిటీలోని ఇతర పాలకవర్గ సభ్యులు పాలడుగు లక్ష్మణరావు, సూరెడ్డి వెంకటేశ్వరరావు, నాగభూషణ రావు, చనుమోలు కృష్ణారావు, నిమ్మగడ్డ లలిత ప్రసాద్, సూరెడ్డి విష్ణులు అవే పదవుల్లో కొనసాగుతారని అకాడమి ఆ ప్రకటనలో తెలిపింది.

బాలికను వేధించిన ముగ్గురి అరెస్ట్

ఉంగుటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టి ఇంటినుంచి తీసుకెళ్లిన కేసులో యువకుడిని, అతడికి సహకరించిన తల్లిదండ్రులను ఆత్కూరు పోలీసులు అరెస్ట్‌చేశారు. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కొలుసు వీరబాబు (32) 14 ఏళ్ల బాలికను కొన్నాళ్ల నుంచి ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడు. ఈనెల 14న మాయమాటలు చెప్పి బాలికను తీసుకెళ్లిపోయాడు. తల్లిదండ్రులు సహకరించారు. ఇద్దరినీ పల్నాడు జిల్లా వన్నయ్యపాలెంలోని బంధువుల ఇంటికి పంపి పెళ్లి ప్రయత్నాలు చేశారు. బాలిక తల్లిదండ్రులు ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేయగా ఎస్సై కేసు నమోదుచేశారు. దర్యాప్తు చేసి వీరబాబును అతడి తల్లిదండ్రులు సీతామహాలక్ష్మి, శివయ్యను మంగళవారం అరెస్ట్ చేసి విజయవాడ కోర్టులో ఇన్‌చార్జి న్యాయమూర్తి సి.రమణారెడ్డి ఎదుట హాజరుపర్చారు. ఆయన 14 రోజుల రిమాండ్ విధించగా నిందితులను జైలుకు తరలించారు. కాగా వీరబాబు గతంలోనూ ఇద్దరు మహిళలను ప్రేమపేరుతో మోసంచేసి పెళ్లిళ్ల చేసుకుని కొంతకాలం కాపురం చేసి వదిలేసినట్టు తేలిందన్నారు.


‘విన్నపాల’పై విన్యాసాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం. అధికారులు తప్పుడు నివేదికలు. క్షేత్రస్థాయిలో మాత్రం తమ సమస్యలు తీరడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రజల్లో వ్యతిరేకత రాకముందే ప్రభుత్వం మేల్కొనాలని తెలుగుదేశం పార్టీ నేతలు, మంత్రులు, బ్యూరోక్రాట్లు సూచిస్తున్నారు.

సీఎం ప్రశ్నల వర్షం

కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ ప్రభుత్వం నాటి బాధితుల నుంచి 1.74 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 1.32 లక్షల ఫిర్యాదులు పరిష్కరించినట్లు అధికారులు సీఎంకు నివేదించారు. మొత్తం ప్రజా ఫిర్యాదుల్లో పరిష్కార శాతం 75.88. మొత్తం ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖ పరిష్కరించాల్సినవి 67 వేలు. ఇప్పటికే 49,784 పరిష్కరించామని ఆ శాఖ సీఎంకు నివేదించింది. సమస్యల పరిష్కారంపై ప్రజలు చాలా సంతృప్తిగా ఉన్నారని ఆర్టీజీఎస్ అధికారి సీఎంకు నివేదించారు. ఇక్కడే అసలు ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మీకెలా తెలిసింది? సమస్య పరిష్కారం అయ్యాక మీరు సంబంధిత వ్యక్తులతో మాట్లాడారా? వారి అభిప్రాయం తీసుకున్నారా? అని సీఎం ప్రశ్నించారు. ఆర్టీజీఎస్ అధికారి బదులిస్తూ.. ఈ డేటా కలెక్టర్లు ఇచ్చారంటూ వారిపై తోసేశారు. మీ శాంపిల్ సర్వే డేటా ఎక్కడిది? జిల్లాల్లో ఎవరితో మాట్లాడారు? మీరు సంప్రదించిన వారి డేటా ఉందా? అని సీఎం అడిగితే కలెక్టర్లు మౌనం దాల్చారు. తామిచ్చిన గణాంకాలను చూసి ముఖ్యమంత్రి ఓకే అంటారని, డేటాపై ప్రశ్నలు, సందేహాలు లేవనెత్తరన్నది అధికారుల నమ్మకం కాబోలు. అందుకే వారికి తోచినట్లుగా ప్రజాఫిర్యాదుల పరిష్కారంపై గణాంకాలు వేసి ఉంటారు. సమస్యల పరిష్కారంపై ప్రజల సంతృప్తి స్థాయిని కూడా చాలా ఎక్కువ చేసి చూపించారు. ఇందుకు గ్రాఫిక్స్ జోడించారు. అయితే, సమస్యల పరిష్కారంపై ప్రజా సంతృప్త స్థాయి క్రమంగా తగ్గుతూ వస్తోందని సీఎం చంద్రబాబు బాంబు పేల్చారు. పరిష్కారం అద్భుతంగా ఉంటే సంతృప్తస్థాయి ఎందుకు తగ్గుతుంది? దీనికి అధికారులెవరూ సమాధానాలు చెప్పలేదు. ఎక్కడో ఢిల్లీలో ఉన్న ప్రధాన మంత్రి ఏపీలో ప్రజాఫిర్యాదుల పరిష్కారం బాగోలేదని చెప్పారు. అధికారులు మాత్రం అద్భుతంగా పరిష్కరిస్తున్నామని తప్పుడు లెక్కలతో ప్రజెంటేషన్‌లు ఇచ్చారు. పరిష్కారం చేయకున్నా చేసినట్లుగా, ఫిర్యాదులను బుట్టదాఖలు చేసి లేని సంతృప్తి స్థాయిలను సృష్టించి ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టాలని ప్రయత్నించారు.



గ్రామస్థాయి నుంచి సీఎం వరకు

గ్రామస్థాయి అధికారి నుంచి ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రజాప్రతినిధులకు, మంత్రులకు, పార్టీ కార్యాలయాల్లో ప్రజలు వినతులు అందజేస్తున్నారు. ఈ ఫిర్యాదులన్నింటినీ సంబంధిత శాఖలు, అధికారులకు పంపుతున్నారు. పరిష్కార ప్రక్రియను ఆర్టీజీఎస్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... పరిష్కరించాల్సిన అధికారులు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ఫిర్యాదులకు పరిష్కారం చూపినా, పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా అదే జాబితాలో చేర్చేస్తున్నారని చెబుతున్నారు.

హేతుబద్ధత ఎలా?

ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకమైనవి హేతుబద్ధత, జవాబుదారీ. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునే సమయంలోనే వాటిపై వారి పేరు, ఫోన్ నెంబరు, అడ్రస్ వివరాలు తీసుకుంటే వారిని సులువుగా ట్రాక్ చేయడానికి వీలుంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వానికి వస్తున్న అన్ని ఫిర్యాదుల్లో ఆ వివరాలు ఉంటున్నాయి. వారి సమస్యలను అధికారులు నిజంగా పరిష్కరించినట్లయితే నేరుగా వారికే ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. సమస్య పరిష్కారం తర్వాత వారి అభిప్రాయాన్ని ఆడియో లేదా వీడియో రూపంలో రికార్డు చేసి నివేదిక రూపంలో ఇవ్వవచ్చు. తద్వారా అధికారులు పక్కా ఆధారాలు చూపించవచ్చు. ఇది కష్టంతో కూడుకున్న పని అయినా అధికారులు దృష్టి పెడితే చేయవచ్చు. ప్రతీ గ్రామంలో సచివాలయాలు ఉన్నాయి. అందులో సిబ్బందిని ఉపయోగించుకొని రీడ్రెస్సల్ డేటాను నమోదు చేయించవచ్చు. సమస్యలను పరిష్కరిస్తే ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది. తద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలు మరింత బలపడుతాయని రెవెన్యూ నిపుణుడు రామయ్య అభిప్రాయపడ్డారు.

అంకెల గారడీతో బురిడీ

‘సుదీర్ఘకాలం నేను రెవెన్యూలో పనిచేశాను. అనేక చట్టాల తయారీలో, సదస్సుల నిర్వహణలో భాగస్వామిగా ఉన్నాను. ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే అన్ని వినతులను రికార్డులో నమోదు చేయాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ సమస్యను ఎప్పటిలోగా పరిష్కరించగలరో ఫిర్యాదుదారుకు చెప్పాలి. ఈ డేటాను ఆర్డీఓ, ఆపై కలెక్టర్, ప్రభుత్వానికి నివేదించాలి. ఇలా వచ్చిన డేటాను క్రోడీకరించి నెలకు సగటున ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయో ప్రభుత్వం అంచనా వేస్తుంది. జిల్లా స్థాయిలోనే పరిష్కారమయ్యే విన్నపాలను వెంటనే చేయాలి. రాష్ట్రస్థాయిలో అంటే.. ప్రభుత్వ స్థాయిలో సెటిల్ చేయాల్సినవి కొన్ని ఉంటాయి. జిల్లా స్థాయిలో ఎన్ని పిటిషన్‌లు వచ్చాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వంటి విషయాలను ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్, పీజీఆర్ఎస్ సైట్లలో పొందుపరుస్తారు. ఎక్కడ ఎక్కువ పెండింగ్ ఉంటే ఆ జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. మీ జిల్లాలో ఎందుకు ప్రజాసమస్యలు పరిష్కరించడం లేదంటూ ముఖ్యమంత్రి, సీఎస్, ఇతర అధికారులు వెంటపడతారు. ఈ ఒత్తిడి భరించలేక కొందరు అధికారులు దరఖాస్తులను పరిష్కరించినట్లుగా, బాధితులకు న్యాయం చేసినట్లుగా నివేదికలు రాసి సంబంధిత వినతి పత్రాలను బుట్టదాఖలు చేస్తారు. చంద్రబాబు ఎక్కువగా ఆన్‌లైన్ డేటా వెరిఫికేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. దీంతో సమస్యలు పరిష్కారం కాకపోయినా అధికారులు పరిష్కారమైనట్లుగా నివేదికలు పంపిస్తారు. అంతేగాక అసలు ఆన్‌లైన్ డేటాలోనే నమోదు చేయకుండా ఉండేందుకు వినతులను తీసుకోవడం మానేస్తున్నారు. ఒకవేళ తీసుకున్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. మరోవైపు ప్రభుత్వం నివేదికలు చూసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామన్న భ్రమల్లో ఉంటుంది. ప్రజలు ఏమో తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆవేదనలో ఉంటారు. ఇదే రానురాను ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య గ్యాప్ పెంచుతుంది’ అని రెవెన్యూ నిపుణుడు, రిటైర్డ్ అధికారి రామయ్య చెప్పారు.

నవ్య | చిత్రజ్యోతి

ఇడిచిపెట్టను.. తేల్చాల్సిందే



వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరయిన హీరో అడివి శేష్. షానీల్ డియో దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం ‘డెకాయిట్’. ‘ఓ ప్రేమ కథ’ ఉప శీర్షిక. మంగళవారం, ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఓ పోస్టర్‌ను వదిలింది. ఇందులో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇదివరకు విడుదల చేసిన గ్లింప్స్‌లో కథానాయికగా శ్రుతిహాసన్‌ని చూపించారు. అయితే ప్రస్తుతం రిలీజ్ చేసిన పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్టర్‌ను సోషల్‌మీడియాలో షేర్ చేసిన అడివి శేష్ ..“అవును ప్రేమించావు.. కానీ మోసం చేశావు. ఇడిచిపెట్టను.. తేల్చాల్సిందే” అని పేర్కొన్నారు. దీనికి స్పందించిన మృణాల్.. “అవును వదిలేశాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను” అని తన ఖాతాలో పోస్టర్‌ను షేర్ చేసి, శేష్‌కు బర్త్ డే విషెస్ తెలిపారు. మరోవైపు, అడివి శేష్ నటిస్తున్న చిత్రాలు ‘గూఢచారి’ సీక్వెల్ ‘జీ 2’.. ‘హిట్ 3’. ఈ సినిమాల్లో శేష్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందాలు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాయి.

ఆ విషయంలో నాన్న.. ముఫాసా ఒక్కటే!



‘ద లయన్ కింగ్’కు కొనసాగింపుగా తెరకెక్కిన సినిమా ‘ముఫాసా: ద లయన్ కింగ్’. ఇందులో టైటిల్ పాత్ర తెలుగు వెర్షన్‌కు మహేశ్ బాబు వాయిస్ అందించిన విషయం తెలిసిందే. ఈ నెల 20న సినిమా విడుదలవుతుండడంతో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా సితార ఘట్టమనేని ఈ సినిమా గురించి మాట్లాడిన వీడియోను విడుదల చేసింది. “ముఫాసా లాంటి గొప్ప పాత్రకు నాన్న గొంతునిస్తున్నందుకు ఎంతో గర్విస్తున్నాను. ప్రేమించడంలో.. జాగ్రత్తగా చూసుకునే విషయంలో నాన్నకూ.. ముఫాసాకు చాలా పోలికలు ఉన్నాయి. నాన్న ఈ సినిమాలో భాగమయ్యారని తెలియగానే ఎంతో సంతోషించా.. సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాను. నీ కంటే ముందుగానే ‘ఫ్రోజెన్’ సినిమాతో డిస్నీ ప్రపంచంలోకి అడుగుపెట్టానని అప్పుడప్పుడూ.. నాన్నను ఆటపట్టిస్తుంటాను” అని చెప్పారు.

అప్పట్లో గాలి శీను... ఇప్పుడు బచ్చలమల్లి



అల్లరి నరేశ్

“‘నాంది’ తర్వాత ఓ విభిన్న చిత్రం చేయాలనుకున్నాను. కథ కోసం ఎదురు చూస్తున్న సమయంలో దర్శకుడు సుబ్బు మంగాదేవి ఈ సినిమా కథను వినిపించాడు. సింగిల్ సిట్టింగ్‌లోనే సినిమా చేసేందుకు అంగీకరించాను. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలతో పోల్చితే ‘బచ్చలమల్లి’ చాలా వైవిధ్యం ఉన్న పాత్ర. ఒక్క హాస్యం తప్ప మిగిలిన అన్ని ఎమోషన్స్‌ని ఈ పాత్ర పలికిస్తుంది” అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా సుబ్బు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన చిత్రమిది. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అల్లరి నరేశ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకుంటూ..‘ ‘గమ్యం’లో గాలి శీను పాత్ర ప్రేక్షకులను అలరించినట్లే, ఈ ‘బచ్చలమల్లి’ పాత్ర కూడా ప్రేక్షకులపై చాలా ప్రభావం చూపిస్తుంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి కొత్తగా ప్రయత్నించాను. ‘బచ్చలమల్లి’ అనే వ్యక్తి జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో దర్శకుడు ఈ కథ రాసుకున్నారు. ఆ పాత్రను చేసే క్రమంలో నటుడిగా చాలా సవాళ్లు ఎదురయ్యాయి. నడక, ఏడ్చే విధానం, మాట్లాడే తీరు... ఇలా ప్రతిదీ సరికొత్తగా ఉండేలా ప్రయత్నించాను. ప్రతి మనిషి ఏదో ఒక సందర్భంలో పొగరుతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటాడు. దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి అనే పాయింట్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. కథలో అంతర్లీనంగా మంచి సందేశం ఉంది. అమృత అయ్యర్ పాత్రకు చాలా పేరొస్తుంది. పాత్రల భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందేలా విశాల్ చంద్రశేఖర్ మంచి సంగీతం అందించారు. నిర్మాత రాజేశ్ కూడా కథతో ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు’ అని అన్నారు.

రీ ఎంట్రీకి రెడీ



రమణ గోగుల

కథ, కాంబినేషన్, దర్శకుడు... ఇలా అన్నీ కుదిరితే మళ్లీ సంగీత దర్శకుడిగా పనిచేయడానికి తాను సిద్ధం అని రమణ గోగుల చెప్పారు. కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న ఆయన వెంకటేశ్ నటించిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ చిత్రంలోని ‘గోదారి గట్టు’ పాటను ఆలపించారు. ఇటీవలే విడుదలైన ఆ గీతానికి చక్కని స్పందన దక్కుతోంది. ఈ సందర్భంగా రమణ గోగుల మీడియాతో మాట్లాడుతూ... ‘నాకు సాంకేతిక పరిజ్ఞానం అంటే ఆసక్తి ఎక్కువ. కృత్రిమమేధ, డేటా ఎనలిటిక్స్ విభాగాల్లో పలు ప్రాజెక్టులు చేశాను. ఓ రోజు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఫోన్ చేసి వెంకటేశ్ సినిమా కోసం ఓ పాట పాడాలని అడిగారు. భాస్కరభట్ల సాహిత్యం నచ్చింది. పాట విడుదలయ్యాక చక్కటి స్పందన వచ్చింది. వెంకటేశ్ ఫోన్ చేసి ప్రశంసించారు. మధు ప్రియ కూడా అద్భుతంగా పాడింది. పవన్ కల్యాణ్ క్రియేటివ్ పర్సన్. చాలా కొత్తగా ప్రయత్నిస్తారు. ఫస్ట్ టైం తెలుగు సినిమాల్లో ఇంగ్లీష్ పాటను ఆయన సినిమా కోసమే కంపోజ్ చేశారు. ఇప్పుడు కృత్రిమమేధ వల్ల గాయకుడు పాట పాడాల్సిన అవసరం లేకుండాపోయింది. ఆటోమేటిగ్గా సాంగ్ వస్తుంది. అయితే మనిషి పాడితేనే ఆ పాటకు ప్రాణం వస్తుంది’ అని చెప్పారు.

శ్రీమురళి... రెండు సినిమాలు



ఇటీవలే ‘బఘీర’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కన్నడ హీరో శ్రీ మురళి. ఆయన కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మాతగా కొత్త చిత్రం ఖరారైంది. ఈ విషయాన్ని మంగళవారం నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. శ్రీమురళి పుట్టిన రోజు సందర్భంగా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు ఇది 47వ సినిమా. కాగా, మరో సంస్థ ‘బ్రాండ్ స్టూడియోస్’ శ్రీమురళీతో ‘పరాక్’ అనే సినిమాను నిర్మించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు శ్రీమురళికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది ‘బ్రాండ్ స్టూడియోస్’ చిత్రబృందం.

గన్ అప్పగించిన మోహన్‌బాబు

సినీనటుడు మోహన్‌బాబు తన లైసెన్స్‌డ్ గన్‌ను ఫిల్మ్‌నగర్ పోలీసులకు మంగళవారం అప్పగించారు. ఆయన ఇంట్లో జరుగుతున్న కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆయుధాలను సరెండర్ చేయాలని రాచకొండ కమిషనర్ ఆదేశించారు. కాగా, ఓ గన్‌ను రెండు రోజుల క్రితం చిత్తూరు జిల్లా చంద్రగిరి పోలీసుస్టేషన్‌లో మోహన్‌బాబు సరెండర్ చేశారు.

బంజారాహిల్స్ (ఆంధ్రజ్యోతి)

రాబిన్‌హుడ్ వాయిదా...



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘రాబిన్‌హుడ్’. ఈ నెల 25న క్రిస్మస్‌కు విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడినట్లు చిత్రనిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. ‘కొన్ని అనివార్య కారణాల వల్ల ‘రాబిన్‌హుడ్’ సినిమా ముందుగా అనుకున్న డేట్‌కు విడుదల కావట్లేదు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం” అని పేర్కొంది.

అందరికీ నచ్చుతుంది



పవన్ సుంకర దర్శకత్వంలో షణ్ముఖ్ జస్వంత్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘లీలా వినోదం’. అనగ అజిత్ హీరోయిన్. శ్రీధర్ మారిసా నిర్మించారు. ఈనెల 19 నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో షణ్ముఖ్ జస్వంత్ మాట్లాడుతూ ‘నాకు సరైన సమయంలో ‘లీలా వినోదం’ వచ్చింది. ఈ మూవీ మీ అందరికీ నచ్చుతుంది’ అని అన్నారు. చిత్ర దర్శకుడు పవన్ మాట్లాడుతూ ‘ఈ మూవీలో ఓవర్ థింకింగ్ అనే కాన్సెప్ట్‌ని చూపిస్తున్నాం. దీనికి అందరూ రిలేట్ అవుతారు’ అన్నారు.

కేసీఆర్‌కు కొనసాగింపు



రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా నటించిన కుటుంబ కథా చిత్రం ‘కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్)’. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం చక్కటి ఆదరణతో కొనసాగుతోన్న సందర్భంగా యూనిట్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. హీరో రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ ‘ఒక కసితో ఈ సినిమా చేశాను. డైరెక్టర్ అంజి నేను తలెత్తుకొని తిరిగేలా ఈ సినిమా తీశారు. ఈ సినిమాకు పార్ట్ 2 కూడా ఉంది. త్వరలో నా కొత్త చిత్రాన్ని ప్రకటిస్తా’ అన్నారు.

టాప్-3లో మంధాన

దుబాయ్: టీమిండియా మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన ఐసీసీ వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని మెరుగుపరచుకొని టాప్-3లో చోటు దక్కించుకుంది. వన్డే బ్యాటర్లలో మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకులో నిలిచిన మంధాన.. టీ20ల్లో ఓ స్థానం మెరుగై మూడో స్థానం అందుకుంది. వన్డేల్లో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు కోల్పోయి 13వ ర్యాంక్‌లో ఉండగా, జెమీమా రోడ్రిగ్స్ ఆరు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంకులో నిలిచింది. బౌలర్లలో దీప్తి శర్మ 5వ, రేణుక 26వ, అరుంధతి రెడ్డి 51వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. టీ20 ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ 10వ, జెమీమా 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో దీప్తి 2వ, టిటాస్ సాధు 52వ ర్యాంకుల్లో నిలిచారు.

ఈసారి ఓటమి


మంధాన (62)

- రెండో టీ20లో భారత్‌కు చుక్కెదురు
- మంధాన అర్ధ శతకం వృథా
- 9 వికెట్లతో విండీస్ విజయం

ముంబై: కెప్టెన్ హేలీ మాథ్యూస్ (47 బంతుల్లో 17 ఫోర్లతో 85 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తో విరుచుకుపడడంతో.. భారత మహిళల జట్టు చేతిలో వరుస 9 పరాజయాలకు వెస్టిండీస్ బ్రేకులు వేసింది. మంగళవారం జరిగిన రెండో టీ20లో విండీస్ 9 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మోకాలి నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. రాఘ్వి బిస్త్ అరంగేట్రం చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 159/9 స్కోరు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (41 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 62), రిచా ఘోష్ (17 బంతుల్లో 32) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. డోటిన్, హెన్రీ, మాథ్యూస్, ఫ్లెచర్ తలో 2 వికెట్లు తీశారు. ఛేదనలో వెస్టిండీస్ 15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 160 పరుగులు చేసి గెలిచింది. జోసెఫ్ (38) కలసి తొలి వికెట్‌కు 66 రన్స్ జోడించిన మాథ్యూస్.. క్యాంప్‌బెల్ (29 నాటౌట్) జతగా రెండో వికెట్‌కు 55 బంతుల్లో 94 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పింది. దీంతో విండీస్ 26 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది.

హమ్మయ్య..

గండం గడిచింది

ఫాలోఆన్ తప్పింది

ఆసీస్‌తో మూడో టెస్టు



భారత్ తొలి ఇన్నింగ్స్ 252/9 ● రాహుల్, జడేజా అర్ధసెంచరీలు

ఆఖర్లో ఆదుకున్న ఆకాశ్, బుమ్రా ● కమిన్స్‌కు నాలుగు వికెట్లు

బ్రిస్బేన్: ఓవైపు వరుణుడు వస్తూ, పోతూ ఎంతగా విసిగిస్తున్నా.. భారత బ్యాటర్లు మాత్రం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దీంతో అనూహ్యంగా ఫాలోఆన్ గండం నుంచి జట్టు గట్టెక్కింది. ముందుగా కేఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) నిలకడగా ఆసీస్ బౌలర్లను ఎదుర్కొంటూ ఆశలు కల్పించారు. కానీ, కీలక సమయంలో ఈ జోడీ వెనుదిరగడంతో ఇక అంతా అయిపోయిందనిపించింది. అయితే, ఎవరూ ఊహించని విధంగా ఆకాశ్ దీప్ (27 బ్యాటింగ్), బుమ్రా (10 బ్యాటింగ్) ఎదురొడ్డి నిలిచారు. ప్రధాన బ్యాటర్లకు తామేమీ తక్కువ కాదంటూ పట్టుదలగా క్రీజులో నిలిచిన ఈ ద్వయం ఆఖరి వికెట్‌కు అజేయంగా 39 పరుగులు జోడించడంతో పాటు ఫాలోఆన్ ప్రమాదం నుంచి భారత్‌ను రక్షించింది. ఫలితంగా ఆసీస్ రెండో ఇన్నింగ్స్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగో రోజు మంగళవారం వెలుతురులేమితో ఆట ముందుగానే ముగియగా, ప్రస్తుతం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 252/9 పరుగులతో ఉంది. అయితే ఆసీస్ స్కోరుకన్నా 193 పరుగులు వెనుకబడి ఉంది. దీంతో చివరిరోజైన బుధవారం ఆట ఆసక్తికరంగా మారింది. గెలుపుపై కన్నేసిన ఆసీస్ తొలి సెషన్‌లో భారత్ చివరి వికెట్‌ను త్వరగా తీసి బ్యాటింగ్‌కు దిగాల్సి ఉంటుంది. తర్వాత భారత్‌ను బరిలోకి దించి ఆలౌట్ చేయగలిగితేనే ఆ జట్టు ఈ టెస్టును దక్కించుకుంటుంది. అటు భారత్ నెగ్గే అవకాశాలు దాదాపు లేకపోయినా, ఆలౌట్ కాకుండా డ్రా కోసం పోరాడాల్సిందే. మరోవైపు నాలుగోరోజు కూడా మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అంతరాయం కలిగించడంతో 57.5 ఓవర్ల ఆటే సాగింది.

రాహుల్, జడ్డూ నిలకడ: వాస్తవానికి ఫాలోఆన్ తప్పించుకునే విషయంలో భారత్‌కు కాస్త అదృష్టం తోడైందనే చెప్పాలి. ఓవర్‌నైట్ స్కోరు 51/4తో నాలుగో రోజు ఆట ఆరంభించిన భారత్ మొదటి బంతికే రాహుల్ వికెట్‌ను కోల్పోవాల్సింది. కమిన్స్ ఓవర్‌లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను రెండో స్లిప్‌లో స్మిత్ వదిలేశాడు. అప్పటికి రాహుల్ స్కోరు 33. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్న రాహుల్ మరో 51 రన్స్ జోడించడం భారత్‌కు కలిసొచ్చింది. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్ (10) పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ కమిన్స్‌కు చిక్కాడు. ఈ దశలో రాహుల్‌కు అండగా జడేజా నిలిచాడు. ఈ జోడీ వికెట్ల పతనాన్ని అడ్డుకుంటూ ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. చూస్తుండగానే ఇద్దరూ అర్ధసెంచరీలు సాధించి ఆరో వికెట్‌కు 67 రన్స్ జోడించారు. రాహుల్ సెంచరీ ఖాయమనిపించినా.. స్లిప్‌లో కళ్లుచెదిరే రీతిలో అతడి క్యాచ్‌ను స్మిత్ పట్టేశాడు. అటు నితీశ్ (16)తో కలిసి జడ్డూ జట్టు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఏడో వికెట్‌కు మరో 53 రన్స్ చేరాయి. కమిన్స్ ఓవర్‌లో నితీశ్ బౌల్డ్ కాగా, దూకుడుగా ఆడే క్రమంలో జడేజా 9వ వికెట్‌గా వెనుదిరిగాడు.


ఆకాశ్ (27 బ్యాటింగ్), బుమ్రా (10 బ్యాటింగ్)

టెయిలెండర్ల పోరాటం: భారత్ ఫాలోఆన్ దాటాలంటే 246 స్కోరు సాధించాల్సిందే. కానీ జడేజా అవుటైనప్పుడు స్కోరు 213/9గా ఉంది. క్రీజులో ఆకాశ్, బుమ్రా ఉండడంతో ఈ ఆఖరి వికెట్‌పైనే మరో 33 రన్స్ చేయాల్సి ఉంది. అటు ఆసీస్ శిబిరంలో సంబరాలు.. ఇటు భారత్ శిబిరంలో ఆందోళన స్పష్టంగా కనిపించింది. భారత్ మరోసారి బ్యాటింగ్ చేయాల్సిందే అనే భావన అంతటా కనిపించింది. కానీ గాబాలో అద్భుతమే జరిగింది. ఆకాశ్, బుమ్రా మొండిగా నిలిచారు. ఆసీస్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ చకచకా రన్స్ రాబట్టారు. ఆకాశ్ దూకుడుగా ఆడుతుండడంతో రిస్క్ వద్దు.. సింగిల్స్ చాలు అన్నట్టుగా అతడికి కెప్టెన్ నుంచి సంకేతాలు అందాయి. అటు బుమ్రా కూడా వికెట్ కాపాడుకుంటూ సహకరించాడు. చివరికి ఆట ఆఖరి ఓవర్‌లో ఆకాశ్ ఫోర్‌తో ఫాలోఆన్ దాటించగానే స్టేడియంలో ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. అదే ఓవర్‌లో ఆకాశ్ అద్భుత సిక్సర్ బాది ఆకట్టుకున్నాడు. అయితే వెలుతురులేమితో వెంటనే ఆటను ముగించారు.



గెలిచినంత సంబరం

అక్కడ భారత్ మ్యాచ్ గెలిచింది లేదు.. కనీసం ఆసీస్ స్కోరును కూడా దాటింది లేదు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ పట్టరాని సంతోషంతో సంబరాలు చేసుకున్నారు. ఎందుకంటే.. ఎట్టి పరిస్థితిలో భారత్‌కు ఫాలోఆన్ తప్పదని భావించిన వేళ.. గాబాలో జరిగిన అద్భుతాన్ని వారు నమ్మలేకపోయారు. ఆఖరి వికెట్‌కు ఆకాశ్, బుమ్రా క్రీజులో నిలకడను ప్రదర్శిస్తూ ఒక్కో పరుగు జత చేస్తూ వచ్చారు. కమిన్స్ ఓవర్‌లో గల్లీ మీదుగా ఆకాశ్ కొట్టిన ఫోర్‌తో జట్టు 246 స్కోరుతో ఫాలోఆన్ దాటింది. అటు టెన్షన్‌గా చూస్తున్న గంభీర్ ఒక్క ఉదుటున లేచి కోహ్లీకి హైఫైవ్స్ ఇవ్వగా.. అటు రోహిత్, విరాట్ కూడా చప్పట్లతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4; రాహుల్ (సి) స్మిత్ (బి) లియోన్ 84; గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1; విరాట్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 3; పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 9; రోహిత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 10; జడేజా (సి) మార్ష్ (బి) కమిన్స్ 77; నితీశ్ (బి) కమిన్స్ 16; సిరాజ్ (సి) క్యారీ (బి) స్టార్క్ 1; బుమ్రా (బ్యాటింగ్) 10; ఆకాశ్ (బ్యాటింగ్) 27; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 74.5 ఓవర్లలో 252/9. వికెట్ల పతనం:** 1-4, 2-6, 3-22, 4-44, 5-74, 6-141, 7-194, 8-201, 9-213. **బౌలింగ్:** స్టార్క్ 24-3-83-3; హాజెల్‌వుడ్ 6-2-22-1; కమిన్స్ 20.5-2-80-4; లియోన్ 21-0-54-1; హెడ్ 1-0-1-0; మార్ష్ 2-0-6-0.

గాయంతో హాజెల్‌వుడ్ అవుట్

ఆసీస్ పేసర్ హాజెల్‌వుడ్ గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. నాలుగో రోజు ఆటకు ముందు వామప్ సమయంలో అతడి కుడి కాలి కండరాలు పట్టేశాయి. ఆ తర్వాత మ్యాచ్ ఆరంభమైన కాసేపటికి వచ్చి కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేశాడు. ఆ తర్వాత స్కానింగ్ కోసం వెళ్లి తిరిగి బరిలోకి దిగలేదు. చివరి రోజు కూడా దూరం కానున్నాడని ఆసీస్ జట్టు ప్రకటించింది. అయితే విగతా రెండు టెస్టులు కూడా తను ఆడే అవకాశం లేదని, అతడి స్థానంలో బోలాండ్‌ను ఆడించనున్నట్టు సమాచారం.

కివీస్ భారీ విజయం

హామిల్టన్: ఇంగ్లండ్‌తో ఇప్పటికే తొలి రెండు టెస్టులు ఓడి సిరీస్‌ను కోల్పోయిన ఆతిథ్య న్యూజిలాండ్ చివరిదైన మూడో మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటింది. ఈ టెస్టులో ఏకంగా 423 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా తమ పేసర్ టిమ్ సౌథీకి అద్భుత వీడ్కోలు పలికింది. 658 పరుగుల లక్ష్యంతో నాలుగో రోజైన ఓవర్‌నైట్ స్కోరు 18/2తో బరిలోకి దిగిన ఇంగ్లండ్.. స్పిన్నర్ శాంట్నర్ (4/85) ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 234 రన్స్‌కే పరిమితమైంది. బెథెల్ (74), రూట్ (54), అట్కిన్సన్ (43) రాణించారు. గాయంతో స్టోక్స్ బరిలోకి దిగలేదు. సౌథీ, హెన్రీకి రెండేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 347, ఇంగ్లండ్ 143 స్కోర్లు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 453 రన్స్ చేసింది. కాగా, తొలి రెండు టెస్టులు నెగ్గడంతో ఇంగ్లండ్ 2-1తో సిరీస్‌ను నెగ్గింది.

గుకేష్‌కు ఘన సన్మానం



చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న పిన్న వయసు ఆటగాడిగా చరిత్ర సృష్టించిన గుకేష్‌ను అతని సొంత రాష్ట్రం తమిళనాడు ఘనంగా సన్మానించింది. మంగళవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పాల్గొని గుకేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా గుకేష్‌కు నజరానాగా రూ. 5 కోట్ల చెక్‌ను సీఎం అందజేశారు.

యోధాస్ ఆశలు సజీవం

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో టేబుల్ టాపర్ హరియాణా స్టీలర్స్‌కు యూపీ యోధాస్ జట్టు షాకిచ్చింది. మంగళవారం జరిగిన కీలక పోరులో యోధాస్ 31-24 తేడాతో స్టీలర్స్‌పై గెలుపొందింది. ఓడితే ఇంటికే అన్న పరిస్థితుల్లో మ్యాచ్ బరిలోకి దిగిన యోధాస్ ఆరంభం నుంచే ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ అనుకున్న ఫలితాన్ని రాబట్టింది. భవానీ రాజ్‌పుత్ 11 పాయింట్లు సాధించి యోధాస్ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో యూపీ యోధాస్ పాయింట్ల పట్టికలో మూడోస్థానానికి చేరి ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ 35-26 తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. జైపూర్ జట్టు పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది.

దేవుడా.. ఇంకెన్ని చేయాలి!



న్యూఢిల్లీ: ముంబై బ్యాటర్ పృథ్వీ షాకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పృథ్వీకి తాజాగా విజయ్ హజారే ట్రోఫీ కోసం ఎంపిక చేసిన ముంబై జట్టులో చోటు దక్కలేదు. ఫిట్‌నెస్ సమస్యలు, క్రమశిక్షణ రాహిత్యం కారణంగా రంజీ సీజన్ మధ్యలోనే జట్టులో చోటు కోల్పోయిన పృథ్వీ.. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీతో మళ్లీ జట్టులోకొచ్చాడు. అయితే, ఆ టోర్నీలో అంతగా సత్తా చాటకపోయినా, జట్టుకు మెరుపు ఆరంభాలు అందించాడు. ఈ క్రమంలోనే హజారే టోర్నీకి ఎంపికవుతానని పృథ్వీ భావించాడు. కానీ, సెలెక్టర్లు ఉద్వాసన పలకడంతో తీవ్ర భావోద్వేగానికి గురైన పృథ్వీ.. తన ఆవేదనను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. 'దేవుడా..చెప్పు. ఇంకా ఎన్ని చేయాలి? 65 ఇన్నింగ్స్‌లు.. 3399 పరుగులు.. 126 స్ట్రయిక్ రేట్.. 55.7 సగటు.. నమోదు చేసినా, ఇవేవీ నా ఎంపికకు సరిపోవడం లేదు. అయినా నీ (దేవుడి)పై నమ్మకం సడలదు. కచ్చితంగా పునరాగమనం చేస్తా. ఓం సాయిరాం..' అని పృథ్వీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. 25 ఏళ్ల షా టీమిండియా తరఫున అరంగేట్ర టెస్టులోనే శతకం బాదడంతో ఎంతో ప్రతిభావంతుడనే ప్రశంసలు అందుకొన్నాడు. కానీ, అదే జోరును కొనసాగించలేక జట్టులో చోటు కోల్పోయాడు.


బిజినెస్

మ్యూచువల్ ఫండ్స్ నుంచి

ఎంఎఫ్ లైట్

అందుబాటులోకి కొత్త పెట్టుబడి పథకం

కనీస పెట్టుబడి రూ.10 లక్షలు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నుంచి 'ఎంఎఫ్ లైట్' పేరుతో కొత్త పెట్టుబడి పథకం అందుబాటులోకి రానుంది. మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఇందుకు ఆమోద ముద్ర వేసింది. దీనికి సంబంధించి ఎంఎఫ్ నిబంధనలు సవరించింది. అధిక రిస్క్‌కు సిద్ధపడే మదుపరులు మాత్రమే ఈ పథకంలో పెట్టుబడి పెట్టేందుకు అర్హులు. స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్) ద్వారా మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ పథకాల్లోకి పెట్టుబడులు స్వీకరిస్తాయి. ఎంఎఫ్ లైట్ పథకాల్లో మదుపు చేయాలనుకునే మదుపరులు కనీసం రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టాలి. అయితే అధీకృత మదుపరులకు ఈ నిబంధన వర్తించదు.

అర్హతలు

పోర్టుఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్), ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్)కు ప్రత్యామ్నాయంగా సెబీ ఈ సరికొత్త పెట్టుబడి పథకాన్ని తీసుకొచ్చింది. కనీసం రూ.35 కోట్ల నికర ఆస్తులు ఉన్న ఎంఎఫ్‌ల అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)లను మాత్రమే ఈ ఎంఎఫ్ లైట్ పథకాలు ప్రారంభించేందుకు అనుమతిస్తారు. అయితే గత ఐదేళ్ల నుంచి వరుసగా లాభాల్లో ఉన్న ఏఎంసీలకైతే రూ.25 కోట్ల నికర ఆస్తులు ఉంటే సరిపోతోంది..

మిత్రా పేరుతో కొత్త ప్లాట్‌ఫామ్

నిర్వహణలో లేని, క్లెయిమ్ చేయని మ్యూచువల్ ఫండ్స్ నిష్క్రియ ఖాతాల (ఫోలియో)ను ట్రాక్ చేసేందుకు సరికొత్త ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తేవాలని కూడా సెబీ నిర్ణయించింది. మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రేసింగ్ అండ్ రిట్రీవల్ అసిస్టెంట్ (మిత్రా) పేరుతో ఈ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్ సాయంతో మదుపరులు మరిచిపోయిన నిర్వహణలో లేని, క్లెయిమ్ చేయని తమ ఎంఎఫ్ ఫోలియోలను ట్రాక్ చేసుకోవచ్చు. అయితే ఇందుకోసం వారు తమ తాజా కేవైసీ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు (ఆర్‌టీఏ) ఈ ప్లాట్‌ఫామ్స్‌ను నిర్వహించాలని సెబీ ప్రతిపాదించింది.



రూ.5 లక్షల కోట్లు

గల్లంతు

స్టాక్ మార్కెట్లో భారీ నష్టాలు

- సెన్సెక్స్ 1,064 పాయింట్లు డౌన్
- 81,000 దిగువ స్థాయికి సూచీ
- 24,300 వద్దకు పడిపోయిన నిఫ్టీ
- ఫెడ్ రిజర్వ్ సమీక్ష నేపథ్యంలో

మార్కెట్లో పోటెత్తిన అమ్మకాలు

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 1,064.12 పాయింట్లు (1.30 శాతం) పతనమై 80,684.45 వద్దకు పడిపోయింది. నిఫ్టీ 332.25 పాయింట్లు (1.35 శాతం) క్షీణించి 24,336 వద్దకు జారుకుంది. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ), బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) ఈవారంలో ప్రామాణిక వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో అప్రమత్తమైన ఇన్వెస్టర్లు అమ్మకాలను పోటెత్తించారు. వాణిజ్య లోటు రికార్డు స్థాయికి పెరగడం, రూపాయి క్షీణతతో పాటు మన మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మళ్లీ తరలిపోతుండటం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీసింది. అమ్మకాల హోరులో మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.4.92 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.455.14 లక్షల కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీలూ నష్టపోయాయి. బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన మిడ్‌క్యాప్ 0.65 శాతం, స్మాల్‌క్యాప్ 0.52 శాతం నష్టపోయాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. టెలికాం అత్యధికంగా 2.18 శాతం పతనమవగా.. మెటల్, ఆటో, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్‌లు 1.77 శాతం వరకు క్షీణించాయి. బీఎస్ఈలో 2,502 కంపెనీల స్టాక్స్ నష్టపోగా.. 1,521 లాభపడ్డాయి. 84 యథాతథంగా ముగిశాయి. 28 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి.

ఐపీఓ సమాచారం

- వెంటివ్ హాస్పిటాలిటీ రూ.1,600 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), కరారో ఇండియా లిమిటెడ్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 24న ముగియనున్నాయి. వెంటివ్ హాస్పిటాలిటీ ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.610-643గా నిర్ణయించింది. కరారో ఇండియా ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.668-704గా ఉంది.
- ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఆయ్ ఫైనాన్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,450 కోట్లు సమీకరించనుంది.
- ఆరాధ్య డిస్పోజల్ ఇండస్ట్రీస్ ఐపీఓకు వచ్చేందుకు ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ 'ఎన్ఎస్ఈ ఎమర్జ్'కు డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన 36.96 లక్షల షేర్లను విక్రయించనుంది.

కార్ల తయారీలో మారుతి రికార్డు

ఒక ఏడాదిలో 20 లక్షల కార్ల ఉత్పత్తి



న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ఒక క్యాలెండర్ సంవత్సరంలో 20 లక్షల యూనిట్ల తయారీ మైలురాయిని తొలిసారిగా అధిగమించింది. అలాగే సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గల తయారీ కేంద్రాల్లో కూడా ఈ మైలురాయి అధిగమించింది మారుతి సుజుకీ ఒక్కటే. 20 లక్షల ఉత్పత్తిగా ఎర్టిగా కారును మనేసార్ ప్లాంట్ నుంచి విడుదల చేశారు. ఈ 20 లక్షల కార్లలో 60 శాతం హరియాణా ప్లాంట్లలో తయారు కాగా 40 శాతం గుజరాత్‌లో తయారయ్యాయి.

- కంప్రెసర్ల తయారీ సంస్థ ఎల్జీ.. మార్కెట్లోకి పోర్టబుల్ ఎయిర్ కంప్రెసర్ పీజీ 850ఎస్-290 తీసుకువచ్చింది. ఢిల్లీలో జరిగిన కాన్‌ఎక్స్‌పో ఇండియా సదస్సులో దీన్ని ఆవిష్కరించింది. ఇంటెలిజెంట్ కంట్రోల్ సిస్టమ్‌తో ఈ కంప్రెసర్ పనిచేయనుంది.
- బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ రివర్.. విశాఖపట్నంలో తన మొదటి స్టోర్‌ను ప్రారంభించింది. శ్రీరామ్ మోటార్స్‌తో కలిసి ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. కంపెనీ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం ఇండీకి విశాఖ నుంచి చాలా ప్రీ-ఆర్డర్లు రావటంతో ఇక్కడ స్టోర్‌ను ప్రారంభించినట్లు రివర్ తెలిపింది. ఇండీ స్కూటర్ ధర రూ.1,42,999 (విశాఖ ఎక్స్‌షోరూమ్). కాగా వచ్చే ఏడాది మార్చినాటికి దేశవ్యాప్తంగా మొత్తం షోరూమ్‌ల సంఖ్యను 25కు చేర్చాలని రివర్ భావిస్తోంది.

శ్రీసిటీలో కంప్రెసర్ల తయారీ ప్లాంట్

తైవాన్ సంస్థ రెచీ ప్రెసిషన్‌తో డైకిన్ జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజిరేషన్ సిస్టమ్స్ తయారీ దిగ్గజం డైకిన్ ఇండస్ట్రీస్.. తైవాన్‌కు చెందిన రెచీ ప్రెసిషన్ సంయుక్త భాగస్వామ్యం (జేవీ)లో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో కంప్రెసర్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఇన్వర్టర్, నాన్ ఇన్వర్టర్ ఏసీలకు రోటరీ కంప్రెసర్ల డిజైన్, తయారీ, విక్రయం కోసం ఒక జేవీ ఏర్పాటు చేయబోతున్నట్టు రెండు సంస్థలు ప్రకటించాయి. ఈ ప్లాంట్‌లో దేశీయ మార్కెట్‌తో పాటు కొన్ని ఎంపిక చేసిన విదేశీ మార్కెట్ల కోసం కంప్రెసర్లు తయారుచేస్తారు. ఈ ప్రాజెక్టుపై పెట్టుబడి ఎంత అన్నది డైకిన్ ప్రకటించకపోయినప్పటికీ సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. వచ్చే ఐదారేళ్ల కాలంలో ఈ మొత్తం ఇన్వెస్ట్ చేస్తారు. అయితే ఈ జేవీలో డైకిన్ మెజారిటీ భాగస్వామిగా ఉండనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఈ ప్లాంట్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. హెచ్‌వీఏసీ (హీటింగ్, వెంటిలేషన్, ఏసీ, రిఫ్రిజిరేషన్) విభాగంలో రోటరీ కంప్రెసర్లు, మోటార్లు, ఇతర విడిభాగాల తయారీలో రెచీ ప్రెసిషన్‌కు మంచి పేరుంది. కాగా ఇప్పటికే శ్రీసిటీలో ప్లాంట్‌ను నిర్వహిస్తున్న డైకిన్ భారత హెచ్‌వీఏసీ మార్కెట్లో అగ్రగామి కంపెనీల్లో ఒకటిగా ఉంది.

ఐటీఆర్‌లో తేడాలుంటే ఎస్ఎంఎస్‌లు

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. 2021-22, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేశారా? లేదా? ఫైల్ చేసినా మీరు దాఖలు చేసిన ఐటీఆర్‌లోని ఆదాయ, ఖర్చుల లావాదేవీలు.. యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ (ఏఐఎస్) లోని లావాదేవీల మధ్య తేడాలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించింది. ఇలాంటి పన్ను చెల్లింపుదారులను ఇప్పటికే గుర్తించి, తేడాలను సరిదిద్దుకోవాలని వారి మొబైల్ ఫోన్లు, ఈ-మెయిల్స్‌కు సందేశాలు పంపించింది. ఈ-వెరిఫికేషన్ స్కీమ్, 2021లో భాగంగా ఈ ప్రచారం చేపట్టినట్టు సీబీడీటీ తెలిపింది. ఐటీఆర్-ఏఐఎస్ మధ్య తేడాలు ఉన్న ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఆ తేడాలను సరిదిద్దుకుని ఈ నెలాఖరులోగా తమ ఐటీఆర్‌లు మళ్లీ ఫైల్ చేయాలని కోరింది.

పోకో ఎం7ప్రో, సీ75 స్మార్ట్‌ఫోన్లు



భారత మార్కెట్లోకి షామీ సబ్ బ్రాండ్ పోకో.. ఎం7ప్రో, సీ75 5జీ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఎంట్రీ లెవల్ కొనుగోలుదారులను దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ స్మార్ట్‌ఫోన్స్‌ను తీసుకువచ్చింది. పోకో ఎం7 ప్రో 6జీబీ రామ్ ప్లస్ 128 జీబీ స్టోరేజీ, 8జీబీ రామ్ ప్లస్ 256 జీబీ మెమరీతో అందుబాటులో ఉంటాయి. వీటి ధరలు వరుసగా రూ.13,999, రూ.15,999గా ఉన్నాయి. కాగా 4జీబీ రామ్ ప్లస్ 64 జీబీ స్టోరేజ్‌తో కూడిన పోకో సీ75 ధర రూ.7,999.


పెన్నా, సంఘీ.. అంబుజాలో విలీనం

న్యూఢిల్లీ: పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌తో పాటు సంఘీ ఇండస్ట్రీస్‌ను తనలో విలీనం చేసుకోబోతున్నట్టు అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్ మంగళవారం వెల్లడించింది. ఇందుకోసం విడివిడిగా విలీన పథకాలను ప్రకటించింది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలు అంబుజాకు అనుబంధ విభాగాలుగా ఉన్నాయి. సంస్థ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించడంతో పాటు మెరుగైన పాలనకు ఇది తోడ్పడనుందని అంబుజా సిమెంట్ ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సహా ఇతర నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి విలీన ప్రక్రియ పూర్తికి 9-12 నెలల సమయం పట్టవచ్చని అంచనా వేసింది. అంబుజా సిమెంట్ 2023 డిసెంబరులో సంఘీ ఇండస్ట్రీస్‌ను, 2024 ఆగస్టులో పెన్నా సిమెంట్‌ను కొనుగోలు చేసింది. కాగా, విలీన పథకంలో భాగంగా సంఘీ ఇండస్ట్రీస్ వాటాదారులకు తాము కలిగిన ప్రతి 100 షేర్లకు గాను అంబుజా సిమెంట్స్‌కు చెందిన 12 షేర్లు దక్కనున్నాయి. పెన్నా సిమెంట్ విషయానికొస్తే, రికార్డు తేదీ నాటికి కంపెనీ షేర్లు కలిగిన వారికి ఒక్కో షేరుకు రూ.321.50 లభించనుంది.

ప్రత్యేక కంపెనీగా ఐటీసీ హోటల్స్

జనవరి 1 నుంచి అమలు

ఐటీసీ హోటల్స్ పేరుతో హోటళ్ల వ్యాపారాన్ని విభజించేందుకు అన్ని షరతులను పూర్తి చేసినట్లు ఐటీసీ గ్రూప్ మంగళవారం వెల్లడించింది. ఈ విభజన 2025 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా, ఐటీసీ హోటల్స్.. 60 శాతం ఈక్విటీ వాటా షేర్లను ఐటీసీ వాటాదారులకు కంపెనీలో వారి షేర్‌హోల్డింగ్ ఆధారంగా కేటాయించనుంది. కంపెనీలోని మిగతా 40 శాతం వాటాను ఐటీసీ కలిగి ఉండనుంది. ఐటీసీ హోటల్స్ దేశంలోని 90కి పైగా ప్రాంతాల్లో 140కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	1,00,000 ▼
విజయవాడ	79,400 ▼	72,300 ▼	92,000 ▼
విశాఖపట్నం	76,900 ▼	70,490 ▼	90,320 ▼
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	93,000 ▲
ప్రొద్దుటూరు	79,400 ▲	72,300 ▼	92,000 ▼
ముంబై	76,362 ▼	69,948 ▼	88,525 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	610
వరంగల్	582	గోదావరి	610
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		దజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	104
వరంగల్	96	గుంటూరు	107
కరీంనగర్	96	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	97
కర్నూలు	96	నెల్లూరు	97
విశాఖపట్నం	108	అనంతపురం	97
గోదావరి	104		

గాల్లో భద్రంగా.. ప్రయాణించిన గుండె!


రేణిగుంట విమానాశ్రయంలో గుండెను అంబులెన్సులోకి తరలిస్తున్న డాక్టర్లు

తిరుపతి వైద్యం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. దీంతో బాధితులు తిరుపతి లోని శ్రీపద్మావతి హృదయాలయంలో చేరారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో యువకుడికి వైద్య పరీక్షలు నిర్వహించి, వివరాలను జీవన్‌దాన్ పోర్టల్లో నమోదు చేశారు. మరోవైపు విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మురళి(50) బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అవయవ దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న వైద్యులు మంగళవారం విశాఖపట్నంలోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకొని అక్కడ 11 గంటలకు గుండె సేకరణను పూర్తి చేసి, గ్రీన్‌చానల్ ద్వారా 12 గంటలకు ప్రత్యేక విమానంలో 1.30కు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి ప్రత్యేక అంబులెన్సులో 1.45కి శ్రీపద్మావతి హృదయాలయానికి చేరుకుని, ఆ గుండెను ప్రకాశం జిల్లా యువకుడికి విజయవంతంగా అమర్చారు.



నేటి నుంచి 'హై లైఫ్' ఎగ్జిబిషన్

ప్రముఖ సంస్థలు, అగ్రశ్రేణి డిజైనర్లు రూపొందించిన ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, పెళ్లి దుస్తులతో విజయవాడలోని నోవాటెల్‌లో 'హై లైఫ్' ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. బుధ, గురువారాల్లో జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ బ్రాండ్‌లు, అగ్రశ్రేణి డిజైనర్ల నుంచి అత్యుత్తమ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ, ప్రత్యేకమైన ఉత్పత్తులను సొంతం చేసుకునేందుకు, ప్రసిద్ధ డిజైనర్లను కలిసి మరపురాని షాపింగ్ అనుభవాన్ని ఆస్వాదించేందుకు 'హై లైఫ్' ఎగ్జిబిషన్‌కు రావాలని ఔత్సాహికులను కోరారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

రూ.425 కోట్లు గల్లంతు!

ఉమ్మడి గుంటూరు జిల్లా సహకార సంఘాల్లో భారీ కుంభకోణం

- వైసీపీ హయాంలో బినామీల పేరిట నిధులు స్వాహా
- జీడీసీసీ వేదికగా సాగిన నకిలీ రుణాల బాగోతాలు
- తాజాగా ఆడిట్‌తో అక్రమాలు వెలుగులోకి
- సీఐడీ విచారణకు 2022లోనే ఉన్నతాధికారి లేఖ
- ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు


గుంటూరులోని జీడీసీసీ ప్రధాన కార్యాలయం

గుంటూరు సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీ కుంభకోణం పూర్తి స్థాయిలో వెలుగుచూసింది. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(జీడీసీసీ), సొసైటీల్లో సుమారు రూ.425 కోట్లు గల్లంతైనట్లు ఆడిట్ తనిఖీల్లో వెల్లడైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అక్రమాల తంతు జరిగినట్లు తేలింది. వైసీపీకి చెందిన పలువురు ప్రముఖులు.. ఊరూపేరు లేని బినామీలను అడ్డంపెట్టుకుని రుణాల పేరిట జీడీసీసీ, సహకార సంఘాల్లో వందల కోట్లు దారిమళ్లించినట్లు గుర్తించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాల్లో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. వసూలు కానీ మొండి బకాయిలు ఎవరివన్న కోణంలో ఆరా తీస్తే వైసీపీ నేతలు సాగించిన హస్తలాఘవం బయటికొచ్చింది. గుంటూరు పరిసర ప్రాంతాల్లోని కోల్డ్‌స్టోరేజ్‌లు, ఇతర వ్యాపార సంస్థలను అడ్డంపెట్టుకుని సదరు నేతలు ఇబ్బడిముబ్బడిగా రుణాల పేరిట బ్యాంకు సొమ్ము దారిమళ్లించారు. వాస్తవానికి జిల్లా సహకార శాఖ అధికారులు 2022లోనే ఇలాంటి అక్రమాలను గుర్తించి అప్పటి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఆ వెంటనే ఓ ఉన్నతాధికారి ఈ అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు సమాచారం. అయితే వైసీపీలోని ప్రముఖ నేతలు ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించినందున సీఐడీ విచారణకు అడ్డుతగిలినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మారిన తర్వాత జీడీసీసీ వేదికగా సాగిన నకిలీ రుణాల బాగోతాలు వెలుగులోకి వచ్చాయి. గుంటూ రు జిల్లాలోని ప్రత్తిపాడు, నల్లపాడు, రెడ్డిపాలెం, గోరంట్ల, కాకుమాను, పెదనందిపాడు, పల్నాడు జిల్లాలోని గురజాల తదితర ప్రాంతాల్లో ఒకరి పేరుతో వేరొకరు రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. వాటిపై మీడియాలో కథనాలు రావడంతో జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో రూ.425 కోట్లు దారిమళ్లించిన వ్యవహారం బయటకు వచ్చింది. ఒక్క గుంటూరు జిల్లాలోనే సుమారు రూ.225 కోట్లు వసూలు కాని మొండి బకాయిలుగా గుర్తించారంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవచ్చు. మొండి బకాయిలు పేరిట ఉన్న మొత్తం సొమ్మంతా వైసీపీ నేతల జేబుల్లోకే వెళ్లి ఉంటుందని కొందరు అధికారులు అంటున్నారు. ఈ అక్రమాల్లో జీడీసీసీ బ్యాంకు అధికారులు, సిబ్బంది, సహకార సంఘాల్లోని సిబ్బంది పాత్ర కూడా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల శాసనసభ సమావేశాల్లో ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అక్రమాలపై జీడీసీసీ, సహకార శాఖలోని అధికారులతో లోపాయికారి విచారణ జరిపిస్తుండటంపై కొందరు ఎమ్మెల్యేలు అభ్యంతరం కూడా వ్యక్తం చేశారు. ఆయా శాఖలకే చెందిన అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి రావని, ఎమ్మెల్యేలు ప్రభుత్వ పెద్దలకు చెప్పినట్లు తెలిసింది. సీఐడీ విచారణ జరిపించాలని ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది.

విచారణాధికారులకు బెదిరింపులు!

జీడీసీసీ, సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో బ్యాంకు అధికారులు, సిబ్బందితో పాటు, సహకార శాఖలోని కొందరు ఉద్యోగుల పాత్ర కూడా ఉందని తేల్చి చర్యలకు ఉపక్రమించారు. బాధ్యులైన ఉద్యోగుల కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొందరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయించారు. ఈ క్రమంలో విచారణ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ మహిళా అధికారి తెర వెనుక నుంచి ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

గల్ఫ్ చెర నుంచి బయటపడిన మహిళ

- మంత్రి సుభాష్‌కు బాధితురాలి వీడియో సందేశం
- స్పందించిన మంత్రి లోకేశ్.. ఆయన సహకారంతో స్వగ్రామానికి
- బాధితురాలిది కోనసీమ జిల్లా 'అంతర్వేది కర'


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, బాధితురాలు దీప్తి

రామచంద్రపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్ మాటలు నమ్మి మోసపోయిన కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది కర గ్రామానికి చెందిన గల్ఫ్ బాధితురాలు గంటా దీప్తి ఎట్టకేలకు స్వగ్రామానికి చేరింది. భర్త, పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బు కోసం ఏజెంటు కేతా శ్రీనివాస్ ద్వారా దీప్తి బహ్రెయిన్ వెళ్లింది. అక్కడ అక్టోబరు 24న ఓ ఇంట్లో పనికి చేరింది. చిన్న ఇంట్లో పని అనిచెప్పి నాలుగు అంతస్తుల భవనంలో వెట్టి చాకిరీ చేయిస్తూ చిత్ర హింసలకు గురి చేశారు. సరైన తిండి కూడా పెట్టకుండా నిర్బంధించారు. దీంతో దీప్తి తీవ్ర అనారోగ్యానికి గురైంది. తనను చెర నుంచి విడిపించాలని మంత్రి సుభాష్‌కు వీడియో సందేశం పంపింది. ఆయన స్పందించి మంత్రి లోకేశ్, బహ్రెయిన్‌లో ఏపీ నాన్‌రెసిడెన్షియల్ తెలుగు సొసైటీకి చెందిన శివకుమార్ ద్వారా సౌదీలోని ఇండియన్ ఎంబసీతో మాట్లాడారు. దీప్తిని అక్కడి చెర నుంచి విడిపించి స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా.. మంగళవారం దీప్తి తన భర్తతో కలసి రామచంద్రపురంలో మంత్రి సుభాష్‌ను కలిశారు. తనను వెట్టిచాకిరీ, నిర్బంధం నుంచి కాపాడిన మంత్రులు సుభాష్, లోకేశ్‌కు దీప్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పథకం ప్రకారమే చంపేసింది!

- సహకరించిన ప్రియుడు, నలుగురు మైనర్లు
- అన్నదమ్ముల హత్య కేసులో చెల్లిసహా ఆరుగురి అరెస్టు

నకరికల్లు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తండ్రికి ప్రభుత్వం ద్వారా అందే ఆర్థిక ప్రయోజనాలన్నీ తనకే దక్కాలన్న దురుద్దేశంతో సోదరులను దారుణంగా చంపేసిన కృష్ణవేణి, ఆమె ప్రియుడు మల్లాల దానయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు మంగళవారం వెల్లడించారు. కృష్ణవేణి తండ్రి నకరికల్లు గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఈ ఏడాది జనవరిలో చనిపోయాడు. అతనికి ప్రభుత్వం నుంచి రూ.60-70 లక్షలు వచ్చే అవకాశం ఉంది. భర్తకు దూరంగా ఉంటున్న తనకు ఈ డబ్బుల్లో వాటా ఇవ్వాలని అన్నదమ్ములు గోపీకృష్ణ, దుర్గా రామకృష్ణను కృష్ణవేణి కోరింది. దీనికి వాళ్లు ఒప్పుకోలేదు. అంతేగాక కృష్ణవేణిని చంపేస్తానని దుర్గా రామకృష్ణ బెదిరించాడు. తనకు ముప్పు ఉందని భావించిన కృష్ణవేణి.. అతడిని చంపేస్తే ప్రభుత్వం ఇచ్చే డబ్బు తీసుకోవచ్చని ప్రియుడు దానయ్యకు చెప్పింది. అంతేగాకుండా చెరో రూ.10 వేలు చొప్పున ఇచ్చేలా ఇద్దరు బాలురను కూడా మాట్లాడుకుంది. ఆరోజు రాత్రి 10:30కు దుర్గా రామకృష్ణకు మద్యం తాగించి చున్నీతో గొంతు బిగించి చంపేసి, మేజరు కాలువలో పడేశారు. ఇది జరిగి 15 రోజులైనా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో తన అన్న, కానిస్టేబుల్ గోపీకృష్ణ అడ్డు కూడా తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం మరో ఇద్దరు బాలురను కిరాయికి మాట్లాడుకుంది. గోపీకృష్ణకు మద్యంలో నిద్రమాత్రలు కలిపి బాగా తాగించారు. ఆతర్వాత మెడకు చున్నీ, వైరు బిగించి చంపేసి శవాన్ని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో పడేశారు. విషయం బయటకు రావడంతో కృష్ణవేణి, ఆమె ప్రియుడు మల్లాల దానయ్య, నలుగురు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు.

చేనేత వస్త్రం ధరలు పెంపు

- సంక్షేమ శాఖల వస్త్ర కొనుగోళ్లకు వర్తింపు
- ఏటా 10% పెంపునకు ప్రభుత్వం అనుమతి
- 2024-25 సంవత్సరానికి వర్తింపు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖలు, సొసైటీలు చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రం ధరలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరేళ్ల క్రితం(2018లో) పెంచిన ధరలు ఇప్పుడు గిట్టుబాటు కావట్లేదని ఆప్కో ఎండీ ప్రభుత్వానికి విన్నవించడంతో పరిశీలించిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల దుస్తుల ధరలు పెంచింది. ఇప్పటి వరకూ ప్రభుత్వ సంక్షేమ శాఖలు ఒక విద్యార్థి చొక్కా (91 సెం.మీ వస్త్రం) ధర రూ.67.10, ప్యాంట్ (137సెం.మీ వస్త్రం) రూ.143.60 చొప్పున చెల్లిస్తున్నాయి. విద్యార్థినులకు లంగా(113 సెం.మీ) ధర రూ.78.70 ఇస్తున్నాయి. ఈ ధరలు గిట్టుబాటు కావడం లేదని ఆప్కో ఎండీ చేసిన ప్రతిపాదనతో చంద్రబాబు సర్కారు విద్యార్థి చొక్కా వస్త్రం ధర రూ.98.90; ప్యాంట్ వస్త్రం రూ.175.40; విద్యార్థినుల లంగా ధర రూ.116.30కు పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి ఈ ధరలు వర్తిస్తాయంటూ, ఇకపై ఏటా పది శాతం చొప్పున పెంచుకోవడానికి అనుమతిచ్చింది. చేనేత కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సంక్షేమ శాఖలు ఆప్కో ద్వారా వస్త్రం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

చేనేత సహకార సంఘాల పెదవి విరుపు

చేనేత వస్త్రాల ధరల పెంపుపై రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు పెదవి విరుస్తున్నాయి. వస్త్రం ధర పెంపు తమ కోసం కాదని, పొరుగు రాష్ట్రాల్లోని వస్త్ర వ్యాపారుల కోసమని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసి, కమీషన్ల కోసం ఇతర రాష్ట్రాల నుంచి బడి పిల్లల యూనిఫామ్ కొనుగోలు చేసిందని చెబుతున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలోని చేనేత కార్మికులకు నూలు, ముడిసరుకు సబ్సిడీ ధరలకు అందించి.. కార్మికులకు పని కల్పిస్తుందని ఆశిస్తే అదేమీ జరగడం లేదంటున్నారు. అధికారులకు, మంత్రికి గోడు వివరించినా పట్టించుకోవట్లేదని వాపోతున్నారు. కర్నూలు, కడప, రాజమండ్రి, శ్రీకాకుళం లాంటి జిల్లా షర్టింగ్ క్లాత్ అందుబాటులో ఉన్నా ఇప్పటికీ తెలంగాణలో కొనుగోలు చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో సహకార సంఘాల బకాయిలు పెట్టి పొరుగు వ్యాపారులకు రూ.7 కోట్ల ఆర్డర్ ఇచ్చి ముందుగానే 50 శాతం అడ్వాన్స్ చెల్లించడం వెనుక రహస్యమేంటో ప్రభుత్వ పెద్దలకే తెలియాలంటూ నిట్టూరుస్తున్నారు.

షార్‌కు చేరిన స్పాడెక్స్ ఉపగ్రహం

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివర్లో మరో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 30న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపే స్పాడెక్స్ ఉపగ్రహం మంగళవారం శ్రీహరికోటలోని షార్‌కు చేరుకుంది. బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రం నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో భారీ భద్రత నడుమ దీన్ని షార్‌కు తరలించారు. క్లీన్‌రూమ్‌లో తుది పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉపగ్రహాన్ని రాకెట్ శిఖర భాగాన అమర్చనున్నారు. రాకెట్ మూడు దశల అనుసంధాన పనులను ఇస్రో శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఈ నెల 30వ తేదీ రాత్రి 9:48 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.

24న వైకుంఠద్వార దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం(ఎస్ఈడీ) టోకెన్ల కోటాను డిసెంబరు 24వ తేదీన విడుదల చేయనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి మంగళవారం వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు.

మద్యం షాపులపై కొలికపూడి చిందులు

- తిరువూరులో 4 మద్యం షాపుల మూత
- బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం
- 24 గంటల్లో బెల్టు తొలగించాలని డిమాండ్
- లేకుంటే తానే రంగంలోకి దిగుతానని అల్టిమేటం
- చర్చనీయాంశంగా మారిన టీడీపీ ఎమ్మెల్యే తీరు


బెల్టు షాపులో మద్యం బాటిళ్లు చూపిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

విజయవాడ/తిరువూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మద్యం దుకాణాల నిర్వాహకులపై చిందులు తొక్కారు. బెల్టు దుకాణాలకు మద్యం విక్రయిస్తున్నారని, పాఠశాలలకు సమీపంలో ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ తిరువూరు పట్టణంలోని నాలుగు మద్యం షాపులను బలవంతంగా మూసివేయించారు. ఎమ్మెల్యే తీరుపై దుకాణాల యజమానులు భగ్గుమన్నారు. ప్రభుత్వానికి డబ్బులు కట్టి అధికారికంగా నిర్వహించుకుంటున్న తమ షాపులను ఎమ్మెల్యే వ్యక్తిగత కారణాలతో మూసివేయించడం ఏమిటని నిలదీశారు. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు సైతం విస్మయం వ్యక్తం చేశారు. దుకాణాల నిర్వహణలో లోపాలుంటే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసి, వారి ద్వారా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే ఇలా ప్రవర్తించడం ఏమిటని వారు కూడా ప్రశ్నించారు. తిరువూరు పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే కొలికపూడి పర్యటించారు. ఆ సమయంలో మద్యం షాపుల వద్దకు వెళ్లిన ఆయన అక్కడే కొందరు మద్యం తాగుతుండటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోనూ నియోజకవర్గంలోను సుమారు 150కి పైగా బెల్టు షాపులు నడుస్తున్నాయని ఆరోపిస్తూ అప్పటికప్పుడు కొన్ని బెల్టు షాపుల్ని గుర్తించి, ఆయా షాపుల్లో ఉన్న మద్యం బాటిళ్లను పోలీసులకు అప్పగించారు. అనంతరం, బెల్టుషాపులతో పాటు పట్టణంలో ఉన్న నాలుగు మద్యం షాపులకు దగ్గరుండి తాళాలు వేయించారు. పట్టణంలో జనావాసాలు, పాఠశాలల దగ్గరే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరువూరు పట్టణంలో బెల్టు షాపులు లేకుండా ఉండాలంటే ఉన్న నాలుగు మద్యం షాపుల లైసెన్సులు రద్దు చేయాలని, లేనిపక్షంలో 48 గంటల తర్వాత తానే ప్రత్యక్ష కార్యచరణకు దిగి, నియోజకవర్గంలో మద్యం షాపులు, మద్యం లేకుండా చేస్తానని ప్రకటించారు. నియోజకవర్గంలోని బెల్టుషాపుల్ని 24 గంటల్లో తొలగించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఉన్న లైసెన్సు మద్యం దుకాణాలను ఊరి బయటకు తరలించాలని హుకుం జారీ చేశారు.

వచ్చే ఎన్నికల్లోపు 20 లక్షల మందికి ఉద్యోగాలు

- 20న నూజివీడులో జాబ్‌మేళా: మంత్రి పార్థసారథి

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంగా వచ్చే ఎన్నికల్లోపు 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం మూలంగా పారిశ్రామిక రంగం కుదేలైపోయిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రోత్సాహక, పారదర్శక విధానాలతో గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, హెచ్‌పీ వంటి మెగా సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయన్నారు. పరిశ్రమల స్థాపన కోసం యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చి ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 20న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నూజివీడు ట్రిపుల్ ఐటీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐటీ, ఫార్మా, స్పిన్నింగ్ మిల్స్‌లో ఉద్యోగాల కల్పనకు ఈ మేళా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

కోస్తాకు వాన గండం

- తమిళనాడు తీరం దిశగా అల్పపీడనం: ఐఎండీ
- ఉత్తర, మధ్య కోస్తాల దిశగా వస్తుందన్న ఇస్రో నిపుణుడు
- నేటి నుంచి 21 వరకు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- వరి, పత్తి, పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్)

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రానున్న రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా పయనించి తమిళనాడు తీరం దిశగా రానున్నదని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. అయితే అల్పపీడనం ఉత్తర వాయవ్య దిశగా పయనించి బుధవారం నాటికి ఏపీలోని ఉత్తర, మధ్య కోస్తా జిల్లాల దిశగా రానుందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తర్వాత రెండు రోజుల్లో నెమ్మదిగా పయనించి ఏపీ కోస్తా తీరంలో బలహీనపడుతుందన్నారు. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. బుధవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, విజయనగరం, కృష్ణా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో కోస్తాలో అనేకచోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 19న విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ, శ్రీకాకుళం, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీవర్షాలు, 20న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం కోస్తా తీరం దిశగా పయనించే క్రమంలో సముద్రం నుంచి భారీగా తేమ రానున్నందున ఈనెల 21వ తేదీ వరకు ఉత్తర కోస్తా, మధ్య కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు, అక్కడక్కడా అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణుడు ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాలు బలంగా ఉండడంతో కోస్తా జిల్లాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల వరి, పత్తి, పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, కోతలు వాయిదా వేసుకోవాలని, పొలాల్లో ఉంచిన కుప్పలను సంరక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అల్పపీడనం నేపథ్యంలో ఈనెల 25వ తేదీ వరకూ దక్షిణ కోస్తా జిల్లాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఇదిలావుండగా మంగళవారం ఉత్తరకోస్తా, తెలంగాణకు ఆనుకుని ఉన్న కోస్తా జిల్లాల్లో చలితీవ్రత కొనసాగింది. బుధవారం చలి తీవ్రత స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రైతులూ.. ధాన్యం జాగ్రత్త: విపత్తుల శాఖ

అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో ఉత్తరాంధ్రలో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని సూచించింది.

అరకులోయలో 5.3 డిగ్రీలు

మన్యంలో చలి తీవ్రత కొనసాగుతోంది. మంగళవారం అరకులోయలో 5.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే జి.మాడుగులలో 6.5, జీకే వీధిలో 7.2, హుకుంపేట, చింతపల్లిల్లో 7.4, ముంచంగిపుట్టులో 9.7, పెదబయలులో 10.3, అనంతగిరిలో 10.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఉండడంతో ఏజెన్సీలో పొగమంచు కురవలేదు. అయినా, చలి తీవ్రత తగ్గలేదు.

తిరుపతి సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంపై సీబీ'ఐ'

- ఓ కంపెనీ నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇన్‌స్పెక్టర్
- కార్యాలయంలోనే ఆయనతో పాటు, కంపెనీ ప్రతినిధీ అరెస్టు
- అసిస్టెంట్ కమిషనర్, సూపరింటెండెంట్‌పైనా కేసు


తిరుపతిలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం

తిరుపతి/విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బాలాజీ రూ.3.20 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడ్డారు. తిరుపతిలోని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయ అధికారులు తమ విధుల్లో భాగంగా వివిధ ప్రైవేటు సంస్థల కార్యాలయాలను తనిఖీ చేస్తుంటారు. పన్ను ఎగవేతలను గుర్తించి చర్యలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ గత నెల 5న చిత్తూరు మండలం తాళంబేడులోని అబ్సల్యూట్ ఫైన్ అనే ప్రైవేటు సంస్థ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆ సంస్థకు సంబంధించిన పలు డాక్యుమెంట్లు తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అందులో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. తదుపరి చర్యలు చేపట్టకుండా ఉండేందుకు రూ.10 లక్షలు లంచం డిమాండు చేశారు. ఈ వ్యవహారంలో తిరుపతి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లోని అసిస్టెంట్ కమిషనర్ జగన్నాథ్ ప్రసాద్, సూపరింటెండెంట్ జగన్నాయక్‌ను కూడా బాలాజీ కలుపుకొన్నారు. అధికారులకు, కంపెనీ ప్రతినిధులకు నడుమ సంప్రదింపులు కొనసాగుతుండగా.. సమాచారం అందుకున్న సీబీఐ వారిపై నిఘా ఉంచింది. మంగళవారం తిరుపతి కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ బాలాజీకి చిత్తూరు సంస్థ ప్రతినిధి గణేశ్ రాం మహేందర్ చౌదరి రూ.3.20 లక్షలు లంచం అందజేస్తుండగా విశాఖపట్టణానికి చెందిన సీబీఐ అధికారుల బృందం హఠాత్తుగా దాడి చేసి పట్టుకుంది. నగదు స్వాధీనం చేసుకుని వారిద్దరినీ అరెస్టు చేసింది. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు చిత్తూరు కంపెనీ ప్రతినిధి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ, అసిస్టెంట్ కమిషనర్, సూపరింటెండెంట్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. మరోవైపు తిరుపతి కమిషనరేట్‌లోనూ, కడపలో ఇన్‌స్పెక్టర్ బాలాజీ నివాసంలోనూ సీబీఐ తనిఖీలు చేపట్టింది.



ఇండోర్‌లో స్వచ్ఛ కార్యక్రమాలను పరిశీలిస్తున్న పట్టాభి

ఇండోర్ స్ఫూర్తితో స్వచ్ఛ ఏపీ..!

- ఇండోర్ నగరంలో పర్యటించిన పట్టాభి, కృష్ణయ్య
- అక్కడ స్వచ్ఛ కార్యక్రమాల అమలు తీరు పరిశీలన

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాల జాబితాలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌ది అగ్రస్థానం. స్వచ్ఛత కార్యక్రమాల్లో ఇండోర్ ఏడేళ్లుగా మొదటి స్థానం ఎలా సాధిస్తుందో పరిశీలించి.. మన రాష్ట్రంలోనూ వాటిని అమలుచేసే దిశగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడుగులు వేస్తోంది. ఈ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు కొమ్మారెడ్డి పట్టాభిరాం.. రాష్ట్ర కాలుష్య నివారణ మండలి అధ్యక్షుడు కృష్ణయ్యతో కలిసి ఇండోర్‌లో పర్యటించారు. ఆ నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ, కమిషనర్ శివం వర్మ వారికి అక్కడ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఆ వివరాలను పట్టాభి మంగళవారం మీడియాకు వివరించారు. 'ఇండోర్‌లో రోజూ 1,100 టన్నుల చెత్త వస్తుంది. ఆ చెత్త నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా రోజూ 15-16 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. దీన్ని ఇండోర్‌లో తిరిగే సిటీ బస్సులకు ఇంధనంగా, వంట గ్యాస్‌గా వినియోగిస్తున్నారు. ఎక్కడైనా చెత్త పేరుకుపోయినా, కాల్వల్లో మురుగు శుభ్రం చేయకపోయినా, రోడ్లపై డ్రైనేజీ పొంగుతున్నా.. ప్రజలు ప్రత్యేక యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ కొన్నింటిని అమలు చేసి స్వచ్ఛ వాతావరణం పెంచడానికి చర్యలు తీసుకుంటాం. ఉత్తమ విధానాల పరిశీలనకు దేశంలోని మరో 19 నగరాలను కూడా సందర్శించనున్నాం' అని పట్టాభి వెల్లడించారు.

కరువు భత్యం కోసం న్యాయపోరాటం

- 17,36,543 చెల్లించాలంటూ హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంగా తనకు రావాల్సిన కరువు భత్యం కోసం ఓ మహిళా చిరుద్యోగి చేసిన సుదీర్ఘ పోరాటం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జోక్యంతో పరిష్కారమయింది. జల వనరుల శాఖలో టైపిస్టుగా అవుట్ సోర్సింగ్ విధానంలో కె.హరిప్రియ చేరారు. 2012లో ఆమె సర్వీసును రెగ్యులరైజ్ చేశారు. నాటి నుంచి మూల వేతనంపై 47.936% చొప్పున కరువు భత్యం చెల్లించాలంటూ హరిప్రియ ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటూ వచ్చారు. పదవీ విరమణ నాటికి ఆమొత్తం రూ.12,35,121లకు చేరుకుంది. దీనికోసం ఆమె హైకోర్టు తలుపు తట్టారు. వాదోపవాదనలు ముగిసిన తరువాత వడ్డీతో సహా రూ.17,36,541 చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో న్యాయస్థానం పేర్కొన్న మొత్తాన్ని హరిప్రియకు చెల్లించాలంటూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు.

రేపు ఎన్‌సీసీ కోటాలో బీఎస్సీ-ఏజీ కౌన్సెలింగ్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ పరిధిలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి అగ్రిసెట్-2024 ద్వారా ఎన్‌సీసీ కోటా కింద బీఎస్సీ-ఏజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రామచంద్రరావు మంగళవారం తెలిపారు.

పశుసంవర్ధక శాఖలో ఖాళీల భర్తీ: మంత్రి అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న 297 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. 'రాష్ట్రవ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల భవన నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. పశుకిసాన్ క్రెడిట్ కార్డుపై 3% వడ్డీ రాయితీతో రూ.2లక్షల వరకు హామీలేని రుణాలను పశుపోషకులు, కోళ్ల పెంపకందార్లకు ఇవ్వాలి. శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆగిపోయిన మత్స్యకార సంఘాల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి' అని అధికారులను ఆదేశించారు.

1 నుంచి రిజిస్ట్రేషన్ విలువల పెంపు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏయే ప్రాంతంలో ఎంత పెంచుతున్నారనేది మరో 3 రోజుల్లో తెలుస్తుంది. జిల్లాలవారీగా జాయింట్ కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, స్థానిక రిజిస్ట్రార్లతో కమిటీలు వేశారు. సాధారణంగా భూముల ధరలను 10 నుంచి 15 శాతం వరకు పెంచుతుంటారు. ఈ ప్రాతిపదికన చూస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా రూ.500 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

రిటైర్డు ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి: బొప్పరాజు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి, లక్షలాది మంది పెన్షనర్లను ఆదుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పెన్షనర్స్ డే సందర్భంగా పెన్షనర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు, అది ప్రభుత్వాల భిక్ష కాదని సుప్రీంకోర్టు గతంలోనే తెలిపిందన్నారు.

సంక్షేమ నిధి కోసం నమోదు చేసుకోండి

- 'ఉపాధి' సిబ్బందికి మద్దిలేటి సూచన

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బంది.. సంక్షేమ నిధి కోసం గ్రామీణాభివృద్ధి మానవ వనరుల నిర్వహణ సర్వీసు(ఆర్‌డీహెచ్ఆర్ఎంఎస్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఎస్ఆర్‌డీఎస్) సభ్యకార్యదర్శి మద్దిలేటి సూచించారు. సిబ్బంది కూడా ఎన్‌రోల్ చేసుకునేలా డ్వామా పీడీలు చర్యలు తీసుకోవాలని కోరారు.

62 వేల మందికి అందని పీఎం కిసాన్ సాయం!

- లోక్‌సభలో టీడీపీపీ నేత శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీలో 62 వేల మంది అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సాయం అందట్లేదని లోక్‌సభలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. రాష్ట్రంలో ఈ పథకానికి అర్హులైన 41.84 లక్షల మంది రైతులు ఉండగా, వారిలో 41.22 లక్షల మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారని చెప్పారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు.

ఏపీకి 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 2024-25కి గాను 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన మొదటి విడత గ్రాంట్లను ఇచ్చినట్లు కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ తెలిపారు. టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు మంగళవారం సమాధానం ఇచ్చారు. 2024-25కుగాను ఆంధ్రప్రదేశ్‌కు రూ.593.26 కోట్ల టైడ్ గ్రాంట్లు, రూ.395.51 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్లను అందించినట్లు వివరించారు.

నేడు ఐఎన్ఎస్ నిర్దేశక్ జలప్రవేశం

విశాఖపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వే నౌక ఐఎన్ఎస్ నిర్దేశక్ నేవీ సేవలకు సిద్ధమైంది. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో బుధవారం ఉదయం ఇది జలప్రవేశం చేయనుంది. హైడ్రోగ్రఫీ సర్వేలు, నేవిగేషన్ అవసరాల కోసం దీనిని నిర్మించారు. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. 110 మీటర్ల పొడవుతో 3,800 టన్నుల బరువును తీసుకుపోయే సామర్థ్యం కలిగిన ఈ నౌక రెండు డీజిల్ ఇంజన్ల సహకారంతో నడుస్తుంది.



సర్వే నౌక ఐఎన్ఎస్ నిర్దేశక్

తొలి పైప్డ్ గ్యాస్ రాజధానిగా అమరావతి

ఐవోసీ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి పైప్డ్ గ్యాస్ రాజధానిగా అమరావతి ఘనత సాధించనుంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ తరహాలో అమరావతిని పైప్డ్ గ్యాస్ రాజధానిగా తయారు చేస్తామంటూ ఇండియన్ ఆయిల్ కంపెనీ (ఐవోసీ) ముందుకొచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు(పీఎన్‌జీఆర్‌బీ) సభ్యులు ఎ.రమణకుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో గ్యాస్ పైపులైన్ల నిర్మాణం, ఇతర ప్రాజెక్టుల గురించి చర్చించారు. అమరావతిని దేశంలో మొదటి పైప్డ్ గ్యాస్ రాజధానిగా తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్నామని పీఎన్‌జీఆర్బీ ప్రతినిధులు తెలిపారు. దీనికి సీఎస్ సమ్మతిని తెలియజేస్తూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రతినిధుల బృందం ఆర్టీజీఎస్‌ను సందర్శించి అక్కడ ఏపీ గ్యాస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల ఆవాసాలకు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సహకారం అందించాలని దినేష్‌కుమార్ కోరారు.



ఆర్టీజీఎస్ కేంద్రంలో పెట్రోలియం, సహజవాయువు నియంత్రణ సంస్థ సభ్యులు

పర్యాటకంలో అద్భుతాలు

- పెట్టుబడిదారులకు అండగా ఉంటాం
- పర్యాటక రంగానికీ పరిశ్రమల రాయితీలు
- పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్
- నూతన పర్యాటక పాలసీ-2024 విడుదల

విజయవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన పర్యాటక పాలసీ అద్భుతాలు సృష్టించబోతోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించి రాయితీలు ఇవ్వడం ద్వారా రానున్న రోజులలో టూరిజం హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారబోతోందన్నారు. రాష్ట్రంలో 2029 నాటికి రూ. 25 వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ, 5 లక్షల ఉద్యోగాల కల్పన, రెట్టింపు వృద్ధి, పర్యాటకుల సంఖ్య పెంపుదల, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టుల మేళవింపుతో రూపొందించిన పాలసీ పర్యాటక రంగానికి నభూతో నభవిష్యతి అని వ్యాఖ్యానించారు. మంగళవారం విజయవాడలోని హోటల్ వివంతలో సీఐఐ, ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. నూతన పర్యాటక పాలసీ-2024ను ఆయన విడుదల చేశారు. పర్యాటక పాలసీకి సంబంధించి ముందుగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పాలసీ విడుదల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "పెట్టుబడిదారుల ఆలోచనలు, ప్రతిపాదనలకు అనుగుణంగా పాలసీని తీసుకువచ్చాం. ఏపీలో ఇక పెట్టుబడులు పెట్టడానికి ఎలాంటి భయాందోళనలు అవసరం లేదు. ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. నూతన పాలసీ ద్వారా రూ.25వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి సుదీర్ఘ సముద్ర తీరం, చారిత్రక వారసత్వ, ప్రకృతి సంపద, నదులు ఉన్నాయి. వీటి ఆధారంగా దేశ విదేశాలకు టూరిజం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆశయం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కుదేలైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోంది. పర్యాటకంలో మూడవ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని నెంబర్ 1 స్థానంలో నిలపాలన్నది మా ఆశయం. పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయటంతో పాటు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను కూడా నెలకొల్పుతాం. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలకు వచ్చిన వారు కనీసం ఐదు రోజులైనా అక్కడ ఉండే విధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. టూరిజం సర్క్యూట్లు ఏర్పాటు చేస్తున్నాం. దీనిలో భాగంగా ఆలయ, సాహస, పర్యావరణ, గ్రామీణ, ఆరోగ్య, వ్యవసాయ టూరిజం వంటి విధానాలు తీసుకు వస్తున్నాం. రాష్ట్రంలో 3 పర్యావరణ, 10 ఆలయ, 2 బుద్ధిస్ట్, 4 నదీ పర్యాటకం, 2 క్రూయిజ్ టూరిజం సర్క్యూట్లను ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో హోటళ్ల గదుల సంఖ్యను 50 వేలకు పెంచబోతున్నాం. కేంద్ర నుంచి అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు నిధులు వచ్చాయి" అని పేర్కొన్నారు. పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ పర్యాటక శాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్, సీఐఐ చైర్మన్ రామకృష్ణ, ఏపీ ఛాంబర్స్ అధ్యక్షులు పి భాస్కరరావు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



టూరిజం పాలసీని విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం సెక్రటరీ వినయ్‌చంద్, ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీరస్వామి తదితరులు

తెలంగాణలో.. ఎంబీబీఎస్ చేసినవాళ్లు లోకలే

- పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులే: టీ- హైకోర్టు
- ఈ కోవలో ఏపీ, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల విద్యార్థులు

హైదరాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన నిబంధనలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. 15% ఆలిండియా కోటాలో.. తెలంగాణలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ పూర్తిచేసిన రాష్ట్రేతర విద్యార్థులు కూడా పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులని పేర్కొంటూ.. ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మెడికల్ కాలేజీల(పీజీ అడ్మిషన్లు) నిబంధనలు-2021లోని రూల్ 8(2)కు రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 28న జీవో 148, జీవో 149 ద్వారా చేసిన సవరణల్లోని వివరణ-2ను హైకోర్టు కొట్టివేసింది. "ఆలిండియా కోటాలో తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్రేతర విద్యార్థులు పీజీ మెడికల్ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులు కాదు" అనేది ఈ రూల్ సారాంశం. దీంతో.. ఈ రూల్‌ను సవాల్ చేస్తూ సుమారు వందమంది రాష్ట్రేతర విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లలో సింహభాగం ఏపీ, రాజస్థాన్‌కు చెందినవారున్నారు. అఖిల భారత కోటాలో వీరంతా తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తెలంగాణ మెడికల్ పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు తాము కూడా అర్హులమేనని వాదిస్తున్నారు. ఈ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు విద్యాసాగర్, మయూర్‌రెడ్డి, ఎ.వెంకటేశ్, ఎస్.సత్యంరెడ్డి, సురేందర్‌రావు తదితరులు వాదనలు వినిపించారు. రూల్ 8(2)లోని వివరణ-2 రాష్ట్రపతి ఉత్తర్వులు-1974కు విరుద్ధంగా ఉన్నాయని.. దాన్ని కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ గతేడాది నవంబరు 9నే మొదలైన నేపథ్యంలో.. రూల్స్ సవరించడం చెల్లదన్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలే తప్ప స్థానికత ఆధారంగా వారిని దూరం పెట్టడం చెల్లదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ హెల్త్‌వర్సిటీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలను వినిపించారు. స్థానికత ఆధారంగా రిజర్వేషన్ కల్పించేందుకు నిబంధనలను సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. వాదోపవాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం, తెలంగాణ మెడికల్ కాలేజెస్ రూల్స్-2021 రూల్8(2)లోని వివరణ-2ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ పూర్తిచేసినవారంతా మెడికల్ పీజీ కోర్సుల్లో స్థానిక అభ్యర్థుల కోటాకు అర్హులేనని స్పష్టంచేసింది. వివరణ-2 కొట్టివేత 2024-25 విద్యాసంవత్సరానికి మాత్రమే వర్తిస్తుందని పేర్కొంటూ తుది ఉత్తర్వులను జారీచేసింది.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ఏపీకి ఆర్థిక సాయం అందించండి

కేంద్ర పథకాలకు నిధులివ్వండి.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో పయ్యావుల భేటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ అయ్యారు. రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన తర్వాత మొదటి సారి ఢిల్లీకి వచ్చిన పయ్యావుల మంగళవారం పార్లమెంటులో ఆమెను కలిశారు. ఏపీకి తగిన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో 93 కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయలేదని, వాటి అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, 73 పథకాలను పునరుద్ధరించిందని వివరించారు. రాష్ట్రవాటా ఇచ్చిన పథకాలకు నిధులివ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకిచ్చే నిధులు, పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మంత్రి వెంట టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. ఏపీ ఆర్థిక పరిస్థితులు, కేంద్రం నుంచి అందాల్సిన సహాయ సహకారాలపై చర్చించినట్లు మంత్రి తెలిపారు.

ప్రసాదరెడ్డి ఇష్టారాజ్యం!

(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా పార్టీ కార్యాలయంగా మార్చేశారు. పద్ధతి ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రొఫెసర్ల నియామకాన్ని ఆయనకు నచ్చినట్టు చేశారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారిని తీసుకొచ్చి గెస్ట్ ప్రొఫెసర్లుగా నియమించారు. మరికొందరికి 'చైర్ ప్రొఫెసర్' అంటూ పెద్దపీట వేశారు. ఇలా 50మందికి పైగా అస్మదీయులను తీసుకువచ్చి కీలక బాధ్యతలు అప్పగించారు. అంతా తన కనుసన్నల్లో జరిగేలా చేసుకున్నారు. ఇదే వర్సిటీలో పనిచేస్తున్నవారికి పదోన్నతులు ఇవ్వకుండా పక్కనపెట్టి, బయటనుంచి వచ్చిన వారి ఆదేశాల ప్రకారం పనిచేయాలని హుకుం జారీ చేశారు. వ్యతిరేకించిన వారిని వేధించారు. వారి సర్వీస్ రికార్డులను రిమార్కులతో నింపేశారు. వర్సిటీలో పీహెచ్‌డీలు చేసి ఉద్యోగ నియామకాల కోసం ఎదురు చూస్తున్నవారికి అవకాశాలు లేకుండా చేశారు. ఆయనతో పాటు బయట నుంచి వచ్చినవారు భారీగా జేబులు నింపుకొన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని ఆరోపణలు, విమర్శలు వచ్చినా కూటమి ప్రభుత్వం ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ చేపట్టకపోవడాన్ని విద్యావేత్తలు, మేధావులు తీవ్రంగా నిరసిస్తున్నారు.

లక్ష్మీపార్వతితో మొదలు

వైసీపీకి చెందిన లక్ష్మీపార్వతిని తెలుగు విభాగంలో గెస్ట్ ప్రొఫెసర్‌గా నియమించారు. గైడ్‌గా ప్రకటించి పది మంది పీహెచ్‌డీ విద్యార్థులను అప్పగించిన విషయం ప్రసాదరెడ్డి కుర్చీ దిగిన తర్వాత గానీ బయటకు రాలేదు. తన అడ్డగోలు నియామకాల విషయాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎప్పుడో ఇరవై ఏళ్ల క్రితం నేవీలో పని చేశానని చెప్పుకొంటున్న ఓ అధికారికి ప్రసాదరెడ్డి ఏయూ డిఫెన్స్ స్టడీ సెంటర్‌లో సలహాదారు సహా గెస్ట్ ప్రొఫెసర్ పోస్టు కట్టబెట్టారు. ఆయన చెప్పినవారందరికీ పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇచ్చారు. ఆయన తన భార్యకు కూడా హిందీ విభాగంలో పీహెచ్‌డీ సీటు ఇప్పించుకున్నారు. వివిధ డిఫెన్స్ సంస్థల పేర్లతో లేఖలుతెచ్చి, నచ్చిన కోర్సుల్లో ప్రవేశాలు కల్పించి సర్టిఫికెట్లు జారీ చేయించారు. విభాగాధిపతులతో సంబంధం లేకుండా ప్రసాదరెడ్డికే ఈ-మెయిల్స్ పెట్టి సదరు అధికారి తన పనులు చేయించుకునేవారు. పదో తరగతి పాసైనవారికి బీఏ ఆనర్స్ పేరుతో ఇంటర్మీడియెట్ సహ ఐదేళ్ల కోర్సు సర్టిఫికెట్లు భారీసంఖ్యలో జారీ చేశారు. ఆ మాజీ నేవీ అధికారి హయాంలో ప్రవేశపెట్టిన కోర్సులకు బోర్డు ఆఫ్ స్టడీస్ ఆమోదం కానీ, సెనెట్ గ్రీన్‌సిగ్నల్ కానీ లేవని గుర్తించి వాటిని నిలుపు చేశారు. ప్రసాదరెడ్డి దిగిపోయిన తర్వాత.. అక్టోబరు నుంచి ఆ మాజీ నేవీ అధికారి సేవలను నిలిపివేసి, ఆయన గదికి తాళం వేశారు.

పాస్టర్‌కు పగ్గాలు

ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ కమ్ పాస్టర్‌ను తీసుకువచ్చిన వీసీ ప్రసాదరెడ్డి.. ఆయనను చైర్ ప్రొఫెసర్‌ను చేశారు. ఆ తర్వాత ఏకంగా రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రసాదరెడ్డి దిగిపోయాక ఇంజనీరింగ్ విభాగంలో ఏఐ బోధించడానికి డ్యూటీ వేశారు. ఆ తర్వాత పదవి పోవడంతో సాధారణ ప్రొఫెసర్‌గా ఇంజనీరింగ్ పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. రోజూ అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయకుండా తన వద్దకే ఆ పుస్తకాన్ని తెప్పించుకొనేవారు. అంతా ఉదయం 9 గంటలకు వస్తే ఆయన 11 గంటలు దాటిన తర్వాత వచ్చేవారు. ఇవన్నీ 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. వర్సిటీ పరువును మంటగలిపిన ప్రసాదరెడ్డిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు, ఏయూ పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో

కేంద్ర సంస్థలో పనిచేసి రిటైరైన లక్ష్మీనారాయణ అనే వ్యక్తిని ఇంజనీరింగ్ కాలేజీ ఓఎస్‌డీగా నియమించారు. ఆయన కాలేజీ ప్రిన్సిపాల్‌ను, విభాగాధిపతిని ధిక్కరించి నిర్ణయాలు తీసుకునేవారు. ఎప్పుడూ ప్రసాదరెడ్డి చాంబర్‌లోనే ఉండేవారు. ఆయన్ను ఇటీవల తప్పించినా ఇంకా అక్కడే తిరుగాడుతున్నారు. ఇంటర్మీడియెట్ విద్యాసంస్థలు నడిపే ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేస్తున్న రాంజీ అనే వ్యక్తిని గెస్టు ప్రొఫెసర్‌గా నియమించారు. ప్రసాదరెడ్డి వెళ్లిపోయినా ఆయన ఇంకా కొనసాగుతుండడం గమనార్హం. ప్రైవేటు విద్యాసంస్థలో పనిచేస్తున్న చంద్రశేఖర్, శ్రీనివాస్, త్రినాథరావుకు కీలక పోస్టులు ఇచ్చి, ఒక్కొక్కరికీ రూ.80వేల నుంచి రూ.లక్ష జీతంగా చెల్లించారు. వీరంతా వర్సిటీ బోధనా సిబ్బందిపై అజమాయిషీ చేస్తుంటారని తెలిసింది.

ఆర్టీసీ సిబ్బందికి నైట్ అలవెన్సు

- విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బందికి ఆర్నెల్లుగా ఆగిన నైట్ అవుట్ అలవెన్సులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఏడాది జూలై నుంచి నిలిచిన ఈ అలవెన్సులు ఇకపై ప్రతినెలా జీతంతో పాటు చెల్లించాలని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కార్పొరేషన్‌గా ఉన్న ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు దూర ప్రాంతాలకు వెళ్లి అక్కడే విధుల్లో ఉంటే యాజమాన్యం నైట్ అలవెన్స్ చెల్లించేది. ఎన్ని నైట్ అవుట్లు చేస్తే.. సంబంధిత మొత్తాన్ని వారికి తర్వాతి నెల జీతంతో కలిపి ఇచ్చేవారు. 2020 జనవరిలో ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రజా రవాణా శాఖ(పీటీడీ) ఉద్యోగులుగా మార్చారు. తర్వాత ప్రభుత్వం నుంచి జీతాలు వస్తున్నాయి. అయితే ప్రతి నెలా జీతభత్యాలు ఎంత అనేది ఆర్టీసీ హౌస్ నుంచే లెక్కించి, ఆ వివరాలను ఆర్థిక శాఖకు పంపేవారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే విధంగా పీటీడీ సిబ్బందికి ఆర్థిక శాఖ నుంచే జీతాల చెల్లింపును మార్పు చేశారు. ట్రెజరీలో బిల్లుల చెల్లింపునకు కమీషన్ ఇచ్చేందుకు పీటీడీ సిబ్బంది అంగీకరించకపోవడంతో ఒక ప్రాంతానికి చెందిన ట్రెజరీ అధికారి.. నైట్ అవుట్ అలవెన్సు పద్దు లేదంటూ మెలిక పెట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు అలవెన్సులు ఆగిపోయాయి. దీనిపై ఎంప్లాయిస్, ఎన్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్, వైఎస్ఆర్ పీటీడీ అసోసియేషన్లు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్‌లకు వినతి పత్రాలు ఇచ్చాయి. దీంతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులకు టీఏ అలవెన్స్ అని ఇచ్చేదాన్నే.. ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అవుట్ అలవెన్స్ పేరుతో చెల్లిస్తున్నారని అధికారులు వివరించారు. ఈ విషయమై ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడాలని రవాణాశాఖ ముఖ్య కార్యదర్శిని మంత్రి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు సమస్య పరిష్కారం అవడంతో ఇకపై జీతాలతోపాటు నైట్‌అవుట్ అలవెన్సులు రూ.150 చొప్పున చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈయూ, ఎన్ఎంయూ, కార్మిక పరిషత్ యూనియన్ల నేతలు ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే అలవెన్స్ మొత్తాన్ని సగానికి తగ్గించడం అన్యాయమని డ్రైవర్లు, కండక్టర్లు వాపోతున్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులం అయినందున, వారితో సమానంగా రూ.300 చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయమై రవాణా మంత్రి కార్యాలయం వివరణ ఇస్తూ నైట్ అవుట్ అంటే కేవలం 12 గంటలు మాత్రమేనని అందుకే రూ.150 చెల్లిస్తున్నట్లు స్పష్టం చేసింది.



వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన అబ్దుల్ అజీజ్‌తో బోర్డు సభ్యులు

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్‌ను ప్రభుత్వం నియమించింది. మంగళవారం ఈ మేరకు మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం నియమించిన బోర్డు సభ్యుల తొలి సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు మాజీ మేయర్, టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్‌ను చైర్మన్‌గా సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత ప్రభుత్వం నామినేట్ చేసిన సభ్యుల నియామకాల తీరుపై కొంతమంది కోర్టులను ఆశ్రయించడంతో వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి వక్ఫ్ బోర్డులో పరిపాలన శూన్యత ఏర్పడింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు దృష్టి సారించింది. గత ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద జీవో-47ను రద్దు చేస్తూ నూతనంగా జీవో 75ను విడుదల చేసింది. అలాగే, గతంలోని ఎలక్టెడ్ సభ్యులను కొనసాగిస్తూ, నిబంధనలకు అనుగుణంగా నామినేటెడ్ సభ్యులను కొత్తగా నియమించింది. బోర్డు సభ్యుల తొలి సమావేశంలో అబ్దుల్ అజీజ్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

వక్ఫ్‌బోర్డు ఏర్పాటు ప్రక్రియ పూర్తి: మంత్రి ఫరూక్

మైనార్టీల సంక్షేమానికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. కొన్ని నెలలుగా వక్ఫ్‌బోర్డులో ఏర్పడిన శూన్యతపై దృష్టి సారించి, నిబంధనలకు అనుగుణంగా వక్ఫ్ బోర్డు ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూములను పరిరక్షించుకోవడంపై కొత్త బోర్డుకు సీఎం చంద్రబాబు స్పష్టమైన బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి తెలిపారు.

పెన్షన్ అనర్హులకు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అనర్హులుగా గుర్తించిన పింఛనుదారులకు తొలుత నోటీసులివ్వాలని, తగు అర్హతలు నిరూపించలేకపోతేనే పెన్షన్లను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులకు సకాలంలో సమాధానాలు ఇవ్వలేకపోతే పెన్షన్లను హోల్డ్‌లో ఉంచాలని పేర్కొన్నారు. ఇటీవల అనర్హుల పెన్షన్లకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ సర్వే నిర్వహించింది. జిల్లాకొక సచివాలయ పరిధిలో సర్వే నిర్వహించగా 563 మంది(5 శాతం) అనర్హులు పెన్షన్ పొందుతున్నారని తేలింది. ఆయా అనర్హుల పెన్షన్లు వెంటనే ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల లాగిన్ నుంచి తొలగించి పెన్షన్లు నిలిపేయాలని ఇప్పటికే ఆదేశించారు. ఇదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 3.5 లక్షల మంది దాకా అనర్హులున్నట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని అన్ని సచివాలయాల పరిధిలో సర్వే చేసి అనర్హుల పెన్షన్లను తొలగించాలని వీరపాండ్యన్ సూచించారు. తప్పుడు సదరం సర్టిఫికెట్లు, డాక్టర్ల నుంచి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టి కిడ్నీ, ఇతర అనారోగ్య సమస్యల పేరుతో పెన్షన్లను పొందుతున్నారని.. అలాంటి వారి సర్టిఫికెట్లను కూడా పరిశీలించాలని పేర్కొన్నారు. ఇదిలావుంటే, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఈ విషయంపై సీరియస్‌గా స్పందించిన విషయం తెలిసిందే. అనర్హులు దొడ్డిదారిలో పెన్షన్ పొందుతున్నందున అసలైన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అనర్హులు పెన్షన్లు పొందుతుండడంతో కొత్తగా మరికొందరు కూడా ఇదే దారిలో పింఛన్ల కోసం నేతలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో అర్హులకు మాత్రమే పింఛన్లను అందించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

నేడు టీడీపీలోకి ఆళ్ల నాని!



ఏలూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని బుధవారం సైకిల్ ఎక్కబోతున్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆది నుంచీ ఆయన వైఎస్ కుటుంబానికి సన్నిహితుడు. ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి 2004, 09 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున, 2019లో వైసీపీ తరఫున గెలుపొందిన ఆళ్ల నాని.. జగన్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. మొన్నటి ఎన్నికల్లో 62 వేలకు పైగా ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి బడేటి చంటి చేతిలో ఓడిపోయారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాకు వైసీపీ అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేసిన ఆయన.. రెండు నెలల క్రితమే ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇక క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. తర్వాత మనసు మార్చుకుని టీడీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై టీడీపీ శ్రేణులన్నీ తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అయితే టీడీపీ అధిష్ఠానం ఆదేశాలతో ఎమ్మెల్యే బడేటి చంటి వారిని కొంతవరకు ఒప్పించగలిగారు. దీంతో నాని చేరికకు తెలుగుదేశం నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

బియ్యం రవాణాకు అనుమతులు ఉన్నాయా?

» పూర్తి వివరాలు మా ముందు ఉంచండి.. హైకోర్టు ఆదేశం

కాకినాడ పోర్టులోని తమ పారా బాయిల్డ్ రైస్‌ను ఎంవీ స్టెల్లా నౌకలోకి ఎగుమతి చేసేందుకు అనుమతించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లలో వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బియ్యం రవాణా చేసేందుకు పిటిషనర్లకు అనుమతులు ఉన్నాయా? బియ్యాన్ని లోడ్ చేయకుండా ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వానికి ఉన్న అధికారాలు ఏమిటి? తదితర వివరాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు ఇచ్చారు. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా, ఉపముఖ్యమంత్రి మౌఖిక ఆదేశాలను అనుసరించి కాకినాడ పోర్టులోని తమ పారా బాయిల్డ్ బియ్యాన్ని ఎగుమతి చేయనీయకుండా కాకినాడ కలెక్టర్, పోర్టు అధికారి అడ్డుకుంటున్నారంటూ చిత్ర అగ్రి ఎక్స్‌పోర్ట్స్ ఎండీ కేవీ భాస్కరరెడ్డి, పద్మశ్రీ రైస్‌మిల్ ఎండీ పోతంశెట్టి గంగిరెడ్డి, సూర్యశ్రీ రైస్‌మిల్ ఎండీ పోతంశెట్టి విశ్వనాథ్‌రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం విచారణకు వచ్చాయి.

హైదరాబాద్ వెళ్లిన చంద్రబాబు, లోకేశ్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. అక్కడ జరిగే ఓ కుటుంబపరమైన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన వారు ఇరువురూ బుధవారం సాయంత్రానికి తిరిగి ఉండవల్లి చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

సొమ్ము చెల్లిస్తే దొంగ దొర అవుతాడా?

» పేర్నిపై కొల్లు రవీంద్ర విసుర్లు

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసిన దొంగ ఆ సొమ్ము చెల్లిస్తే దొర అయిపోతాడా? అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. మంగళవారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'బందరులో పేర్ని నానికి చెందిన గోదాముల్లో ప్రభుత్వం రేషన్ బియ్యం నిల్వ చేసింది. అందులో బియ్యం మాయం అయ్యాయి. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేర్ని వాటిని బొక్కారు. రేషన్ బియ్యాన్ని గోదాముల నుంచి అక్రమంగా తరలించి పోర్టు ద్వారా విదేశాలకు అమ్ముకొన్నారు. ఇప్పుడు దొంగతనం బయటపడిన తర్వాత డబ్బు కడతాం అంటున్నారు. డబ్బు కడితే దొంగ దొర అవుతారా? చేసిన దొంగతనం మాఫీ అవుతుందా? ఈ విషయం బయటపడగానే పేర్ని నాని కుటుంబం మొత్తం బందరు నుంచి పారిపోయింది. నిన్న తిరిగి వచ్చి హడావుడి చేస్తున్నారు. చేసిన దొంగతనం ఎటూపోదు. అధికారులు దర్యాప్తు చేస్తున్నారు' అని రవీంద్ర అన్నారు.

అనుమానిత ఫోన్లపై నిఘాకు అనుమతి పొడిగింపు

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అనుమానిత ఫోన్లపై నిఘా పెట్టే అధికారాన్ని మరో ఏడాదిపాటు పొడిగించింది. ఇంటెలిజెన్స్ ఏడీజీ, ఎస్ఐబీ చీఫ్, సీఐ సెల్ అధిపతులు... ఇలాంటి అసాంఘిక శక్తుల ఫోన్లపై నిఘా పెట్టేందుకు వీలుగా పోలీసుశాఖకు అనుమతి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏపీకి రూ.7,315 కోట్ల ఉపాధి నిధులు

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు ఉపాధి హామీ పథకం కింద రూ.7,315.74 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి కమలేష్ పాశ్వాన్ తెలిపారు. గత వర్షాకాలంలో 138 గ్రామీణ రోడ్లు(మొత్తం 493.87 కి.మీ) తీవ్రంగా దెబ్బతిన్నాయని టీడీపీ ఎంపీల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

బోయలను ఎస్టీలలో చేర్చాలి: ఎంపీ లక్ష్మీనారాయణ

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా, విద్యపరంగా వెనకబడిన బోయ/వాల్మీకి కులస్థులను షెడ్యూలు తెగ జాబితాలోకి చేర్చాలని టీడీపీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం, లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ బోయ కులస్థులు 1956కు ముందు షెడ్యూలు తెగల్లోనే ఉన్నారని, బోయ కులస్థుల సమస్యపై 2017లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు.

అవినాష్, జోగిలకు మధ్యంతర రక్షణ పొడిగింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆఫీసు, చంద్రబాబు నివాసంపై దాడి కేసులో వైసీపీ నేతలు దేవినేని అవినాష్, జోగి రమేశ్ సహా మరికొందరికి మధ్యంతర రక్షణను మరికొంత కాలం పొడిగిస్తూ జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చింది. నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు సిబల్, సిద్ధార్థ్ దవే, న్యాయవాది అల్లంకి రమేశ్ వాదనలు వినిపించారు. ఉద్దేశ పూర్వకంగా పెట్టిన కేసును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం తెలిపారు. వాదనలు వినిపించేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. దీంతో ధర్మాసనం విచారణను ఫిబ్రవరి 11కు వాయిదా వేసింది. అప్పటివరకు పిటిషనర్లకు మధ్యంతర రక్షణ పొడిగించింది.

కడుపులో కొకైన్ క్యాప్సూల్స్!

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో కెన్యా మహిళ అరెస్టు

చెన్నై, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.14 కోట్ల విలువైన కొకైన్ మాదకద్రవ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇథియోపియా రాజధాని అడిస్ అబాబా నుంచి ఆదివారం చెన్నైకి చేరుకున్న విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా, కెన్యాకు చెందిన 35 ఏళ్ల మహిళ అనుమానాస్పదంగా నడవడాన్ని గుర్తించారు. ఆమెను ప్రత్యేక గదికి తీసుకువెళ్లి స్కానింగ్ యంత్రంతో పరీక్షించగా, ఆమె కడుపులో క్యాప్సూల్స్ ఉన్నట్లు గుర్తించారు. ఆమెను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా...వైద్యులు ఆమెకు ఎనిమా ఇచ్చి కడుపులో ఉన్న 90 క్యాప్సూల్స్‌ను బయటికి తీశారు. ఆ క్యాప్సూల్స్‌లో కొకైన్ మాదకద్రవ్యాన్ని గుర్తించిన అధికారులు తూకం వేయగా, 1.25 కేజీలు ఉన్నట్లు తేలింది. ఆ మాదక ద్రవ్యం విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.14.2 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. పోలీసులు ఆమెను అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారు.



లంక మేత.. గుండ్లకమ్మ ఈత!

ఈ ఫొటోలో ఉన్న దృశ్యాన్ని చూసే.. ఈ సామెత పుట్టిందేమో! బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధేనువకొండలో నెలకొన్న పరిస్థితి ఇది. గుండ్లకమ్మ రిజర్వాయరు మధ్యలో ఖాళీగా ఉండే భూముల్లో గడ్డి మేపేందుకు పశుపోషకులు నిత్యం గేదెలను తోలుకెళుతుంటారు. గేదెలు నీటిలో ఈదుకుంటూ వెళితే.. ఆ వెనుకే పశుపోషకులు తెప్పలు వేసుకొని వెళుతుంటారు. ఇందుకోసం రిజర్వాయరులో రోజుకు ఐదు కిలోమీటర్లకు పైగా ప్రాణాలకు తెగించి, పశువులతో కలసి ప్రయాణం సాగిస్తున్నారు. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

ఆ బియ్యం విలువ 2.23 కోట్లు

పేర్ని నాని గోదాముల్లో మాయమైన బియ్యంపై మంత్రి స్పష్టత

» రెండో గోదాములో తనిఖీల తర్వాత విలువ పెరిగే అవకాశం

» ఇకపై బియ్యం స్మగ్లింగ్ చేస్తే పీడీ యాక్ట్: మంత్రి మనోహర్

» మచిలీపట్నం మార్కెట్ యార్డుకు 4,093 బస్తాలు తరలింపు





పేర్ని నాని గోదాములు ఖాళీ చేస్తున్న అధికారులు, గోదాముల వద్ద కూలీలు, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు, పోలీసులు

తెనాలి/విజయవాడ/మచిలీపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానికి సంబంధించిన గోదాముల్లో మాయమైన బియ్యం విలువ రూ.1.7 కోట్లు కాదని, రూ.2.23 కోట్లకు పైగా ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేర్ని కుటుంబం గోదాముల తనిఖీకి సహకరించకపోవడం వల్లే ఒకేసారి కచ్చిత అంచనాకు రాలేకపోయామని, మరికొన్ని రోజుల్లో ఎంతమేర బియ్యం మాయం చేశారనేది తెలుస్తామని స్పష్టం చేశారు. నాని గోదాముల్లో దాడులు రాజకీయ కక్షలో భాగమేనని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఏ దురుద్దేశం లేకపోతే పేదల బియ్యం నిల్వ కోసం తన సొంత గోదాములను ఆయన ఎందుకు అద్దెకిచ్చారని నిలదీశారు. ఏ తప్పూ చేయకపోతే నోటీసిచ్చిన రోజే రూ.కోటి డీడీ ఎందుకు కట్టారని ప్రశ్నించారు. మచిలీపట్నంలోని వేబ్రిడ్జిలో సాంకేతిక సమస్యతో పొరపాటు వచ్చిందని, సుమారు 3వేల బస్తాల బియ్యం తక్కువగా ఉన్నాయని, దానికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామంటూ కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ పేరుతో నాని భార్య జయసుధ లేఖ రాశారని వివరించారు. స్టాక్ రిజిస్టర్ల ఆధారంగా 185 టన్నుల బియ్యం తగ్గిందని అంచనాకు వచ్చి సివిల్ సప్లైస్ ఎండీ వెంటనే డబుల్ అమౌంట్ కింద రూ.1,70,56,000 జరిమానా వసూలు చెయ్యాలని, ఆ గోదాముల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలని నిర్ణయించారని తెలిపారు. గోదాముల్లో నిల్వలు లెక్కించేందుకు ఒక కమిటీ వేసి, ఈ నెల 16న తనిఖీకి వస్తున్నామని, 13న నోటీసిస్తే, అదే తేదీన వారి న్యాయవాది ద్వారా రూ.కోటి విలువైన డీడీలు ఇచ్చారని తెలిపారు. 16న తనిఖీకి వెళితే గోదాము తాళాలు కూడా తీయలేదని మంత్రి ఆరోపించారు. రికార్డులు సీజ్‌చేసి, అక్కడ ఉన్న 4,093 బస్తాల బియ్యాన్ని తరలించామని చెప్పారు. అయితే వారు చెప్పినట్టు 3వేల బస్తాల బియ్యం కాదని, 4,840 (243 టన్నులు) బస్తాలు మాయమైనట్టు తేలిందని చెప్పారు. దీనిపై రూ.2,23,56,000 జరిమానా వసూలు చేస్తామని తెలిపారు. రెండో గోదామును కూడా తనిఖీ చేయాలని భావిస్తున్నామని అన్నారు. డీడీలిచ్చేస్తే సరిపోదని, వారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించాలని చూస్తే పీడీ చట్టం కింద చర్యలు ఉంటాయని, ఈ మేరకు చట్ట సవరణ చేస్తామని మనోహర్ స్పష్టం చేశారు. కాగా, పేర్ని నానికి చెందిన గోదాములను అధికారులు మంగళవారం ఖాళీ చేశారు. గోదాముల నుంచి 4,093 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని మచిలీపట్నం మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్టు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పద్మాదేవి తెలిపారు. ప్రతి బ్యాగు 50.300 కిలోలు చొప్పున ఉండాలని, అయితే కొన్ని 47 కిలోలు, ఇంకొన్ని 48 కిలోలు మాత్రమే ఉన్నాయని చెప్పారు.

లుక్‌అవుట్ నోటీస్ సమాచారం లీక్

పేర్ని నానికి చెందిన గోదాములు ఆయన భార్య పేర్ని జయసుధ పేరున ఉన్నాయి. వాటి నుంచి బియ్యం మాయమైన కేసులో జయసుధతోపాటు, గోడౌన్ మేనేజర్ మానస్ తేజపై మచిలీపట్నం తాలూకా పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితులను అరెస్ట్ చేయడానికి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ట్రాక్ చేయడం ప్రారంభించారు. ఈ సమాచారాన్ని కొందరు పోలీసు అధికారులు పేర్ని నానికి చేరవేశారు. దీంతో అప్రమత్తమైన ఆయన తన సతీమణిని సురక్షిత ప్రదేశానికి పంపేసినట్లు సమాచారం.

స్వాహా చేసింది 243 టన్నులు..!

పేర్ని నాని గోదాముల నుంచి సుమారు 250 టన్నుల పీడీఎస్ బియ్యం మాయమైందని 'ఆంధ్రజ్యోతి' ముందుగా వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ అధికారులు 187 టన్నులని, 180 టన్నులని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. మంత్రి మనోహర్ కూడా పేర్ని గోదాముల నుంచి పక్కదారి పట్టిన బియ్యం 243 టన్నులని, వాటి విలువ రూ.2.23 కోట్లు ఉంటుందని చెప్పారు.

'స్టెల్లా'లో 1,320 టన్నుల రేషన్ బియ్యం

» కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడి

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజ్ పోర్టులో నిలిచిపోయిన స్టెల్లా ఎల్ పనామా నౌకలో 1,320టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 5 శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ టీమ్ నౌకలోని మొత్తం 4వేల టన్నుల బియ్యాన్ని 12గంటల పాటు తనిఖీ చేసి నమూనాలు సేకరించిందని తెలిపారు. నౌక 3వ కంపార్టుమెంట్‌లో ముందు గుర్తించిన 640 టన్నులతో పాటు మరో 680టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందన్నారు. నౌకలో గుర్తించిన 1,320 టన్నుల బియ్యం అన్‌లోడింగ్ చేయించి సీజ్ చేస్తామని చెప్పారు. ఆ తర్వాత సక్రమంగా ఎగుమతి చేస్తున్న 12వేల టన్నుల బియ్యాన్ని లోడింగ్‌కు అనుమతిస్తామన్నారు.

రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ సదస్సులు

» రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు లేకుండా రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తామని, సమస్యల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపడతామని రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. 'రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతోంది. గతంలో 6,688 గ్రామాల్లో రీసర్వే జరిగింది. అక్కడ జరిగిన తప్పులను సరిచేసేందుకు వీలుగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం. తాజాగా మరో 9వేల గ్రామాల్లో రీ సర్వేకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో సుమారు 2.8 లక్షల వినతులు వచ్చాయి. వాటిలో అధికశాతం రిజిస్ట్రేషన్, రెవెన్యూ అంశాలకు సంబంధించినవే. రీ సర్వేకు సంబంధించి ప్రతి అంశాన్నీ ప్రజల ముందు ఉంచుతాం" అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా మాట్లాడుతూ.. రెవెన్యూపరమైన అంశాలు, భూములు వివాదాలకు సంబంధించి కోర్టు కేసుల్లో అధికారులు త్వరితగతిన స్పందించాలన్నారు. గత ప్రభుత్వ పెద్దల ఆక్రమణలపై విచారణ చేయాలని కోరారు. మ్యుటేషన్ ప్రక్రియపై పునరాలోచన చేయాలని కోరారు. సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావుతో పాటు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేలో వైసీపీ అక్రమాలు: మంత్రి అనగాని

భూముల రీ సర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం అనేక చోట్ల అక్రమాలకు పాల్పడిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. రెవెన్యూ సదస్సు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ చేసిన తప్పులు తాము చేయబోమని, ప్రజాభిప్రాయం మేరకు రీ సర్వే నిర్వహిస్తామన్నారు. 200 ఎకరాలకు ఒక టీమ్‌ను ఏర్పాటుచేసి రీ సర్వే చేయనున్నట్టు వివరించారు. ప్రతి పట్టాదారుడికి మూడుసార్లు అవకాశం కల్పిస్తామన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఎకరాల మేర ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగినట్టు తెలుస్తోందన్నారు. ఇందులో పాత్రధారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20న కృష్ణా జిల్లాలో నిర్వహించే జోనల్ రెవెన్యూ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొంటారన్నారు. జనవరి 6 నుంచి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



మీ మనోభావాలు దెబ్బతీశాను.. మన్నించండి

» మళ్లీ జరక్కుండా జాగ్రత్తగా ఉంటాను

» టీడీపీ కార్యకర్తలకు మళ్లీ క్షమాపణ చెప్పిన మంత్రి పార్థసారథి

» చంద్రబాబు, లోకేశ్‌తో భేటీ.. 'జోగి' ఘటనపై వివరణ

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై దాడికి వెళ్లిన కేసులో ప్రధాన నిందితుడైన మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్‌తో కలిసి వేదిక పంచుకున్నందుకు గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి టీడీపీ శ్రేణులను మరోసారి క్షమాపణ కోరారు. మంగళవారం ఉదయం ఆయన మంత్రి లోకేశ్‌ను కలిసి ఈ ఘటనపై వివరణ ఇచ్చారు. తర్వాత టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీలో చంద్రబాబు, లోకేశ్ నాకు చాలా పెద్ద గౌరవం ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు కూడా నన్నెంతో ఆదరించారు. వారి మనోభావాలు దెబ్బ తీసినందుకు మరోసారి క్షమాపణలు చెబుతున్నాను' అని ఆయన అన్నారు. నూజివీడులో కార్యక్రమం ఖరారు మొదలుకొని అతిథులను ఆహ్వానించడం వరకూ మొత్తం పూర్తిగా స్థానికంగా ఉన్న గౌడ సంఘం నేతలే చూసుకున్నారని, అందులో టీడీపీ నేతలెవరికీ ఏ పాత్రా లేదని స్పష్టం చేశారు. 'స్థానిక ఎమ్మెల్యేగా.. వాళ్లు నాకు ఆహ్వాన పత్రిక పంపినప్పుడు పని ఒత్తిడిలో ఉండి పూర్తిగా చదవలేదు. ఎవరెవరు వస్తున్నారో గమనించలేదు. కార్యక్రమానికి వెళ్లిన తర్వాత అక్కడ జోగి రమేశ్‌ను చూసి షాక్‌కు గురయ్యాను. ఆహ్వానితుల విషయంలో గౌడ సంఘం నేతలకు నేను ముందుగానే మార్గదర్శకత్వం చేసి ఉండాల్సింది. అలా చేయకపోవడం నా పొరపాటు. విగ్రహావిష్కరణకు వచ్చిన వారిలో అత్యధికులు టీడీపీకి చెందినవారే. జోగి విషయంలో నేను ఏదైనా మాట్లాడితే వారంతా ఇబ్బంది పడతారేమోనని మౌనంగా ఉండిపోయాను. చంద్రబాబు, లోకేశ్ నన్ను నమ్మి నాకు గౌరవప్రదమైన హోదా ఇచ్చారు. నేను వారికి గానీ, పార్టీకి గానీ అప్రతిష్ఠ తెచ్చే పనులు ఎప్పుడూ చేయను. టీడీపీని మరింత బలోపేతం చేయాలన్నదే నా ప్రయత్నం. నూజివీడు కార్యక్రమాన్ని నేనే మొత్తం నిర్వహించాననే ప్రచారం నమ్మవద్దు. వైసీపీ సోషల్ మీడియా విభాగం ఇటువంటి ప్రచారం చేస్తోంది. భవిష్యత్‌లో ఇటువంటివి జరక్కుండా జాగ్రత్త తీసుకుంటాను' అని తెలిపారు. అనంతరం సీఎం చంద్రబాబును కూడా పార్థసారథి కలిశారు. జోగి రమేశ్ వ్యవహారంపై వివరణ ఇచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, వెనుక ఫ్లెక్సీపై చంద్రబాబు ఇంటిపై జోగి రమేశ్ దాడి దృశ్యాలు

జోగితో మంత్రి ర్యాలీ బాధాకరం!

» క్యాడర్‌కు పార్థసారథి, కొనకళ్ల, శిరీష సమాధానం చెప్పాలి: బుద్దా

విజయవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులో వైసీపీ నేత జోగి రమేశ్‌తో కలిసి టీడీపీ నాయకులు, మంత్రి ర్యాలీలో పాల్గొనడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ఇంటిపైకి దాడికి వెళ్లటం, నీచంగా మాట్లాడటంతో పాటు చంద్రబాబుకు బాధ కలిగించిన వ్యక్తి జోగి రమేశ్ అన్నారు. నాటి దృశ్యాలను ఫ్లెక్సీపై ముద్రించిన బుద్దా వెంకన్న వాటిని విలేకరులకు చూపించారు. జోగితో టీడీపీ నేతలు వేదికను పంచుకున్న ఘటన చంద్రబాబు గుండెలపై తన్నినట్టు తనకు అనిపిస్తోందన్నారు. ఇలా జరగకుండా ఉండాల్సిందని చెప్పారు. జోగి రమేశ్‌ను చూసిన తర్వాతైనా వేదిక నుంచి, ర్యాలీ నుంచి దూరంగా వచ్చేసి ఉంటే బాగుండేదన్నారు. పార్థసారథి, కొనకళ్ల నారాయణ, శిరీష ముగ్గురూ సౌమ్యులేనని, క్షమాపణ చెబితే సరిపోదని, క్యాడర్‌కు సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూడండి

» అధికారులను ఆదేశించిన మంత్రి లోకేశ్



ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న లోకేశ్

అమరావతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం తనను కలుస్తున్న బాధితులు మళ్లీ మళ్లీ తిరగకుండా వారికి శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. తనను కలుస్తున్న వారిలో భూ బాధితులే అధికంగా ఉంటున్నందున రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో లోకేశ్ 52వ రోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. చీరాల ఓడరేవు నుంచి నకరికల్లు వరకు 167ఏ 4 లైన్ల జాతీయ రహదారిలో అంతర్భాగమైన నరసరావుపేట బైపాస్ రోడ్డుకు ఇచ్చిన ఆప్షన్-3 వల్ల ఐదు గ్రామాల రైతులు నష్టపోవాల్సి వస్తోందని, నష్టం తక్కువగా ఉండే ఆప్షన్-2 అమలు చేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు ఆధ్వర్యంలో రైతులు కోరారు. కొవిడ్ సమయంలో బిడ్డ వైద్యానికి రూ.3 లక్షలకు కుదువపెట్టిన 120 గ్రాముల బంగారాన్ని తిరిగి ఇవ్వకుండా తన మేనమామ వేధిస్తున్నాడని జగ్గయ్యపేట నియోజకవర్గం తోటచర్లకు చెందిన జీ పద్మావతి ఫిర్యాదు చేశారు. పుట్టుకతో తీవ్ర అనారోగ్యంతో జన్మించిన తమ బిడ్డ వైద్యానికి నెలకు రూ.10 వేలు ఖర్చవుతోందని, వైద్యానికి ఆర్థిక సాయం చేయాలని బద్వేలుకు చెందిన ఎల్ కొండమ్మ వేడుకుంది. ఏడాది క్రితం యాక్సిడెంట్‌తో కోమాలోకి పోయిన తమ బిడ్డకు రూ.18 లక్షలు ఖర్చు పెట్టినా వీల్ చైర్‌కే పరిమితమయిందని, తాను పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నానని... ఆర్థిక సాయం చేయాలని కడప జిల్లా పల్లవోలుకు చెందిన ఎం శ్రీనివాసులు కోరారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని కోట్లు దండుకున్న వైసీపీ నేతలు

» టీడీపీ గ్రీవెన్స్‌లో గొల్లుమన్న బాధితులు



టీడీపీ ప్రధాన కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని వైసీపీ నేతలు రూ.కోట్లు దండుకున్నారని పలువురు నాయీ బ్రాహ్మణులు టీడీపీ నేతలకు ఫిర్యాదు చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షరీఫ్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అర్జీలు స్వీకరించారు. గత ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్‌గా ఉన్న యానాదయ్య, మరికొందరు తమకు ఉద్యోగాలిప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా రూ.10 కోట్లు కాజేశారని కోనసీమ జిల్లా అప్పనపల్లి దేవస్థానంలో కేశఖండనశాలలో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులు ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన బద్వేల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ తమ భూమిని ఆక్రమించుకుని, అక్రమ నిర్మాణాలు చేపట్టాడని, తనకు కోర్టు స్టే ఇచ్చినా అక్రమ నిర్మాణాలు ఆపడం లేదని బద్వేల్‌కు చెందిన ఎం సుధాకర్ ఫిర్యాదు చేశారు. తన పొలంలోకి తనను వెళ్లనీయకుండా సీఐ చిన్నకోటయ్య, కానిస్టేబుల్ మునీంద్ర అడ్డుకుని, అక్రమ కేసు పెట్టారని కర్నూలు జిల్లా వరిముక్కలకు చెందిన హరికృష్ణ వాపోయారు. విజయవాడలోని గంగానమ్మ ఆలయ కార్యదర్శి గురుమూర్తి దేవుని సొమ్ము రూ.10 లక్షలు కాజేశారని, చర్యలు తీసుకోవాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.



భార్య, కొడుకుతో కలిసి కేక్ కట్ చేస్తున్న రామారావు

భార్య కిడ్నీ ఇస్తే.. కొడుకు కాలేయమిచ్చాడు!

» అవయవాల దానంతో ఇంటిపెద్దను బతికించుకున్న కుటుంబం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంటిపెద్దకు అనారోగ్య సమస్య వస్తే ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది! రెండు కీలక అవయవాలు చెడిపోయాయని వైద్యులు చెప్పడంతో ఆయన్ను ఎలాగైనా బతికించుకోవాలని భావించింది. భార్య, కుమారుడు అవయవాలను దానం చేయడంతో ఆ ఇంటిపెద్ద సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకున్నారు. ఏపీలోని ఒంగోలుకు చెందిన ఓ కుటుంబసభ్యులు ఇలా గొప్ప ఆదర్శాన్ని చాటుకున్నారు. శస్త్రచికిత్స వివరాలను మంగళవారం నానక్‌రాంగూడలోని స్టార్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వెల్లడించారు. ఒంగోలుకి చెందిన వ్యాపారవేత్త 54 ఏళ్ల రామారావు కాలేయం, కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. ఆయనకు అధిక రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్-బి ఇన్ఫెక్షన్ వంటి సమస్యలున్నాయి. కాలేయం పూర్తిగా చెడిపోయింది. అప్పటికే కిడ్నీలు ఫెయిల్ అవ్వడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను స్టార్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ఆయనకు వెంటనే కాలేయం, మూత్రపిండాలను మార్పిడి చేయాలని సూచించారు. అవయవాల దాతల కోసం ప్రయత్నం చేసినప్పటికీ లభించడం కష్టమైంది. దీంతో ఆయన భార్య నాగవల్లి (45), కొడుకు కౌశిక్ (25) తమ అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. నాగవల్లి నుంచి కిడ్నీని, కౌశిక్ కాలేయం నుంచి కొంత భాగం సేకరించి రోగికి అమర్చారు.

సంప్రదాయ వస్త్రాలతో విద్యార్థులు, అధ్యాపకులు

మంగళగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకున్న విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులందరూ సంప్రదాయ వస్త్రాలు ధరించి వచ్చి విశేషంగా ఆకట్టుకున్నారు. మగవారంతా పంచె, ధోవతులు.. మహిళలందరూ చీరెలను ధరించారు. అవి కూడా మంగళగిరి చేనేత వస్త్రాలే కావడం మరో విశేషం! కలంకారీ ముద్రణతో కూడిన ఈ సంప్రదాయ వస్త్రాలను ధరించి.. తెలుగుదనం ఉట్టిపడేలా వేడుకకు హాజరుకావడం విశేషం.




రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జాదవ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, సత్యకుమార్, దుర్గేశ్, సంధ్యారాణిలతో సంప్రదాయ వస్త్రాలు ధరించిన ఎయిమ్స్ విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకుల గ్రూపు ఫొటో

రోగుల చెంతకే వైద్య సేవలు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. మెడికల్ సైన్స్ ఇప్పుడు మెడ్‌టెక్ సైన్స్ అయిందని, డీప్‌టెక్ వంటి సాంకేతిక పరిజ్ఞానంపై వైద్య విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు. రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఆస్పత్రులకు వెళ్లకుండా.. ఇళ్ల వద్దే వారికి వైద్య చికిత్స అందించేలా వైద్య రంగాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలని సూచించారు. మంగళగిరిలోని ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవానికి హాజరుకావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. మహిళలందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్ఫూర్తి అని, ఒడిశాలో చిన్న గ్రామలో పుట్టి ఆదర్శవంతంగా ఎదిగారని కొనియాడారు. మారుమూల గ్రామంలో గిరిజన కుటుంబం నుంచి ఆమె రాష్ట్రపతికి స్థాయి ఎదగడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఉపాధ్యాయురాలిగా ప్రస్థానాన్ని ప్రారంభించి.. జూనియర్ అసిస్టెంట్‌గా, ప్రొఫెసర్‌గా, కౌన్సిలర్‌గా, చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, గవర్నర్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించారని.. ఇప్పుడు దేశానికి ప్రథమ పౌరురాలు అయ్యారని.. పట్టుదలతో కష్టపడితే ఎవరైనా అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చని నిరూపించారని తెలిపారు. తాను కూడా చిన్న గ్రామం నుంచే వచ్చానన్నారు. దేశంలో ఏ ఎయిమ్స్‌కూ లేనట్లుగా మంగళగిరి ఎయిమ్స్‌కు మంచి వాతావరణంలో దాదాపు 183 ఎకరాలు ఇచ్చామని చెప్పారు. భవిష్యత్ అవసరాల కోసం మరింత భూమి కావాలని ఎయిమ్స్ డైరెక్టర్ తనను కోరారని.. కొలనుకొండ వద్ద 10 ఎకరాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు తెలిపారు. ఎయిమ్స్‌ను చూసిన తర్వాత తానిక్కడ చదువుకోలేదేనని అసూయగా ఉందన్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అప్పటి కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశాం. ఇప్పుడు మళ్లీ ఆయన ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడే తొలి స్నాతకోత్సవం జరుపుకొంటున్నాం. 960 పడకల సామర్థ్యం ఉన్న ఎయిమ్స్‌ను రూ.1,618 కోట్లతో నిర్మించారు. తొమ్మిదేళ్లలో మంచి గుర్తింపు తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. దానికి మౌలిక సదుపాయాలు సమకూర్చాం. భవిష్యత్‌లో మరింతగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధం' అని అన్నారు. ఎయిమ్స్‌లో రూ.10కే వైద్య సేవలు అందించడాన్ని అభినందించారు. ఇప్పుడు 8వ స్థానంలో ఉన్న మంగళగిరి ఎయిమ్స్ మొదటిస్థానానికి రావాలని ఆకాంక్షించారు. కేంద్రం విభజన హామీల్లో భాగంగా 12 కేంద్ర సంస్థలను ఏపీలో ఏర్పాటు చేసిందన్నారు. ఇందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిని వచ్చే మూడేళ్లలో రూ.50 వేల కోట్లు ఖర్చు చేసి అద్భుతంగా నిర్మిస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర మంత్రి ప్రతాపరావు జాదవ్ మాట్లాడుతూ.. దేశ ప్రజలందరి ఆరోగ్య రక్షణే మోదీ లక్ష్యమని చెప్పారు. 2018 నుంచి ఎయిమ్స్ పురోగతిని డైరెక్టర్ మాధవానంద కర్ వివరించారు. సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో సహకరించిందని, మరో పది ఎకరాలు కేటాయిస్తే ట్రామాకేర్ యూనిట్, మెడికల్ టెక్నాలజీ విభాగాలు ఏర్పాటు చేస్తామని సీఎంను కోరారు.



చెరువులోని రాళ్లపై తాబేళ్లు సందడి చేశాయి. విజయనగరం నడిబొడ్డున ఉన్న అయ్యకోనేరులో ఉన్న తాబేళ్లు ఇలా రాళ్లపైకి ఎక్కాయి.

వైద్య వృత్తి.. మానవ సేవకు గొప్ప మార్గం!

- మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి బ్యాచ్‌తోనే గుర్తింపు: రాష్ట్రపతి
- సేవ, అభ్యాసం, పరిశోధనపై విద్యార్థులు దృష్టి పెట్టాలి
- మెడికల్ టూరిజం అభివృద్ధిలో డాక్టర్లదే ప్రధాన పాత్ర
- వైద్య శాస్త్రాలకు కొత్త సవాళ్లు
- వాటి పరిష్కారంలో భాగంగానే ఎయిమ్స్‌లో సైటోజెనిటిక్స్ లేబొరేటరీ
- ద్రౌపది ముర్ము వెల్లడి
- వైద్య విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం



గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని ఎంచుకోవడం ద్వారా మానవాళిని సేవించే గొప్ప మార్గాన్ని ఎంచుకున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎయిమ్స్ వైద్య విద్యార్థులను ప్రశంసించారు. మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవాన్ని బుధవారం అక్కడి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. అనంతరం ప్రసంగిస్తూ.. ఏదైనా ఉన్నత విద్యా సంస్థ ప్రారంభమైన తర్వాత.. అందులోని మొదటి బ్యాచ్ సదరు సంస్థకు గుర్తింపు తీసుకొస్తారని అన్నారు. వైద్య రంగంలో, సమాజంలో, దేశ, విదేశాల్లో మంగళగిరి ఎయిమ్స్ మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులే ఆ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్లని ఆమె కొనియాడారు. విజయం, గౌరవం సాధించడానికి.. సేవ, అభ్యాసం, పరిశోధన అనే మూడు విషయాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. కీర్తి, అదృష్టంలో కీర్తికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, దానినే ఎంచుకోవాలని చెప్పారు. భారతీయ వైద్యులు తమ ప్రతిభ, కృషితో ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో అగ్రగామిగా నిలిచారని గుర్తుచేశారు. మన దేశంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడానికి ఇతర దేశాల ప్రజలు భారతదేశాన్ని సందర్శిస్తున్నారని తెలిపారు. ఇండియా ప్రపంచంలో మెడికల్ టూరిజానికి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, ఇందులో వైద్యులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మన సంప్రదాయంలో దీర్ఘాయువు, ఆయురారోగ్యాలతో ఉండాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రార్థిస్తామని అన్నారు. 'సకల స్వాస్థ్య సర్వదా' అనేది మంగళగిరి ఎయిమ్స్ నినాదమని గుర్తుచేశారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని నిరంతరం ప్రోత్సహించడం, అందరికీ ఆరోగ్యం అందించడాన్ని ఎయిమ్స్‌లో ప్రతి వైద్యుడూ మార్గదర్శక సూత్రంగా తీసుకోవాలని సూచించారు. వైద్య శాస్త్రాలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనడానికి కొత్త పరిష్కారాలు అవసరమని.. ఆ ప్రయత్నంలో భాగంగానే ఎయిమ్స్‌లో సైటోజెనిటిక్స్ లేబొరేటరీ ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిని ఉపయోగించుకుని ఈ సంస్థ కొత్త పరిశోధనలు, చికిత్సలను అభివృద్ధి చేస్తుందన్న విశ్వాసాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర ఆయుష్, ఆరోగ్య సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్, రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్, విద్యామంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే లోకేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ముఖ్యమంత్రి సత్కారం

తొలి స్నాతకోత్సవానికి హాజరైన రాష్ట్రపతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున చంద్రబాబు సత్కరించారు. శాలువా కప్పి సన్మానించి శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందించారు. అనంతరం డైరెక్టర్ డాక్టర్ మాధవానంద కర్ ఎయిమ్స్ తరఫున రాష్ట్రపతిని, సీఎంను, కేంద్ర మంత్రి జాదవ్‌ను సత్కరించారు. ఆ తర్వాత స్నాతకోత్సవంలో భాగంగా జాదవ్, సత్యకుమార్ 49 మందికి ఎంబీబీఎస్ డిగ్రీలు, నలుగురికి పోస్టుగ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు.



రాష్ట్రపతికి చేనేత చీర బహూకరించిన లోకేశ్

మంగళగిరి చేనేత కార్మికులు చేసిన చేనేత చీరెను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి లోకేశ్ బహూకరించారు. అవకాశం వచ్చిన ప్రతిసారి లోకేశ్ మంగళగిరి చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తుంటారు. గతంలో ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులకు కూడా ఆయన మంగళగిరి చేనేత వస్త్రాలను అందించి సత్కరించారు. అలాగే ఆయన తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి కూడా తరచూ మంగళగిరి చేనేత వస్త్రాలను ధరిస్తూ అనధికార బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తుంటారు.

నలుగురికి బంగారు పతకాలు

ఎయిమ్స్ స్నాతకోత్సవంలో నలుగురు బంగారు పతకాలను అందుకున్నారు. భారత రాష్ట్రపతి చేతులమీదుగా ఈ పతకాలను స్వీకరించడం పట్ల వారు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఓవరాల్ అకడమిక్ టాపర్‌గా కేరళకు చెందిన లియా అజీ, బెస్ట్ మేల్ టాపర్‌గా ఏపీకి చెందిన దాసరి దివ్యాంశ్, బెస్ట్ ఫిమేల్ టాపర్‌గా పంజాబ్‌కు చెందిన సుప్రభ సింహా, బెస్ట్ ఇంటర్న్‌షిప్‌గా కేరళకు చెందిన వీకే అథీరా బంగారు పతకాలు అందుకున్నారు.

మా వాటా తేల్చాకే!

- గోదావరి-కావేరి అనుసంధానంపై తేల్చిచెప్పనున్న ఆంధ్రప్రదేశ్
- ఇచ్ఛంపల్లి నుంచి తరలింపునకు అంగీకరించం
- బొల్లాపల్లి-బనకచర్ల మీదుగానే తీసుకెళ్లాలి
- రేపటి భేటీలో స్పష్టం చేయనున్న ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నదుల అనుసంధాన ప్రక్రియకు సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నామని.. కానీ గోదావరి జలాల్లో తమ వాటా సంగతి తేల్చాకే గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై కేంద్రం ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేయనుంది. అలాగే తెలంగాణలోని ఇచ్ఛంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాలను తరలించేందుకు అంగీకరించబోమని తేల్చిచెప్పనుంది. పోలవరం ప్రాజెక్టు కుడికాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయరుకు నీటిని తరలించి.. బనకచర్ల వరకు తీసుకెళ్లి.. అక్కడి నుంచి కావేరికి తరలించాలన్న తన ప్రతిపాదనను ఆమోదించాలని కోరనుంది. ఈ అనుసంధాన పథకంపై కేంద్ర జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన గురువారం రాష్ట్రాలతో కేంద్రం సమావేశమవుతోంది. ఈ భేటీకి రాష్ట్రప్రభుత్వ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు వర్చువల్‌గా హాజరు కానున్నారు. నదుల అనుసంధాన ప్రక్రియ చేపట్టేముందు.. మూడు ప్రధానాంశాలపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం ఈ సందర్భంగా కోరనుంది. 'గోదావరి నదీ జలాల వివాద ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు.. గోదావరి జలాలపై ఆంధ్రప్రదేశ్ వాటా ఎంతో ఇప్పటికీ స్పష్టం కాలేదు. దీనిపై కేంద్ర జలశక్తి శాఖ తక్షణమే స్పష్టత ఇవ్వాలి. పైపై లెక్కలు వేసి.. బేసిన్ వారిగా గోదావరి జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని జలాలు నికరంగా వస్తాయో చెప్పకుండా.. నదుల అనుసంధానమంటే అంగీకరించేందుకు సిద్ధంగా లేం. కచ్చితంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు గోదావరి జలాల్లో వాటాలెంతో తేల్చాల్సిందే. ఛత్తీస్‌గఢ్ వినియోగించని 147 టీఎంసీలను ఎవరికీ చెందని గోదావరి జలాలుగా పరిగణిస్తామని కేంద్రం చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఆ 147 టీఎంసీలూ దిగువ రాష్ట్రమైన మాకే దక్కుతాయి. గోదావరి జలాలను ఇచ్ఛంపల్లి నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తామంటే సమ్మతించం. ఇప్పటికే పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి వైకుంఠపురం ఎత్తిపోతల ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువకు గోదావరి జలాలను ఎత్తిపోసి వాటిని బొల్లాపల్లి రిజర్వాయరు మీదుగా బనకచర్ల రెగ్యులేటర్ ద్వారా పెన్నా నదితో అనుసంధానం చేసేందుకు మేం ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ పథకాన్ని అమలు చేస్తామంటేనే బేషరతుగా నదుల అనుసంధానానికి అంగీకరిస్తాం' అని భేటీలో తేల్చిచెప్పాలని ఆంధ్రప్రదేశ్ నిర్ణయించింది.

ఏకసభ్య కమిషన్ నియామకంపై విచారణ వాయిదా

ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్‌ను నియావిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు 2వారాలకు వాయిదా వేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఇంప్లీడ్ పిటిషన్లు వేశామని, తమ వాదనలు కూడా వినాలని ఎంఆర్‌పీఎస్ వేసిన అనుబంధ పిటిషన్లను కోర్టు అనుమతించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆమె జీవితం.. ఆమె ఇష్టం..!



- ఆ యువతి మేజర్.. ఎక్కడికైనా వెళ్లి జీవించొచ్చు
- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- తండ్రి జోక్యాన్ని నిలువరించాలని ఆదేశం

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మేజర్ అయిన యువతికి తన అభీష్టానికి అనుగుణంగా ఎక్కడికైనా వెళ్లి జీవించే స్వేచ్ఛ ఉంటుందని హైకోర్టు ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొనే హక్కు ఆమెకు ఉంటుందని తెలిపింది. తన మహిళా భాగస్వామి (లెస్బియన్)ని ఆమె తండ్రి అక్రమంగా నిర్బంధించారని, ఆమెను కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఓ యువతి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపింది. నిర్బంధ ఆరోపణలు ఎదుర్కొంటున్న యువతితో తమ చాంబర్‌లో న్యాయమూర్తులు నేరుగా మాట్లాడారు. అనంతరం మేజర్ అయిన యువతికి తన అభీష్టానికి అనుగుణంగా ఎక్కడికైనా వెళ్లి జీవించే స్వేచ్ఛ ఉంటుందని స్పష్టం చేస్తూ, యువతి విషయంలో తండ్రి జోక్యం చేసుకోకుండా నిలువరించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడకు చెందిన ఇద్దరు యువతులు ఏడాదిగా సహజీవనం చేస్తున్నారు. ఓ యువతి, తాను లివిన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, కానీ.. తన భాగస్వామిని ఆమె తండ్రి అక్రమంగా నిర్బంధించారని, ఆమెను కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మరో యువతి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... మేజర్ అయిన యువతిని తండ్రి నిర్బంధించడం చట్టవిరుద్ధమన్నారు. లెస్బియన్స్ బంధాన్ని చట్టబద్ధమైనదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం నిర్బంధానికి గురైన యువతిని కోర్టు ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా పోలీసులు ఆమెను మంగళవారం ధర్మాసనం ముందు హాజరుపర్చారు. ఆమెతో తమ చాంబర్‌లో విడిగా మాట్లాడిన న్యాయమూర్తులు యువతి మేజర్ అయినందున ఆమె ఇష్టానుసారంగా ఎక్కడికైనా వెళ్లి జీవించే హక్కు ఆమెకుంటుందని స్పష్టం చేశారు.

పోలీసు వాహనాన్ని అడ్డుకుని బుక్కయ్యారు!

- నిందితుడిని తప్పించబోయి దొరికిపోయారు
- 13 మంది దొంగ నోట్ల ముఠా అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తప్పించడానికి ప్రయత్నిస్తే అసలు డొంక కదిలింది.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కేంద్రంగా సాగుతున్న పెద్ద దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టయింది. రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, ప్రకాశ్‌నగర్ సీఐ బాజిలాల్ మీడియాకు ఈ కేసు వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా సిగడాం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ముద్దాయిగా ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని ఈ నెల 12న రాత్రి పోలీసులు భీమవరంలో అరెస్టు చేశారు. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న కృష్ణమూర్తి కోసం రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెల్ టవర్ లోకేషన్ తనిఖీ చేయడానికి వచ్చారు. శ్రీకాకుళం పోలీసులు ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తిరిగి ప్రభాకర్‌ను తీసుకెళ్తుండగా కొంత మంది ఆగంతకులు వచ్చి పోలీసు వాహనాన్ని అడ్డుకుని వారిపై తిరగబడ్డారు. పోలీసుల అదుపులో ఉన్న రాపాక ప్రభాకర్‌ను ఎత్తుకుపోయారు. మొత్తం 18మంది పోలీసులపై తిరగబడి, నిందితుడిని ఎత్తుకుపోయినట్లు ప్రకాశ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నిందితుల కోసం ఆరు బృందాలతో విస్తృత గాలింపు చేపట్టారు. దాడి చేసినవారందరూ దొంగనోట్ల ముఠాకు చెందిన వారని గుర్తించి అరెస్టు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
18 డిసెంబరు 2024

ఫ్యాషన్



శాల్ సోకు

ఉన్ని, నూలు, పట్టు.. ఇలా వేర్వేరు దారాలతో తయారయ్యే భిన్నమైన శాలువాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. మృదువైన మెటీరియల్‌తో అత్యంత సౌకర్యవంతంగా ఉండే శాలువాలు అటు ఆధునిక వస్త్రధారణకూ, ఇటు సంప్రదాయ కట్టుబొట్టుకూ నప్పేలా తయారవుతున్నాయి.

ఫ్యాషన్‌కు అడ్డొస్తాయనే కారణంతో చలి కాలంలో శాలువాలు కప్పుకోడానికి వెనకాడే వాళ్లూ ఉంటారు. కానీ వెచ్చదనాన్ని అందిస్తూనే ఫ్యాషన్‌గా కనిపించేలా చేసే శాలువాలు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటినొకసారి చూద్దామా?

కలంకారి: కలం అంటే పెన్ను, కారి అంటే పనితనం. ఎంబ్రాయిడరీతో మోటిఫ్స్, పూలు, లతల డిజైన్లను సృష్టించడం ద్వారా కలంకారి కళాకారులు అందమైన శాలువాలను రూపొందిస్తూ ఉంటారు. రాజ దర్బారు, మొఘల్ దర్బారు, బారాత్ బార్డర్లతో తయారయ్యే కలంకారి శాలువాలు సర్వత్రా ప్రజాదరణ పొందుతున్నాయి.

సోజ్ని: ఇదొక తరహా నీడిల్ ఎంబ్రాయిడరీ. దీంతో సాదాసీదా వస్త్రం కాస్తా, అద్భుతమైన శాలువా రూపాన్ని సంతరించుకుంటుంది. 15వ శతాబ్దంలో పర్షియన్లు ఈ కళను కాశ్మీరు లోయలో ప్రవేశపెట్టడంతో సోజ్ని పనితనం ప్రఖ్యాతి పొందింది. పర్షియా భాషలో సోజ్ని అంటే 'సూది'. అందంగా, మృదువుగా ఉండే సోజ్ని శాలువాలు తేలికగా కూడా ఉండడంతో వీటి వాడకం విస్తృతంగా విస్తరించింది.

పష్మీనా

ఫ్యాషన్‌గా కనిపించడంతో పాటు సంప్రదాయాలనూ, వారసత్వాన్నీ కలిగి ఉండే పష్మీనా శాలువాలు ఎంతో ప్రత్యేకమైనవి. లడాక్, కాశ్మీరులకు చెందిన చంగ్‌తాంగి పష్మీనా గొర్రెల ఉన్నితో తయారయ్యే స్వచ్ఛమైన పష్మీనా శాలువాలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఎంచుకున్న డిజైన్, ఉపయోగించిన ఉన్ని ఆధారంగా కళాకారులు ఈ శాలువాల ధరలను నిర్ణయిస్తూ ఉంటారు. ఈ శాలువాల తయారీలో కళాకారులు సౌకర్యానికీ, మన్నికకు పెద్ద పీట వేస్తూ ఉంటారు.



'సుమో రెజ్లింగ్' అనగానే గుర్తుకొచ్చేది భారీకాయులైన పురుషులే... పురుషుల ఆధిపత్యం కొనసాగే ఈ క్రీడలో ధైర్యంగా అడుగుపెట్టడమే కాదు... భారతదేశంలో తొలి మహిళా సుమో రెజ్లర్‌గా, ప్రపంచంలో టాప్-5లో ఒకరుగా తనదైన చరిత్ర సృష్టించారు **హేతల్ దావే**.
ఆమె కథతో రూపొందిన 'సుమో దీదీ' చిత్రం పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై మన్ననలు అందుకుంది.
"ఈ రంగంలో మన దేశం నుంచి ఎక్కువమంది మహిళా ఛాంపియన్లను తయారుచేయడమే తన ధ్యేయం" అంటున్న 36 ఏళ్ల హేతల్ విభిన్నమైన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

సుమో దీదీ!



"నలుగురూ వెళ్ళే దారిలో వెళ్లడం సౌకర్యంగా ఉంటుంది. అయితే అది అన్ని వేళలా సంతృప్తికరంగా ఉండదు. అందుకే ఎప్పుడూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలని అనుకుంటాను. ఈ స్వభావం నాకు మొదటినుంచీ ఉంది. అదే నన్ను ఈ స్థాయిలో నిలిపింది. దీనికి తొలి ప్రేరణ నా కుటుంబం నుంచే లభించింది. నా స్వస్థలం ముంబాయి. మా నాన్న సుధీర్ ధావేకి క్రీడలంటే ఎంతో ఇష్టం. అందుకే మా అన్నయ్య అక్షయ్‌ను మార్షల్ ఆర్ట్స్‌లో ప్రోత్సహించారు. అన్నయ్య సాధన చేస్తున్నప్పుడు తనతోపాటు నేనూ వెళ్ళేదాన్ని. అలా నాకు తెలియకుండానే వాటి మీద ఇష్టం పెరిగిపోయింది. బ్రూస్లీ, జాకీచాన్ సినిమాలు కూడా నన్ను ప్రభావితం చేశాయి. అన్నయ్యతోపాటు నేనూ జూడో నేర్చుకుంటానని ఇంట్లో చెప్పాను. మా కుటుంబంలో చాలాకాలం తరువాత పుట్టిన ఆడపిల్లనని నన్ను అందరూ అపురూపంగా చూసుకొనేవారు. అందుకే వాళ్ళు వద్దంటారని అనుకున్నాను. కానీ అమ్మానాన్నతో పాటు మా తాతయ్య, బామ్మ.. ఇలా అందరూ ప్రోత్సహించారు. అప్పుడు నా వయసు అయిదేళ్ళే. జూడోలో ప్రావీణ్యం వచ్చిన తరువాత.. కుస్తీ నేర్చుకున్నాను. సుమో రెజ్లర్ కావాలనే నా కలకు అప్పుడే బీజం పడింది. కానీ అది అంత సులభంగా నెరవేరలేదు.

ఆశ వదిలేసుకున్నా...

నాకు శిక్షణ ఇచ్చేవారి కోసం నాన్న ఎంతోమంది కోచ్‌లను కలిశారు. కానీ "అమ్మాయిలకి సుమో రెజ్లింగ్ ఏమిటి? మీకు మతిపోయిందా?" అంటూ అందరూ తిరస్కరించారు. చివరకు మా నాన్న, అన్నయ్య నాకు కోచ్‌లుగా మారారు. మన దేశంలో ప్రాక్టీస్ చెయ్యడానికి సుమో రింగ్‌లు లేవు. దాంతో మామూలు మైదానంలోనే సాధన చేశాను. మరోవైపు వీడియోలు చూస్తూ మెళకువలు నేర్చుకున్నాను. నా చదువు, క్రీడల్లో అభ్యాసం సమాంతరంగా సాగాయి. బి.కామ్. పూర్తి చేశాను. సుమో రెజ్లింగ్‌లో నాకు నైపుణ్యం వచ్చిందనుకున్న తరువాత... పోటీలకు వెళ్ళాలనుకున్నాను. కానీ మన దేశంలో నేనే మొదటి మహిళా సుమో రెజ్లర్‌ని. కాబట్టి పోటీల్లో పాల్గొనాలంటే విదేశాల్లోనే సాధ్యం. అదే పెద్ద సమస్యగా మారింది. నన్ను స్పాన్సర్ చెయ్యడానికి ఎవరూ లేరు. ఎవరినైనా అడిగినా... కనీసమైన సాయం చెయ్యకపోగా... ఎగతాళిగా, నిరుత్సాహపరిచేలా మాట్లాడేవారు. సామాజికంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాను. శారీరకంగా చాలా గాయాలు భరించాను. శిక్షణలో ప్రతిరోజూ ఒక సవాలుగానే గడిచింది. వాటన్నిటికన్నా... నా ప్రతిభను ప్రదర్శించే అవకాశం లేకపోయిందనే ఆలోచన నన్ను తీవ్రంగా బాధపెట్టింది. ఒక దశలో దాదాపు ఆశ వదిలేసుకున్నాను. ఆ సమయంలో నాన్న, అన్నయ్య ఎంతో కష్టం మీద డబ్బు సమకూర్చారు. 2008లో ఈస్టోనియాలో జరిగిన 'నేషనల్ సుమో ఛాంపియన్‌షిప్' పోటీలో, ఆ తరువాత పోలండ్, ఫిన్‌లాండ్... ఇలా పలు దేశాల్లో జరిగిన ఈవెంట్స్‌లో నా సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం వచ్చింది. 2015లో 'ఏషియన్ సుమో ఛాంపియన్ షిప్'లో కాంస్యం, 2016లో మనదేశంలోనే జరిగిన 'నేషనల్ సుమో ఛాంపియన్ షిప్'లో స్వర్ణ పతకం సాధించాను. చైనాలో నిర్వహించిన 'ఆసియా ఛాంపియన్ షిప్స్', చైనీస్ తైపీలో జరిగిన 'వరల్డ్ గేమ్స్'.. ఇలా ఎన్నో ఈవెంట్స్‌లో మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాను. విదేశాల్లోని మహిళా సుమో రెజ్లర్లకు గట్టి పోటీ ఇచ్చే భారతీయురాలిగా పేరు వచ్చింది. ప్రపంచ స్థాయిలో అయిదో ర్యాంక్‌లో నిలిచాను.

ఆ తరువాతే చాలామందికి తెలిసింది...

ఇప్పటివరకూ ఇండియాలో, విదేశాల్లో 200కు పైగా పోటీల్లో పాల్గొన్నాను. ఎన్నో పతకాలు గెలిచాను. మన దేశంలో మొదటి ప్రొఫెషనల్ మహిళా సుమో రెజ్లర్‌గా ఖ్యాతిని, పలు పురస్కారాలను అందుకున్నాను. కొన్నిసార్లు పురుషులతోనూ పోటీ పడి నా ప్రతిభను నిరూపించుకున్నాను. 'లిమ్కా బుక్‌ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు చోటుచేసుకుంది. కిందటి ఏడాది నా జీవిత కథతో 'సుమో దీదీ' అనే సినిమా రూపొందింది. కొత్త దర్శకుడు జయంత్ రోహత్గీ ఈ సినిమా గురించి ప్రతిపాదనతో వచ్చినప్పుడు... మొదట్లో సంకోచించినా, నా కథ కొందరికైనా స్ఫూర్తినిస్తుందనే ఉద్దేశంతో ఒప్పుకున్నాను. ఆ సినిమాలో నా పాత్రను శ్రియమ్ భగ్నానీ పోషించారు. 2023 'టోక్యో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం', ఈ ఏడాది 'పామ్ స్ప్రింగ్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం', '24వ న్యూయార్క్ ఇండియన్ చలన చిత్రోత్సవం' తదితర పలు ప్రతిష్ఠాత్మకమైన చిత్రోత్సవాల్లో 'సుమోదీదీ' ప్రదర్శితమయింది. ప్రేక్షకుల నుంచి, విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. నిజానికి ఆ సినిమా తరువాతే నా గురించి మన దేశంలో చాలామందికి తెలిసిందన్నా అతిశయోక్తి లేదు.

అదే నా తపన...

నన్ను కలిసిన ఎంతోమంది పిల్లలు సుమో రెజ్లర్స్ అవుదామనుకుంటున్నామని చెప్పినప్పుడు... ఎంతో సంతోషం కలుగుతూ ఉంటుంది. సుమో రెజ్లింగ్‌లో మన దేశం నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచాలి. ఎక్కువమంది అమ్మాయిలు ఈ క్రీడను కెరీర్‌గా ఎంచుకోవాలి. ఇదే నా తపన. అందుకే తీరిక సమయాల్లో ముంబాయిలోని పాఠశాలలకు వెళ్ళి, కుస్తీ, జూడో, సుమో రెజ్లింగ్‌లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నాను. ఇది కేవలం పోటీల్లో పాల్గొనడం, పతకాలను గెలవడానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. ముఖ్యంగా అమ్మాయిలపై సామాజికమైన నియంత్రణలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటినీ దాటాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. దానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయి. ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండి, పట్టుదలతో, అంకిత భావంతో కృషి చేస్తే విజయం తప్పకుండా లభిస్తుంది. దానికి నేనే ఉదాహరణ."



ఒంటరిగా ఎదిగి... ప్రేరణగా నిలిచి

స్ఫూర్తి

జీవితం ఆమెకు వడ్డించిన విస్తరి కాదు. ప్రేమించినవాడి మోసానికి బలయింది. పెళ్లి కాకుండానే పిల్లాడికి తల్లి అయింది. చంకలో బిడ్డ... మంచాన పడ్డ నాన్న... ఒంటరిగా బతుకు పోరు మొదలుపెట్టి... సొంతంగా ఒక కంపెనీ ప్రారంభించి... నేడు తనలాంటి మహిళలకు ఉపాధి మార్గమయింది. అవరోధాలనే అవకాశాలుగా మార్చుకొని... ప్రతి పనినీ ఒక సవాలుగా తీసుకొని... ఎందరికో స్ఫూర్తిమంత్రమైన గిరిజన మహిళ **యంగ్‌మిలా జిమిక్** కథ ఇది.



"కష్టాలు ఎదురయ్యాయని బాధపడుతూ కూర్చుంటే జీవితం అక్కడే ఆగిపోతుంది. జీవితమంటేనే పోరాటం. ఈ సత్యం నాకు చిన్న వయసులోనే బోధపడింది. మణిపూర్ ఉఖరుల్ జిల్లాలో ఓ పేద గిరిజన కుటుంబం మాది. పెద్దగా చదువుకోలేదు. యుక్త వయసులో ఒక వ్యక్తితో ప్రేమలో పడ్డాను. పెళ్లి చేసుకొంటానన్న అతడి మాటలు నమ్మి.. బిడ్డకు తల్లినయ్యాను. తీరా బిడ్డ పుట్టాక నన్ను వదిలేసి వెళ్లిపోయాడు. ఇదంతా 1991లో. అప్పటికి నా వయసు 21 సంవత్సరాలు. అవివాహిత తల్లిగా ఈ సమాజం చూసే చూపు నాకు నిద్ర లేని రాత్రులు ఎన్నో మిగిల్చింది. అయితే తేరుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఎందుకంటే నా మీద ఆధారపడి రెండు ప్రాణాలున్నాయి. మా అబ్బాయి, రోగంతో మంచంలో ఉన్న మా నాన్న.. ఇద్దరి బాధ్యత తీసుకున్నాను. బాధను దిగమింగుకొని, అవహేళనలను భరించాను.

కూరగాయలు అమ్ముతూ...

నాకంటూ ఏ ఆధారం లేదు. కానీ నాతోపాటు మరో ఇద్దరిని బతికించాలి. ఏంచేయాలో తోచలేదు. ఆలోచించాను. చేతిలో నాలుగైదు వందలు ఉన్నాయి. వాటితో కూరగాయలు కొన్నాను. వాటిని బుట్టలో పెట్టుకుని, తెల్లవారుజామునే నేను నివసించే ఫరుంగ్ గ్రామం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని ఉఖరుల్ పట్టణానికి నడిచి వెళ్లేదాన్ని. మధ్యలో కొండలు ఎక్కి దిగాలి. మధ్యాహ్నం వరకు అమ్మి, ఇంటికి రావడం... భోజనం చేసి తిరిగి వెళ్లడం... ఇలా పదేళ్లు రాత్రనక పగలనక కష్టపడ్డాను. ఇది నేను కోరుకున్న జీవితం కాదు. కానీ పరిస్థితులకు తగినట్టు సర్దుకుపోతేనే ముందడుగు వేయగలం.



సరికొత్త ప్రయత్నం...

కూరగాయల వ్యాపారం అంత లాభసాటిగా లేకపోవడంతో... పాత దుస్తులు అమ్మడం మొదలుపెట్టాను. దాంతోపాటే పౌల్ట్రీ రంగంలో ప్రయత్నించాను. ఆశించిన ఫలితాలు రాలేదు. ఎన్నో ఒడుదొడుకుల తరువాత 2016లో కానీ ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోయాను. ఆ ఏడాది ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి దిగాను. దాని కోసం ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాను. కేవలం ఐదు వందల రూపాయల పెట్టుబడితో అంకుర సంస్థ... 'షిరిన్ ఫుడ్స్' నెలకొల్పాను. క్యాండీలు తయారు చేసే సంస్థ ఇది. దీని ద్వారా నేను తెచ్చిన మొట్టమొదటి ఉత్పత్తి... ఉసిరికాయ క్యాండీ. దానికి మంచి ఆదరణ లభించింది. తరువాత నుంచి ఆలివ్, యాపిల్, అంజీరా, మామిడి తదితర పండ్లతో క్యాండీలు తయారు చేస్తున్నాం. స్థానికంగా బాగా అమ్ముడుపోయాయి.

ఇతర ప్రాంతాల్లోనూ...

తొలి ప్రయత్నం విజయవంతం కావడంతో ఆర్గానిక్ పచ్చళ్ల తయారీ కూడా ప్రారంభించాను. పచ్చిమిర్చి, వెల్లుల్లి, వంకాయ వంటి వాటితో పచ్చళ్లు చేసి విక్రయానికి పెట్టాం. వెంటనే అమ్ముడుపోయాయి. పచ్చళ్ల తయారీలో 'కృషి విజ్ఞాన్ కేంద్ర' (కేవీకే) వారి వద్ద శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం ఉఖరుల్ ప్రాంతంలో ఒక యూనిట్ నడుస్తోంది.మా ఉత్పత్తులు ఇప్పుడు మణిపూర్‌లోనే కాదు... అస్సాం, నాగాలాండ్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో కూడా అందుబాటులో ఉన్నాయి. ఫేస్‌బుక్, ఇతర ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయిస్తున్నాం. ఆరంభంలో ఇంటింటికీ తిరిగి అమ్మేవాళ్లం. నాకు సాయం కోసం ఒకే ఒక వర్కర్ ఉండేది. ప్రస్తుతం పన్నెండు మంది గిరిజన మహిళలు పని చేస్తున్నారు. ఏ దిక్కూ లేని నేను ఇవాళ కొంతమందికైనా ఉపాధి అవకాశాలు కల్పించగలిగానంటే... ఎంతో సంతోషంగా ఉంది.

ఒక తల్లిగా...

ఇప్పుడు మా అబ్బాయి కూడా ఎదిగొచ్చాడు. వాడికి ఆరేళ్లప్పుడు మా నాన్న తనతో నాగాలాండ్ తీసుకువెళ్లారు... మంచి చదువులు చదివించడానికి. ఒక్కగానొక్క బిడ్డ దూరంగా వెళుతుంటే నన్ను నేను నియంత్రించుకోలేకపోయాను. వాడు కూడా బిక్క ముఖం వేశాడు. కానీ తప్పదు. కొన్ని సాధించాలంటే కొన్ని వదులుకోవాలి. నా బిడ్డ బంగరు భవిత కోసం నేను దాదాపు ఇరవై ఏళ్లు వాడికి దూరంగా గడిపాను. పదేళ్ల కిందట మా అబ్బాయి తిరిగి వచ్చాడు. 'మా అమ్మను చూసి నేను గర్వపడుతున్నా. ఎన్నో సవాళ్లు, ఒడుదొడుకులు. వేటికీ వెనకడుగు వేయలేదు. ధైర్యంగా అన్నిటినీ ఎదుర్కొని... తన కాళ్లపై తాను నిలబడడమే కాదు, తనలాంటి మరికొంతమంది మహిళలకు అండగా నిలుస్తోంది. అందుకే అమ్మను చూసినప్పుడు నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. నా ముందు నిలుచున్న ప్రేరణ శక్తిగా అనిపిస్తుంది' అంటూ మా అబ్బాయి నా గురించి సందర్భం వచ్చినప్పుడల్లా అందరికీ చెబుతుంటాడు. అది వాడికి నా మీద ఉన్న ప్రేమ.

అవార్డులు... రివార్డులు...

నా ఈ ప్రయాణంలో ప్రతిష్ఠాత్మక అవార్డులు కూడా వరించాయి. 'విజయలక్ష్మి దాస్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' అవార్డుతో పాటు 'అసోం ఉమెన్ ఆంట్రప్రెన్యూర్స్' పురస్కారం కూడా అందుకున్నాను. మణిపూర్ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వయంశక్తితో ఎదగడానికి స్ఫూర్తి రగిలించి, వారి జీవన స్థితిగతుల్లో మార్పునకు ప్రభావవంతమైన పాత్ర పోషించినందుకు గానూ నాకు ఈ అవార్డులు లభించాయి. అంతేకాకుండా భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ నిర్వహించే పలు వర్క్‌షాపులకు వెళ్లి వివిధ అంశాలపై మాట్లాడుతుంటాను. నాకంటూ పెద్దగా కోరికలు ఏమీ లేవు. స్వయంకృషితో ఎదగాలనుకొనే మహిళలకు నేను ఒక స్ఫూర్తిమంత్రం కావాలని కోరుకొంటున్నా. ఈ సంస్థను విస్తరించి... మరింత మందికి ఉపాధి మార్గంగా నిలవాలనే ధ్యేయంతో పని చేస్తున్నా."

యుక్తవయసు రాకముందే...

పిల్లలు పెరిగి పెద్దవారై జీవితంలో విజయం సాధించాలంటే తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. పిల్లలకు చిన్నతనంలోనే క్రమశిక్షణ, నైతిక విలువలు, కష్టపడే తత్వం తదితరాల ప్రాముఖ్యాన్ని వివరించాలి. వీటినే పునాదులుగా చేసుకొని పిల్లలు ఉన్నత శిఖరాలు చేరుకోగల్గుతారు. యుక్తవయసు రాకముందే పిల్లలకు తల్లిదండ్రులు ఏ పనులు నేర్పించాలో తెలుసుకుందాం.

వంటింటి పనులు: తల్లిదండ్రులు వంట చేసేటపుడు సహాయం చేయమని అడిగితే పిల్లలు సంతోషపడతారు. కూరగాయలు కడగడం, వాటి తొక్క తీయడం వంటివి చెప్పి చేయించండి. బ్రెడ్‌కు వెన్న రాయడం, శాండ్‌విచ్‌లు తయారు చేయడం, గుడ్లు గిలక్కొట్టడం, ఉడికించిన గుడ్లకు పెంకు తీయడం, చపాతీలు పామడం, బియ్యం కడగడం, వంట పూర్తయిన తరవాత స్టవ్ శుభ్రం చేయడం, చిన్న పళ్లాలు-గిన్నెలు-గ్లాసులు కడగడం వంటి వాటిని పిల్లలకు నేర్పించండి. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

గది సర్దడం

పిల్లలకు వారి గదిని అందంగా ఉంచుకోవడం నేర్పించాలి. ఉదయం నిద్ర లేవగానే వారు కప్పుకున్న దుప్పటి మడతపెట్టి దానిని నిర్దేశిత స్థానంలో ఉంచమని చెప్పి చేయించాలి. మంచం మీద దుప్పటిని చక్కగా పరచడం, దిండుని సరిగా పెట్టడం నేర్పించాలి. బొమ్మలతో ఆడుకున్నాక వాటిని అరల్లో సర్దమని చెప్పాలి. పాఠశాలకు తీసుకెళ్లే బ్యాగ్, పుస్తకాలను నిర్లక్ష్యంగా పడేయకుండా టేబుల్ మీద సర్దుకోవడం చేసి చూపించాలి. సెలవు రోజుల్లో గదిని ఊడవడం, తుడవడం; కిటికీ తలుపులు, ఫ్యాన్ రెక్కలను శుభ్రం చేయడం వంటి వాటిని పిల్లలతో చేయించాలి.



చెత్త బుట్ట: పనికిరాని కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర చెత్తను నిర్దేశిత బుట్టలో వేయాలని పిల్లలకు చెప్పండి. తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసే విధానాన్ని తెలియజెప్పాలి. చెత్తను తీసుకెళ్లే పారిశుధ్య కార్మికులు ఇంటి ముందుకి వచ్చినపుడు వారికి చెత్త బుట్టలను ఇచ్చే పనిని పిల్లలకు చెప్పి చేయించండి. దీనివల్ల పిల్లలకు పరిశుభ్రత విలువ, పర్యావరణ రక్షణ తదితర అంశాలు అర్థమవుతాయి.

ఇంటి పనులు: తల్లిదండ్రులు ఇంట్లో చేసే పనుల్లో సులభమైనవాటిని పిల్లలకు అప్పజెప్పడం మంచిది. మొక్కలకు నీళ్లు పోయడం, బల్బు లేదా ట్యూబ్‌లైట్ మార్చడం, నీళ్లు పట్టడం, కిరాణా కొట్టు నుంచి అవసరమైనవాటిని కొనుక్కుని రావడం, సంతకెళ్లి పండ్లు లేదా కూరగాయలు తీసుకురావడం, రేషన్ షాపు ముందు క్యూలో నిల్చోవడం వంటి వాటిని పిల్లలచేత చేయించాలి. దీనివల్ల పిల్లల్లో సానుకూల దృక్పథం, సంభాషణా నైపుణ్యం పెరుగుతాయి. తోటివారితో మెలగాల్సిన తీరు అర్థమవుతుంది. ఏదైనా సమస్య వస్తే సొంతంగా పరిష్కరించుకునే తెలివి అలవడుతుంది.

సమయపాలన: పిల్లలకు అన్ని పనులను సమయానుసారం చేయడం నేర్పించాలి. ఉదయాన్నే లేవడం, ఆలస్యం కాకుండా పాఠశాలకు వెళ్లడం, బద్ధకించకుండా హోం వర్క్ చేసుకోవడం, సమయానికి నిద్రపోవడం అలవాటు చేయాలి. పనులను వాయిదా వేయడాన్ని ప్రోత్సహించవద్దు. ఎప్పటి పనులు అప్పుడే చేయమని కచ్చితంగా చెప్పి చేయించండి. దీనివల్ల పిల్లలకు సమయపాలన అలవడుతుంది. ఇది వారి ఉన్నత స్థితికి కారణమవుతుంది కూడా.

పొదుపు

డబ్బుని పొదుపుగా వాడడం ఎలానో పిల్లలకు తెలియజెప్పాలి. వారికిచ్చే పాకెట్‌మనీని అవసరం మేరకు వాడుకుని మిగిలిన మొత్తాన్ని దాచమని చెప్పాలి. దాచుకున్న డబ్బుతో మంచి పుస్తకాలు లేదంటే ఇష్టమైన బొమ్మలు కొనుక్కోవడం, స్నేహితులకు పుట్టినరోజున బహుమతులు ఇవ్వడం వంటివి నేర్పించాలి. అనవసరంగా డబ్బు ఖర్చు చేయవద్దని గట్టిగా చెప్పాలి.